మన సమగ్ర
ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

Wanted Reporters
తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న
ప్రజావాణి దిన పత్రిక మరియు మన ప్రజావాణి NEWS TV చానల్
నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
(కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత)
Ph:9440032006

రాజన్న సిరిసిల్ల	ఆదివారం	06.09.2026	సంపుటి : 01	సంచిక : 248	పేజీలు : 12	వెల : 2/-
RAJANNA SIRICILLA	SUNDAY	06.09.2026	Volume : 01	Issue :248	Pages : 12	Cost : 2/-

4 రాష్ట్రాల్లో జనగణన

– ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 05 : కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముం దుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసిం ది. ఈ ఏడాది డిసెంబర్ 1న మిగతా2లో...

ఉక్రెయిన్‌పై దాడులకు విరామం..

పుతిన్ కీలక ఆదేశం



మాస్కో సెప్టెంబర్ 05 :రష్యా–ఉక్రెయిన్ మ ధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న యుద్ధంలో శనివారం నాడు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్‌పై మూడు రోజుల పాటు దాడులను నిలిపివేయాలని రష్యా సైన్యాన్ని

మిగతా2లో...

సీట్లు పెరిగితే 117 గెలుస్తాం

- ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం

● కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా? ● సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా ● సిద్దిపేటలోనూ కాంగ్రెస్ దే గెలుపు ● వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు ● ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు ● ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా? ● ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం ● నకిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ● వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం

హైదరాబాద్,సెప్టెంబర్05 : ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావా లని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్?కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్ గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని మిగతా2లో...

‘చెత్త సేకరణ’ను రాంకీకి

అప్పగించొద్దు

● ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి ● లేదంటే సీఎం ఇంటి ముందే 1000 ఆటోల చెత్త పోస్తాం : కల్వకుంట్ల కవిత

హైదరాబాద్,సెప్టెంబర్ 05 : చెత్త సేకరణ కాంట్రాక్టును రాంకీ సంస్థకు అప్పగించే యోచనను విరమించుకోవాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. లేకుంటే వెయ్యి స్వచ్ఛ ఆటోల చెత్తను సీఎం ఇంటి ముందు పోస్తామని ఆమె

మిగతా2లో...

మూడు తరాల్ని ముంచేశారు

దగ్గర్లోనే కాంగ్రెస్‌ను నిషేధిత జాబితాలో పెట్టే రోజులు

పాలిటెక్నిక్ భూములపై ప్రభుత్వం కన్ను..జీవో 97ను అసెంబ్లీలో

ఎండగడతాం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోంది

2ఏతో ప్రజల భూములను లాక్కునే కుట్ర

కేసీఆర్ ప్రభుత్వం బాటలో రేవంత్ కూడా..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

హైదరాబాద్,సెప్టెంబర్ 05 : హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏకంగా రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌తో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, హైదరాబాద్‌కు గ్లోబల్ ఏఐ రంగంలో మరింత కీలక స్థానం దక్కనుంది. పీటీఐ కథనం ప్రకారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ హైదరాబాద్‌లో 264 ఎకరాల భూమిని దక్కించుకున్నట్లు శనివారం ప్రకటించింది. ఇక్కడ భారీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు.ఈ డేటా సెంటర్ సామర్థ్యం మిగతా2లో...

దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి

గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం

దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సిఎం రేవంత్

ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- అధికారులకు కీలక సూచనలు చేసిన స్పీకర్, చైర్మన్

సీట్లు పెరిగితే 117 గెలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు. మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

మూడు తరాల్ని ముంచేశారు

కరీంనగర్,సెప్టెంబర్ 05 : 'కాంగ్రెస్ పార్టీనే నిషేధిత జాబితాలో పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.. ఒక్క మంత్రినే బర్తరఫ్ చేయడం కాదు.. ఆ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులొచ్చాయి' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చ కపోవడాన్ని నిరసిస్తూ.. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన 'యువ సమరభేరి' సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చి 100 రోజుల్లో అమలు చేస్తామని డైలాగులు కొట్టి వెయ్యి రోజులు దాటినా ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. బకాసురుల్లా మేస్తూ, కుంభకర్ణుల్లా పడుకుంటూ, పందికొక్కుల్లా తింటూ పాలనను గాలికి వదిలేశారన్నా రు. 'ఇన్ని రోజులుగా యువతను మోసం చేసిన ధోకేబాజ్ రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి. పేదల భూములను నిషేధిత జాబితాలో పెడుతున్న కాంగ్రెస్‌ను రాబోయే రోజుల్లో ప్రజలే నిషేధిత జాబితాలో పెట్టడం ఖాయం' అని అన్నారు. **పాలిటెక్నిక్ భూములపై కాంగ్రెస్ కన్ను..**సిరిసిల్ల, వేములవాడ (అగ్రహారం) పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులను కలిసి కేటీఆర్ మాట్లాడారు. జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20 రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు బీఆర్ఎస్ పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పాలిటెక్నిక్ కళాశా లలను లేబర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 97 వెనుక పెద్ద కుట్ర ఉందన్నా రు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్, సిరిసిల్ల, కరీంనగర్‌లోని విలువైన పాలిటెక్నిక్ భూములు, ఆస్తులను ఇతర అవసరాలకు మళ్లించేందుకే ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. జీవో 97ను రద్దు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులపై కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ పర్యటనలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితర నాయకులు పాల్గొన్నారు. **అలుగునూరులో తృటిలో తప్పిన ప్రమాదం** కేటీఆర్‌కు కరీంనగర్ శివారులోని అలుగునూరు చౌరస్తా వద్ద మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. భారీ క్రేన్‌తో గజమాల వేసి సన్మానించాయి. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు కేటీఆర్‌కు పోటీపడి చేతినిండా రాఖీలు కట్టారు. కేటీఆర్ కారు వెనుక డోర్ తెరిచి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సమయంలో పక్క నుంచి వెళ్తున్న ఓ లారీ ఢీకొట్టడంతో కారు డోర్ స్వల్పంగా దెబ్బతిన్నది.

264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

(మొదటి పేజీ తరువాయి)

గరిష్ఠంగా 1 గిగావాట్ (జీడబ్ల్యూ) వరకు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు ఉపయోగించుకునేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించనున్నారు. అధిక సామర్థ్యం ఉన్న కంప్యూటింగ్ సిస్టమ్స్‌ను నిర్వహించేందుకు లిక్విడ్-కూల్డ్ టెక్నాలజీతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ ప్రాంతంలో నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయని హైపర్‌వాల్ట్ తెలిపింది. ఈ మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించేందుకు హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో వచ్చే మార్పులను బట్టి ఈ ప్రాజెక్ట్‌ను దశలవారీగా చేపట్టనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి, దేశానికి "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలపై హైదరాబాద్ దృష్టి పెడుతోందని చెప్పారు. "ఈ దశాబ్దం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది. ఏఐ మోడల్స్, వాటిని నడిపించే కంప్యూటింగ్ సామర్థ్యం వేగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా మారుతున్నాయి. ఈ కంప్యూటింగ్ సదుపాయం తెలంగాణలో ఉండటం మనకు ఒక అదనపు ప్రయోజనం" అని రేవంత్ రెడ్డి అన్నారు. డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణంలో గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడంతో పాటు, నీటి వినియోగాన్ని సమతుల్యం చేసే డిజైన్ విధానాలను పాటించనున్నట్లు కంపెనీ తెలిపింది.టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె. కృతివాసన్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ తమ "ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టు-ఇంటెలిజెన్స్" వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఏఐకి సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను టీసీఎస్ క్లౌడ్, ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యాలతో కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌కు అవసరమైన స్థాయి, ప్రతిభ, టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయి" అని కృతివాసన్ అన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి.దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

హైదరాబాద్,సెప్టెంబర్ 05 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం

తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

4 రాష్ట్రాల్లో జనగణన

(మొదటి పేజీ తరువాయి)

జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (RGI - రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించ నున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఉక్రెయిన్‌పై దాడులకు విరామం.. పుతిన్ కీలక ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు పుతిన్ ఆదేశించారు. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. యుద్ధం ముగింపు కోసం చర్చలు జరిపే ఉద్దేశంతో అమెరికా ప్రత్యేక ప్రతినిధిలు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లు మాస్కో చేరుకోవడంతో పుతిన్ తాజా ఆదేశాలిచ్చారు.

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు కొత్త, స్పష్టమైన ప్రతిపాదన తన వద్ద ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చెప్పిన మరుసటి రోజే అమెరికా ప్రత్యేక ప్రతినిధుల మాస్కో పర్యటన చోటుచేసుకుంది.కాగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం చర్చల వేళ దాడులు చేసుకోవద్దని శుక్రవారంనాడు రష్యాకు ప్రతిపాదించారు. తమ వైపు నుంచి ఎలాంటి దాడులు ఉండవని, ప్రత్యర్థి నుంచి కూడా ఇదే ఆశిస్తున్నామని చెప్పారు. ఉక్రెయిన్, రష్యా మధ్య వైమానిక దాడులు పెరిగిన సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు జరుగుతుండటం విశేషం. శుక్రవారం కీవ్‌లోన ఉక్రెయిన్ భద్రతా సంస్థ ఎస్‌బీయూ ప్రధాన కార్యాలయంపై రష్యా డ్రోన్ దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత జరిగిన అత్యంత ప్రముఖ దాడుల్లో ఇది ఒకటిగా చెబుతున్నారు. రాత్రికి రాత్రి 167 డ్రోన్లను రష్యా ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది.

ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్,సెప్టెంబర్ 05 : సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ, శాసన మండలి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శాసన వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత సమావేశాల కంటే వేగంగా, సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే అవకాశం ఉందని గుత్తా అన్నారు.సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి? ఆదేశించారు. సభ్యులకు అందించే మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతా వరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్, ఛైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. ధర్నాలు, రాస్తారో కోలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం వేగంగా అసెంబ్లీ అధికారులకు చేరేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలన్నారు.సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందే అందించాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచిం చారు. ఉభయ సభల సమావేశాలు ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం తరఫున సమావేశాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ-బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు.

'చెత్త సేకరణ'ను రాంకీకి అప్పగించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆమె స్వచ్ఛ ఆటో కార్మికులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం రాంకీ సంస్థకు చెత్త సేకరణ బాధ్యతలు అప్పగిస్తోందని, ప్రాపర్టీ ట్యాక్స్ లో కలిపి చెత్త పైసలు వసూలు చేస్తే తమ ఉపాధి దెబ్బతింటుందని కార్మికులు ఆమెతో వాపోయారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, రాంకీ సంస్థకు లాభం చేయడానికి స్వచ్ఛ ఆటో కార్మికుల పొట్టకొట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా స్వయం ఉపాధి పొందుతున్న వారిని రాంకీ సంస్థకు జీతగాళ్లుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. స్వయం ఉపాధి ద్వారా మంచి ఆదాయం పొందుతున్న వారికి నెలకు రూ.16 వేలు మాత్రమే జీతం ఇచ్చేలా రేవంత్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని తప్పుపట్టారు. హైదరాబాద్ లో 20 వేల ఆటోల ద్వారా 40 వేల మంది స్వచ్ఛ ఆటో కార్మికులు ఇంటింటి నుంచి చెత్త సేకరిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. చెత్త సేకరణ యథావిధిగా కార్మికులతోనే చేయించాలని ఆమె డిమాండ్ చేశారు. స్వచ్ఛ ఆటో కార్మికులకు ప్రభుత్వం రూ.20 లక్షల ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. రాంకీ సంస్థ నిర్వహిస్తున్న డంపింగ్ యార్డ్ వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై సీఎం స్పష్టత నివ్వాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోంది

హైదరాబాద్,సెప్టెంబర్ 05 :

సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

ఉపాధ్యాయులను సన్మానించిన ప్రభుత్వ విప్...

● ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య.

సెప్టెంబర్ 05 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి యాదాద్రి భువనగిరి జిల్లా మూటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో నిర్వహించిన మార్నింగ్ వాక్ లో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించు కొని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య శనివారం రోజు ఉపాధ్యాయులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి న ఎమ్మెల్యే పాఠశాలల్లో విద్యార్థులకు అందు తున్న విద్యా సౌకర్యాలు , పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఉపాధ్యాయుల సేవలను అభినందిస్తూ వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యా యుల పాత్ర ఎంతో గొప్ప దని , విద్యార్థులకు నాణ్య మైన విద్య అందించడం తో పాటు వారిలో మంచి విలువలు,క్రమశిక్షణ పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినంద నీయమని బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి , విద్యార్థు లకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందు కు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

అసెంబ్లీకి రాని కేసీఆర్ రాజీనామా చేయాలి

● వజ్రేష్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి డిమాండ్
● ఈ సి ఐ ఎల్ వద్ద కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన ధర్నా

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 5 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) ఈసీఐఎల్‌లో కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన ధర్నాఅసెంబ్లీకి రాని కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని వారు ఆరోపించారు. శాసనసభకు రాకుండా, ప్రజల సమస్యలపై మాట్లాడకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌తో ఎవరికీ కూడా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలో భారీ నిరసన ధర్నా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తోటకూర వజ్రేష్‌యాదవ్, మందుముల పరమేశ్వర్‌రెడ్డి విచ్చేసి మాట్లాడారు కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత హోదాలో జీతభత్యాల కోసం రూ.1.24 కోట్లు, భద్రత, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు, ఇతర వసతుల కోసం మరో రూ. 21 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చు అవుతుందని ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్‌యాదవ్, మందుముల పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజాధనంతో ఫామ్ హౌస్‌కు పరిమితమైన కేసీఆర్‌కు ప్రధాన ప్రతిపక్ష నేతగా కొనసాగే అర్హత లేదన్నారు. రేపటి నిరసన సభకు భారీగా తరలి రండి ఇదే డిమాండ్ తో ఈనెల 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే నిరసన సభను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్‌యాదవ్, మందుముల పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఇందిరా పార్కు వద్ద జరిగే నిరసన సభకు ఉప్పల్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలి రావాలన్నారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ,మాజీ కార్పొరేటర్లు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు,ఎస్ సి సెల్,బీసీ సెల్,మైనారిటీగా,మహిళా కాంగ్రెస్,యూత్ కాంగ్రెస్, నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం

● ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం ఆగస్టు 05ఈరోజు మిర్యాలగూడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ హాజరయ్యారుఈ సందర్భంగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి జ్యోతి వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను కొనియాడారు.“గురుర్ బ్రహ్మా, గురుర్ విష్ణుః, గురుర్ దేవో మహేశ్వరః” అనే శ్లోకాన్ని ప్రస్తావిస్తూ, గురువు దేవుడితో సమానమని, విద్యార్థులకు జ్ఞానాన్ని అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధర్మనాయక్, హెడ్‌మాస్టర్ లాలునాయక్, ఉపాధ్యాయులు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, 5వ వార్డు ఇన్‌చార్జి కేతావత్ జవహర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు కొమ్ము దాసు, కొండా లక్ష్మణ్, ప్రవీణ్, బొంగర్ల వినోద్, వేణు, సైదులు, అభి, శివ, దైద, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో ఎగిసిన గులాబీ జెండా: బీఆర్ఎస్ భారీ నిరసన ర్యాలీతో మార్మోగిన మండల కేంద్రం!

● కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, దగాకోరు పాలనపై ధ్వజమెత్తిన జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు!

వెంకటాపురం (నూగూరు), సెప్టెంబర్ 05 (ప్రజావాణి):కాంగ్రెస్ ప్రభుత్వం అధికార పీఠమెక్కి వెయ్యి రోజులు గడిచినా, ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన ‘ఆరు హామీలు’ సహా ఎలక్షన్ వాగ్దానాలలో ఏ ఒక్కదానిని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని ఆరోపిస్తూ వెంకటాపురం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శ్రేణులు శనివారం కనులపండువగా, వేలాది మంది జనసందోహంతో భారీ నిరసన ర్యాలీని, ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించాయి. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న “సమరభేరి” ఆందోళనల్లో భాగంగా మండల వ్యాప్తంగా ఉన్న గులాబీ శ్రేణులు పెద్ద సంఖ్యలో మండల కేంద్రానికి చేరుకొని ప్రధాన రహదారులపై భారీ ఊరేగింపు నిర్వహించాయి. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా, రైతులు, మహిళలు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా గులాబీ శ్రేణులు చేసిన నినాదాలతో పురవీధులు మార్మోగాయి.
హామీల అమలులో ప్రజలను నిలువునా దగా చేశారు:
ఈ భారీ నిరసన ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజుల్లోనే ఆరు హామీలను ఆచరణలోకి తెస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రజలను బాకీల ఊబిలోనే ఉంచారని తీవ్రంగా ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఇస్తామన్న భృతిని మర్చిపోయారని, మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సహాయం అందించే మహాలక్ష్మి పథకాన్ని మూలనపడేశారని మండిపడ్డారు. కర్షకులకు ఇస్తామన్న పూర్తిస్థాయి రుణమాఫీ కాగితాలకే పరిమితమైందని, ఏకకాలంలో రుణమాఫీ కాక రైతులు వడ్డీల భారం మోస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ఇచ్చిన 420 వాగ్దానాలన్నీ బోగస్ అని ఈ వెయ్యి రోజుల పాలనతో స్పష్టమైందని విమర్శించారు.
బీసీ మహిళా మంత్రిపై వివక్ష... రేవంత్ రెడ్డి వైఖరిపై మండిపాటు:
ఇదిలా ఉండగా, వెనుకబడిన తరగతుల (బీసీ) సామాజిక వర్గానికి చెందిన సీనియర్ మహిళా నేత, మంత్రి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకపక్షంగా మంత్రివర్గం (కేబినెట్) నుండి బర్తరఫ్ చేయడం కాంగ్రెస్ పార్టీ యొక్క బీసీ వ్యతిరేక వైఖరికి స్పష్టమైన నిదర్శనమని లక్ష్మణ్ బాబు తీవ్రంగా ఆరోపించారు. ఒక బీసీ మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా, కనీసం వివరణ కోరే అవకాశమివ్వకుండా మంత్రివర్గం నుంచి హఠాత్తుగా తొలగించడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. సామాజిక న్యాయం అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, ఆచరణలో బీసీ నాయకులను అణచివేయడానికి ప్రయత్నిస్తోందని, బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలపై నిర్లక్ష్యం:
మండలంలో వ్యవసాయ రంగాన్ని, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని నాయకులు ఆరోపించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరిగా అందడం లేదని, నకిలీ ఎరువుల విక్రయాలను అరికట్టడంలో యంత్రాంగం నిద్రపోతోందని మండిపడ్డారు. గిరిజన, ఏజెన్సీ ప్రాంత ప్రజలకు సంక్షేమ పథకాలు అందక అల్లాడుతున్నారని, ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడంలో ఈ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు.
ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటాం:
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి బాకీని చెల్లించే వరకు, వాగ్దానాలన్నీ నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ విశ్రమించదని, ప్రజాక్షేత్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యకర్తల కోలాహలం:
ఈ కార్యక్రమంలో పార్టీ వెంకటాపురం మండల అధ్యక్షుడు గంప రాంబాబు, పార్టీ సీనియర్ నాయకులు గూడవర్తి నరసింహమూర్తి, ముడుంబ శ్రీనివాస్, స్థానిక నాయకులు కాగలు, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ విభాగాల ప్రతినిధులతో పాటు పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు, రైతులు పాల్గొని నిరసన ర్యాలీని విజయవంతం చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు

● సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్

బెజ్జంకి,సెప్టెంబర్ 5 (ప్రజావాణి)ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని గూడెం గ్రామ పాఠశాల హెచ్ఎం రేవతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్ సరోజలను సర్పంచ్ శ్రీకాంత్ శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని, వారి సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో గూడెం సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి మెరుగు యాదగిరి పాల్గొని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

రైతులు బోనస్ కోసం ఆన్ లైన్ తప్పనిసరి చేసుకోవాలి

● మండల వ్యవసాయ అధికారి స్వామి నాయక్

పెద్దవంగర సెప్టెంబర్ 05 ప్రజావాణి.. వానాకాలం పంటలో బోనస్ కు వర్తించే 7 సన్న రకాలను రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు బిల్లులు, పట్టాదార్ పాసుబుక్ తీసుకొని క్లస్టర్ పరిధి లోని ఏఈఓ ల వద్దకు లేదా ఎరువుల ఎరువుల షాప్ దగ్గరకు వెళ్లి ఆన్ లైన్ లో నమోదు చేసుకుంటేనే బోనస్ వర్తిస్తుందిని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ జి. స్వామి నాయక్ తెలిపారు. 10 వ తేదీ లోగా ఈ ప్రక్రియ పూర్తిగా చేసుకోవాలని కోరడమైనది.నమోదు చేసుకోకపోతే ధాన్యం కొనుగోలు లో బోనస్ వర్తించగానే రైతులు ముందుగా వెళ్లి ఆన్లైన్ చేసుకోవాలని సూచించారు.

కొండా సురేఖ భర్తరఫ్‌ను ఉపసంహరించాలి..

● కాంగ్రెస్ సీనియర్ నేత తాజుద్దీన్ ఖాన్

ప్రజావాణి,ఇనుగుర్తి: కొండా సురేఖను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయడం సరైంది కాదని వెంటనే ఉపసంహరించాలని మండల కేంద్రం ఇనుగుర్తి కి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత తాజుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లను విజ్ఞప్తి చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం నుండి ఒక బడుగు బలహీన వర్గాల నాయకురాలు కొండా సురేఖను తొలగించడం సమంజసం కాదని పేర్కొన్నారు.ప్రజాబలం కలిగిన నాయకురాలిని భర్తరఫ్ చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టం వాటిల్లుతుందన్నారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, భవిష్యత్తులో పార్టీని విజయపథంలో తీసుకెళ్ళడానికి మార్గాలు, క్రింది స్థాయి కార్యకర్తలకు జరిగే ఇబ్బందులను తెలుసుకోవాలని అన్నారు. కొండా సురేఖ లాంటి సీనియర్ నాయకురాలిని మంత్రివర్గం నుండి తొలగించడం ఏమాత్రం సరైన నిర్ణయం కాదని, త్వరలో జరగబోవు నగరపాలక ఎన్నికలు మరియు ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల దృష్ట్యా కొండా సురేఖపై భర్తరఫ్ వేటును తొలగించాలని అన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి, త్యాగాల గాంధీ కుటుంబంపై భరోసాతో ఓట్లు వేసి గెలిపించారని, రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవ్వాలని, మళ్ళీ తెలంగాణలో కాంగ్రెస్ రావాలని ఈ సందర్భంగా అన్నారు.

ఉపాధ్యాయుల సేవలు సమాజానికి మార్గదర్శకం -- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి - BLR

ప్రజావాణి మిర్యాలగూడ ఆగస్టు 05డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి – BLR ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి – BLR పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు...విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని ఆయన పేర్కొన్నారు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, విలువలు, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన మార్గనిర్దేశం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.ప్రత్యేకంగా బాలికల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బాధ్యత మరింత గొప్పది.ఎందుకంటే ఒక బాలిక చదువుకుంటే ఒక కుటుంబం ఎదుగుతుంది.ఒక బాలిక ఉన్నతంగా ఎదిగితే ఒక తరం మారుతుంది.విద్యావంతురాలైన ఒక మహిళ సమాజాన్ని మార్చగలదు.అందుకే ఈ పాఠశాలలో చదువుతున్న ప్రతి బాలికలో నేను ఒక భవిష్యత్తు డాక్టర్‌ను, ఇంజనీర్‌ను, ఉపాధ్యాయురాలిని, శాస్త్రవేత్తను, పోలీస్ అధికారిణిని, IAS అధికారిణిని, ప్రజాప్రతినిధిని చూడాలనుకుంటున్నాను అని అన్నారు..డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయుడికి ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

● అధ్యక్షులుగా మంద రాకేష్, కార్యదర్శిగా హరీష్
● దూలిమిట్ట మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు నల్ల రాజేష్,

మద్దూరు సెప్టెంబర్ 5, ప్రజా వాణి,పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు సామాజిక పరివర్తకులు మందకృష్ణ మాదిగ మరియు సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ మంద కుమార్ మాదిగ,జిల్లా కన్వీనర్ ముక్కపల్లి రాజు మాదిగ కో ఇన్చార్జ్ మల్లిగారి యాదగిరి మాదిగ ఆదేశాల మేరకు శనివారం సిద్దిపేట జిల్లా దూలిమిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది . ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నల్ల రాజేష్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ సమాజంలో కులపరమైనటువంటి మతపరమైన వంటి వివక్షులు తొలగి పోయేంతవరకు దళితుల మీద దాడులు ఆగిపోయేంతవరకు ఉద్యమం నిరంతరాయంగా కొనసాగుతుందని నీ ఉద్యమానికి యువత నాయకత్వం వహించాలని అప్పుడే సమాజంలో మార్పు వస్తుందని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ దూలిమిట్ట అధికార ప్రతినిధి గుండె రాజు, బెక్కల్ గ్రామ శాఖ ఇన్చార్జ్ ఎర్ర కృష్ణయ్య మాదిగ మరియు కొండాపూర్ కుల సంఘ నాయకులు పెద్దలు యువత పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిటీనీ ప్రకటించారు. అధ్యక్షులుగా మంద రాకేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా మంద ప్రవీణ్ మాదిగ, అధికార ప్రతినిధిగా మామిడాల సుధాకర్ మాదిగ, కార్యదర్శిగా మంద హరీష్ మాదిగ, సంయుక్త కార్యదర్శిగా కొయ్యడ రాజేశం మాదిగ, కోశాధికారిగా బాకీ రమేష్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా బోడిక కళ్యాణ్ మాదిగ సలహాదారులుగా ఏనగందుల యాదగిరి,లింగాల సంపత్, మంద రాజు, బాకీ మొగిలిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది

కాంగ్రెస్ విఫల పాలనపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ధ్వజం...!

● పెవిలియన్ గ్రౌండ్ నుండి జడ్పీ సెంటర్ వరకు నిరసన ర్యాలీ

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా, ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను దగా చేసిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా, ఈ రోజు యువత, విద్యార్థి లోకం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గడిచిన మూడు సంవత్సరాలుగా వేలాది కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకీలు పెండింగ్‌లోనే ఉన్నాయని, రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ఇంజనీరింగ్ అడ్మిషన్ల సమయంలో నెల రోజుల్లో చెల్లిస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో కనీస వసతులు, నాణ్యమైన భోజనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమయానికి పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలు కూడా అందడం లేదని మండిపడ్డారు. ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రకటించిన

'యూత్ డిక్లరేషన్' ప్రకారం ప్రతి నెలా రూ. 4,000 చొప్పున మూడేళ్లకు రూ. 1.20 లక్షల నుండి రూ. 1.30 లక్షల వరకు నిరుద్యోగ భృతి బాకీ పడ్డారని తెలిపారు. 100 రోజుల్లో జాబ్ క్యాలెండర్, ఏటా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాల నోటిఫికేషన్లు మాత్రమేనని, మిగిలిన నియామకాలన్నీ కేసీఆర్ హయాంలో ప్రక్రియ పూర్తయినవేనని స్పష్టం చేశారు. యువత, విద్యార్థుల డిమాండ్ల సాధన కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని,

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్జేసి. కృష్ణ,పగడాల నాగరాజు,భీరెడ్డి నాగచంద్ర రెడ్డి,బచ్చు విజయ్ కుమార్,కర్నాటి కృష్ణ,మక్బుల్,పార్టీ ముఖ్య నాయకులు మరియు యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అజోల్లా సాగు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కార్యక్రమం

గరిడేపల్లి సెప్టెంబర్ 5(ప్రజావాణి) గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలో జ.ఎ.వా.ణ. సెయింట్ థెరిస్సా కాలేజ్ ఫర్ ఉమెన్, ఏలూరు విద్యార్థినులు, శ్రీ అరబిందో కృషి విజ్ఞాన కేంద్రం (KVK), గడ్డిపల్లి ఆధ్వర్యంలో రూరల్ పర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్ (RAWEP)లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అజోల్లా సాగు, దాని ఉపయోగాలు మరియు వ్యవసాయంలో దాని ప్రాధాన్యత గురించి రైతులకు వివరించారు. అజోల్లాను వరి వంటి పంటల్లో సేంద్రియ నత్రజని వనరుగా, జీవ ఎరువుగా ఉపయోగించడం ద్వారా నేల సారాన్ని మెరుగుపరచడంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చని విద్యార్థినులు వివరించారు. అలాగే పశువులకు అజోల్లాను పోషకాహారంగా ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను కూడా తెలియజేశారు. RAWEPలో భాగంగా విద్యార్థినులు కీతవారిగూడెం గ్రామంలో రైతులతో ప్రత్యక్షంగా మమేకమై ఆధునిక వ్యవసాయ పద్ధతులు,సాంకేతిక పరిజ్ఞానం,సేంద్రియ వ్యవసాయం,పంటల నిర్వహణ మరియు రైతులకు ఉపయోగపడే నూతన సాంకేతికతలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడటం, రైతుల్లో అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

"చేనేతను ఆదరించండి.. నేతన్నకు అండగా నిలవండి"

ఆర్మూర్ టౌన్ సెప్టెంబర్ 05(మన సమగ్ర ప్రజావాణి): చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించి, ధరించాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నేషనల్ జనరల్ సెక్రెటరీ, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ చౌల రాజేశ్వర్ అన్నారు. చేనేత కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదని, దాని వెనుక వేలాది కుటుంబాల జీవనాధారం, తరతరాలుగా వస్తున్న అద్భుతమైన కళ, భారతదేశ సాంస్కృతిక వారసత్వం దాగి ఉందని తెలిపారు. పర్యావరణానికి అనుకూలమైన చేనేత ఉత్పత్తులను వినియోగించడం ద్వారా చేనేత కార్మికులను ప్రోత్సహించవచ్చన్నారు. ఈ సందర్భంగా భారతీయ చేనేత రంగానికి సంబంధించిన పలు ఆసక్తికరమైన, ప్రజలకు తెలియని విషయాలను ఆయన వివరించారు. అలాగే ఆర్మూర్ పారిశ్రామిక సహకార ఉత్పత్తి సంఘం కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆర్మూర్‌లోని చేనేత సేల్స్ దుకాణాన్ని సందర్శించి, పలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. అనంతరం సహకార భవనంలో చౌల రాజేశ్వర్‌ను ఆర్మూర్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చెన్న రవికుమార్ ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కొంగి రాము, పాలక మండలి సభ్యులు గురుడు రామచందర్, వంగ ఆనంద్ కృష్ణ, అవధూత అరుంధతి, రేగుల్ల కవిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానించిన మద్దూరు సర్పంచ్ దామెర మల్లేశం

● 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ విద్యార్థులకు నగదు పురస్కారాలు

మద్దూరు సెప్టెంబర్ 5, ప్రజా వాణి సెప్టెంబర్ 5 న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మద్దూరు గ్రామ సర్పంచ్ దామర మల్లేశం స్థానిక జెడ్ పి హెచ్ ఎస్ మద్దూరు ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వర్ మొహియుద్దీన్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి జి. వరదరాజులు ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో మద్దూర్ ఉన్నత పాఠశాల మద్దూరు ప్రాథమిక పాఠశాల మండల విద్యా వనరుల శాఖ సిబ్బందిని మద్దూర్ ప్రీ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులను భవిత సెంటర్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పిహెచ్ఎస్ మద్దూర్ఉన్నత

పాఠశాల లో 10వ తరగతిలో2026 సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన సుహానాకు పదివేల రూపాయలు, అస్మా మరియు ఎండి ఆతీఫ్ లకు ఐదు వేల రూపాయల చొప్పున నగదు బహుమతిని అందజేసి విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు. అదేవిధంగా రాబోయే విద్యా సంవత్సరం కూడా 10వ తరగతి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇదే రకమైనటువంటి ప్రోత్సాహం ఉంటుందని ప్రకటించారు. వీలైనంత త్వరగా పాఠశాల విద్యార్థులందరికీ టి షర్ట్స్,ట్రాక్ పాంట్స్ పాఠశాల పేరుతో ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఏపీసీ చైర్మన్ బూరుగు హేమలత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామేశ్వర్ రెడ్డి,మద్దూరు గ్రామ ఉపసర్పంచ్ ఎండి షకిల్, మాజీ ఎంపీటీసీ శ్రీ బూరుగు నరసింహులు,మద్దూరు మండల హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు బోయిని మనోహర్,మద్దూరు గ్రామపంచాయతీ విద్యా కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్,అభి,షరీఫ్ మరియు వివిధ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మడికొండ సీఓఈలో ఇంటర్ కంప్యూటర్ సైన్స్ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

● ప్రజావాణి హనుమకొండ బ్యూరో నవీన్

మడికొండ, సెప్టెంబర్ 5: మడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల అత్యుత్తమ ప్రతిభా కేంద్రం (సీఓఈ)లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి. జయశ్రీ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో మొత్తం 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె వెల్లడించారు. ఇందులో ఎస్సీకి 13, ఎస్టీకి ఒకటి, బీసీకి రెండు, మైనారిటీకి ఒకటి, ఓసీకి ఒక సీటు చొప్పున కేటాయించినట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ సీట్లకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు ఉన్నత విద్యకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్న మడికొండ అత్యుత్తమ ప్రతిభా కేంద్రంలో ఇంటర్మీడియట్ కంప్యూటర్ సైన్స్ చదివే అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి. జయశ్రీ కోరారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

● జోగిపేటలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన ర్యాలీ

మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 05 (జోగిపేట) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జోగిపేటలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన "బీఆర్ఎస్వీ యూత్ నేతల పోరుబాట" కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్‌స్టాండ్ సమీపంలో మానవహారం నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ పాలనలో విద్యార్థులకు ఇలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే పాలిటెక్నిక్ విద్యను ఇంజినీరింగ్ విద్యగా గుర్తించాలని, 95 జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పి. జైపాల్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు పి. నారాయణ ముదిరాజ్, డి.బి. నాగభూషణం, మాజీ ఎంపీపీలు అర్జునయ్య, జె. బాలయ్య, బీఆర్ఎస్ నాయకులు లింగా గౌడ్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, వసంత్ రెడ్డి, బిర్ల శంకర్, మహేష్ యాదవ్, దాసరి దుర్గయ్య, కరుణాకర్, పరిపూర్ణం, నిరుడి లక్ష్మణ్, నాజీం పటేల్, ఇమ్రాన్ ఖాన్, అల్లే సంతోష్, ప్రభాకర్, సుంకే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారం కోసం భారీ ర్యాలీ

● ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 5 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థులు, నిరుద్యోగ యువత ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి, యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలి అనే ప్రధాన డిమాండ్లతో ఈ ర్యాలీ చేపట్టారు. ECIL X రోడ్ రౌండ్ బిల్డింగ్ వద్ద ప్రారంభమైన ఈ భారీ ర్యాలీ రాధిక శ రోడ్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, యువతకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి వెంటనే పరిష్కరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంతో పాటు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించేందుకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి, యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా రీయింబర్స్‌మెంట్ బకాయిలను త్వరితగతిన విడుదల చేయాలని అన్నారు. ఈ ర్యాలీలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు ,విద్యార్థులు, నిరుద్యోగ యువత, యువజన నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు యువ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల హక్కుల కోసం యువత భవిష్యత్తు కోసం హామీల అమలు కోసం ఐక్యంగా పోరాడుదాం అంటూ నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది.

రచ్చగల్లి ప్రాథమిక పాఠశాలలో ఆకట్టుకున్న గురుపూజోత్సవ వేడుకలు

■ కే.కృష్ణమోహన్ సార్ కు అపూర్వ సత్కారం.
■ గురుభక్తి చాటుకున్న పూర్వ విద్యార్థులు.
■ ఉపాధ్యాయునికి పాదాభివందనం,ఘన సన్మానం.
■ పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన కృష్ణమోహన్‌కు పూర్వ విద్యార్థుల శుభాకాంక్షలు.

కోటగిరి/ప్రజావాణి:- ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటగిరి మండల కేంద్రంలోని కోటగల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కే.కృష్ణమోహన్‌కు పూర్వ విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా గురుభక్తిని చాటుకుంటూ ఆయనకు పాదాభివందనం చేసి, శాలువాతో సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

తెలియజేశారు. ఇటీవల కాలంలో పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా కూడా పూర్వ విద్యార్థులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ. ఉపాధ్యాయ దినోత్సవ వేళ మా గురువుగారిని సత్కరించుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ఉపాధ్యాయ వృత్తిలో మా గురువు సేవలు మరువలేనివని అన్నారు. పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులు కావడం మాకెంతో గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో మా గురువు కే.కృష్ణమోహన్ సర్ మంచి పదవులు చేపట్టి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తేవాలని మనసారా ఆకాంక్షించా రు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పత్తి. సతీష్,ఏముల. నవీన్,ఆలపాటి హరికృష్ణ,నీరడి. భూమయ్య,కప్ప. సాయి లు,వై. అనిల్,రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ కులకర్ణి,సీనియర్ నాయకురాలు శ్యామల కులకర్ణి,సీనియర్ నాయకులు మార్కెల్లి ప్రకాష్ పటేల్,పిఆర్టియు కోటగిరి మండల ప్రధాన కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీ. ఉదయ చందర్,ఉపాధ్యాయ బృందం,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ తో స్టంట్ చేసిన యువకుడిపైకేసు నమోదు, యువకుడు అరెస్ట్.

● బైక్ సీజ్, కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించిన పోలీస్.

మహబూబ్‌నగర్ ప్రజావాణి: సూర్యాపేట జిల్లా మఠంపల్లి ప్రధాన సెంటర్‌లో ప్రమాదకరంగా బైక్‌పై స్టంట్ విన్యాసాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న పర్వతం గోపీచంద్ (19) అనే యువకున్ని మఠంపల్లి పోలీసులు పట్టుకున్నారు. జాన్‌పాడు--మట్టపల్లి రోడ్డులో ఒంటి చక్రంపై బైక్ నడుపుతూ ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. యువకుడితో పాటు బైక్ ఇచ్చిన అతని మామపై కూడా కేసు నమోదు చేశారు. రద్దీ ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదకర స్టంట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ చారమందరాజు హెచ్చరించారు. వెంటనే స్పందించి స్టంట్ లు చేసిన యువకుని పై చర్యలు తీసుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది చర్యలను స్థానికులు అభినందించారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై బీఆర్ఎస్ 'బాకీ కార్డు'

- 1,000 రోజుల పాలనపై ఇంటింటా ప్రచారం

గరిడేపల్లి, సెప్టెంబర్ 5 (ప్రజావాణి):కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై బీఆర్ఎస్ పార్టీ రూపొందించిన 'కాంగ్రెస్ బాకీ కార్డు'తో గరిడేపల్లి మండలంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. "ఆరు గ్యారంటీలు.. 1,000 రోజుల పాలన.. ప్రజలకు మిగిలింది బాకీలే" అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ స్వప్న, వీరయ్య గౌడ్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి మన్సూర్ అలీ, పెండెం ధనయ్య గౌడ్, రాజమల్లు, నగేష్, వేణు, వెంకటేష్, లింగయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని నాయకులు తెలిపారు.

ఫ్రీ లెఫ్ట్ ల ఏర్పాటు కుఎం ఎల్ ఏ బండారి లక్ష్మా రెడ్డి చొరవ

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 5 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) ఫ్రీ లెఫ్ట్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవ ఉప్పల్ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి వాహన దారులకు సులభతరమైన రాకపోకలు కల్పించేందుకు ఫ్రీ లెఫ్ట్ల ఏర్పాటు కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఈ సందర్భంగా MMC కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి, నియోజకవర్గంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్ల ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించారు.ప్రత్యేకంగా కాప్రా ఎల్లారెడ్డిగూడ కుషాయిగూడ రాధిక చౌరస్తా హబ్సిగూడ X రోడ్ నాచారం ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ ని కోరారు.ఫ్రీ లెఫ్ట్ల ఏర్పాటు ద్వారా ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనదారుల ప్రయాణాన్ని మరింత సులభతరం చేయవచ్చని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాయి జెన్ శేఖర్ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీరంగూడలో చికెన్ గ్రిల్ హౌస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న శశిధర్ రెడ్డి

అమీన్‌పూర్, సెప్టెంబర్ 5 (ప్రజావాణి): బీరంగూడలోని సింఫనీ రోడ్డులోని ప్యూర్ ఓ నేచురల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన చికెన్ గ్రిల్ హౌస్ -- బార్బెక్యూ అండ్ కేఫ్ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జి. శశిధర్ రెడ్డి హాజరై నిర్వాహకులను అభినందించారు.ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. బీరంగూడ ప్రాంతంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. చికెన్ గ్రిల్ హౌస్‌లో రుచికరమైన గ్రిల్ చికెన్, బార్బెక్యూ వంటకాలతో పాటు కేఫ్ సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. నూతనంగా ప్రారంభమైన సంస్థకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీరంగూడ దేవాలయ చైర్మన్ బి. సుధాకర్ యాదవ్, సభ్యుడు మల్లేష్, అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్, ఆత్మ కమిటీ సభ్యుడు భిక్షపతి, కృష్ణ యాదవ్, వెంకట్, సురేష్ నాయక్, శ్రీకాంత్ రెడ్డి, భగవాన్ రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సంటి సునీత

హనుమకొండ, ఆగస్టు 5: తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరం హనుమకొండ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సంటి సునీతను నియమించినట్లు సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో మానవ హక్కుల పరిరక్షణ కోసం సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా హనుమకొండ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సంటి సునీతకు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సంటి సునీత మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాధ్యతలు అప్పగించిన సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి కృషి చేసిన డాక్టర్ సత్యనారాయణ దేవరకొండ (సతీష్), తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో పాటు సంస్థ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.మానవ హక్కుల పరిరక్షణ కోసం తన శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు. హక్కులు ఉల్లంఘనకు గురైన బాధితులకు అండగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు.సంస్థ అభివృద్ధికి బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా పనిచేస్తానని సంటి సునీత తెలిపారు. ఎక్కడైనా మానవ హక్కులు భంగం కలిగితే తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరం తరఫున స్పందించి బాధితులకు న్యాయం అందేలా కృషి చేస్తామని అన్నారు.ఈ నియామకం తనపై మరింత సామాజిక బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు, స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు సంటి సునీతకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతున్న హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- కోటగిరిలో అంబేద్కర్ అభిమానుల నిరసన.పోలీసులకు వినతి పత్రం అందజేత.
- హమారా ప్రసాద్ వ్యవహారశైలిపై మండిపడ్డ మాల మహానాడు ప్రతినిధులు.

కోటగిరి/ప్రజావాణి:-మహాపురుషులు,అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం పాటుపడిన డా.బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను కించపరిచేలా ప్రవర్తిస్తున్న హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేసి తగిన విధంగా శిక్షించాలని మాల మహానాడు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు.శనివారం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కోటగిరి,పోతంగల్ మండలాల కు చెందిన మాల మహానాడు ప్రతినిధులు,అంబేద్కర్ అభిమానులు హమారా ప్రసాద్ వ్యవహార శైలికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం స్థానిక కోటగిరి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మిర్జాపూర్ సాయన్న,పుప్పాల మారుతి మాట్లాడుతూ.అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ఉనికిలో లేదని విమర్శిస్తూ సమాజంలో విద్వే షాలు రెచ్చగొడుతున్న హమారా ప్రసాద్ పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిత్యం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పేరును అవమానపరుస్తూ,అవహేళనగా వ్యవహరిస్తూ కుల,మత, జాతుల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న ఆయనకు తగిన విధంగా శిక్షించాలన్నారు.ఈ రకమైన అప్రతిష్ట చర్యల వల్ల సమాజంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు ప్రతినిధులు బ్యాగరి రాములు,పుప్పాల సైదయ్య,పాల గంగారం,గైని శంకర్,గైని గజానంద్,మోరె జీవన్,క్యూ.శివ శంకర్,ఎన్.రవి, ఎన్. పవన్, ఎన్.సందీప్,ఎన్.శాం రావు, ఎన్.విఠల్,గంగారాం, ఎన్. భూమయ్య,ఎన్.వినయ్,ఎన్.శివశంకర్,తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు

- చిన్నంబావిలో నార్కోటిక్ డాగ్స్‌తో ఆకస్మిక తనిఖీలు
- అక్రమ విక్రయాలపై సమాచారం ఇవ్వండి: ఎస్సై రామన్ గౌడ్

చిన్నంబావి ప్రజావాణి సెప్టెంబర్ 5చిన్నంబావి: మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చిన్నంబావి ఎస్సై రామన్ గౌడ్ హెచ్చరించారు. శనివారం చిన్నంబావి మండల కేంద్రంలో స్పెషల్ డ్రగ్స్ డాగ్స్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.మండల కేంద్రంలోని టీ హోటళ్లు, కిరాణా దుకాణాలు, మెడికల్ షాపులు, ఆర్ఎంపీ క్లినిక్‌లు, ఎరువుల దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు. నార్కోటిక్ డాగ్ సహాయంతో అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలను విక్రయించడం, రవాణా చేయడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఎస్సై స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు లేదా మత్తు పదార్థాల విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్కోటిక్ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ గోపాల్ సూచించారు. మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని, వాటికి అలవాటు పడకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు.ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ గోపాల్, పరశురాముడు, కానిస్టేబుళ్లు కర్ణాకర్, రాంబాబు, స్పెషల్ డ్రగ్స్ డాగ్స్ స్క్వాడ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణి ఆస్పత్రి గుమ్మం వద్దే వైద్య వ్యర్థాల గుట్టలు!

- అపరిశుభ్రతతో రోగులు, సందర్శకులకు ఇబ్బందులు.. పరిశీలించి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు ప్రజల వినతి

ప్రజావాణి ప్రతినిధి నవీన్ హన్మకొండ బ్యూరో హనుమకొండ, సెప్టెంబర్ 5: అనారోగ్యంతో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన చోటే అపరిశుభ్ర పరిస్థితులు నెలకొన్నాయంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ బస్టాండ్ ఆవరణ సమీపంలో, ఏషియన్ మాల్ ఎదురుగా ఉన్న కళ్యాణి ఆస్పత్రి పరిసరాల్లో వైద్య సంబంధిత వ్యర్థాలను అపరిశుభ్రంగా ఉంచుతున్నారని స్థానికులు, ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు ఆరోపిస్తున్నారు.

చికిత్స కోసం వచ్చి.. అపరిశుభ్ర వాతావరణంలో ఇబ్బందులు!

ఆస్పత్రికి వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే రోగులు, వారిని చూడటానికి వచ్చే బంధువులు, సందర్శకులు వ్యర్థాల కారణంగా అసౌకర్యానికి గురవుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారికి అపరిశుభ్ర వాతావరణం మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్లౌజులు, మందుల అవశేషాలు.. ఇతర వ్యర్థాలపై ఆందోళన

ఆస్పత్రి పరిసరాల్లో గ్లౌజులు, మందుల అవశేషాలు, ఇతర వైద్య సంబంధిత వ్యర్థాలు ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా, నిర్దేశిత నిబంధనల ప్రకారం వేరు చేసి సురక్షితంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. వైద్య వ్యర్థాలు అపరిశుభ్రంగా పేరుకుపోతే పరిశుభ్రత సమస్యలతో పాటు ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నల్ల కవర్ల వినియోగంపైనా ప్రశ్నలు

వ్యర్థాలను నల్లరంగు కవర్లలో ఉంచుతున్నారనే ఆరోపణలపై కూడా సంబంధిత అధికారులు పరిశీలన జరపాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రంలో అమలులో ఉన్న ప్లాస్టిక్ వినియోగ నిబంధనలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆస్పత్రి వ్యర్థాలను నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాన్ని అధికారులు తనిఖీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డీఎంహెచ్‌వో క్షేత్రస్థాయి తనిఖీ చేయాలి

ఈ వ్యవహారంపై వరంగల్--హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. కళ్యాణి ఆస్పత్రిని క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులు, వైద్య వ్యర్థాల సేకరణ, నిల్వ, పారవేత విధానాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏవైనా పరిస్థితులు ఉన్నట్లు తనిఖీల్లో తేలితే సంబంధిత ఆస్పత్రి యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో రోగులు, సందర్శకులు ఇబ్బందులు పడకుండా పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

రోగుల ఆరోగ్యంతో రాజీ వద్దు

ఆస్పత్రులు రోగులకు ఆరోగ్యాన్ని అందించే కేంద్రాలుగా ఉండాలని, అక్కడ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలు పేర్కొన్నారు. వైద్య వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం ఉంటే వెంటనే సరిదిద్దాలని, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా కళ్యాణి ఆస్పత్రి యాజమాన్యానికి అధికారులు సూచనలు చేయాలని కోరుతున్నారు.ప్రజల ఆరోగ్యం, రోగుల భద్రత దృష్ట్యా డీఎంహెచ్‌వో వెంటనే స్పందించి ఆస్పత్రిని తనిఖీ చేసి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని హనుమకొండ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా పాలన లక్ష్యం

- వెయ్యి రోజుల పాలనలో పేదల సంక్షేమానికి పెద్దపీట --- బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను నమ్మొద్దు: భానూరి శివశంకర్ గౌడ్

చేవెళ్ల, సెప్టెంబర్ 5, 2026: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పేదలు, రైతులు, మహిళలు, వృద్ధుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని చేవెళ్ల నియోజకవర్గం టీపీసీసీ--ఐఎన్‌టీయూసీ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో వెయ్యి రోజులుగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, ముఖ్యమంత్రి సహాయనిధి, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, వృద్ధాప్య పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు ఉచిత వ్యవసాయ విద్యుత్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, అర్హులైన పేదలకు రేషన్ కార్డుల మంజూరు వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.గత పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆయన విమర్శించారు. పేదలకు రేషన్ కార్డుల మంజూరు, గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం వంటి అంశాల్లో గత ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఫలితాలు అందించలేక పోయిందన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి సమగ్రంగా కృషి చేస్తుంటే, దీనిని ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని భానూరి శివశంకర్ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మకుండా వాస్తవాలను గమనించాలని ఆయన సూచించారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని, ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భానూరి శివశంకర్ గౌడ్ స్పష్టం చేశారు.

కన్నాలలో ఇంకుడు గుంతలకు శ్రీకారం

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 5, ప్రజావాణి:జలసిరి కార్యక్రమంలో బాగంగా శనివారం మంథని మండలం కన్నాల గ్రామంలో ఇంకుడు గుంతలకు సర్పంచ్ ఆధ్వర్యంలో ముగ్గులు పోయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి గుడిసె గట్టయ్య యాదవ్, ఎంపీడీవో శ్రీజ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలన్నారు. దీనితో వర్షం పడ్డ ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి గాదె దివ్య,వార్డ్ సభ్యులు పర్షవేన అనిల్, గ్రామ కార్యదర్శి కేశెట్టి మధుకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన కాంగ్రెస్.. గుణపాఠం తప్పదు

- 1000 రోజుల దగా పాలనపై పరకాలలో బీఆర్ఎస్ పోరుబాట
- అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ.. ధర్నా
- విద్యార్థులను అడ్డుకున్న పోలీసుల తీరుపై మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆగ్రహం

ప్రజావాణి హన్మకొండ బ్యూరో నవీన్ పరకాల: ఎన్నికల ముందు యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా యువతను మోసం చేస్తోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి యువత తగిన సమయంలో గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు పరకాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ కూడలి వరకు సాగి, అనంతరం తిరిగి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు కూడా ర్యాలీలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

విద్యార్థులను అడ్డుకోవడంపై ఆగ్రహం

ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారని ఆరోపిస్తూ చల్లా ధర్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, కార్యకర్తలకు మధ్య కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది.

“విద్యార్థులను చూస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎందుకంత భయం? ప్రశ్నించే గొంతులను అడ్డుకోవడం చేతగాని పాలనకు నిదర్శనం” అని చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. యువత తమ సమస్యలపై ప్రశ్నించేందుకు, నిరసన తెలిపేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడం సరైన విధానం కాదని అన్నారు.

హామీలు ఏమయ్యాయి?

ఎన్నికల సమయంలో యువత, విద్యార్థులు, నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని చల్లా ధర్మారెడ్డి ప్రశ్నించారు.

నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఏమైందని, తొలి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాల హామీ ఎక్కడ అమలైందని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్, యూత్ కమిషన్ ఏర్పాటు, విద్యార్థులకు రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు వంటి హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పెండింగ్ అంశంపై కూడా ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ హయాంలో విద్యారంగానికి ప్రాధాన్యం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని చల్లా ధర్మారెడ్డి తెలిపారు. గురుకులాలు, జూనియర్ కళాశాలలు, ప్రత్యేక మైనార్టీ గురుకులాల సంఖ్యను గణనీయంగా పెంచామని పేర్కొన్నారు.

‘మన ఊరు--మన బడి’, ‘మన బస్తీ--మన బడి’ కార్యక్రమాల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, యూనివర్సిటీల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. మహాత్మా జ్యోతిబా ఫూలే, అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకాల ద్వారా విద్యార్థులకు విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం అందించామని పేర్కొన్నారు.

జీఓ 97ను రద్దు చేయాలి

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు.“యువత భవిష్యత్తుతో ఆటలాడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం. ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం” అని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా పరిపాలనలో అత్యుత్తమ సేవలకు అవార్డు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ‘ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేషన్--2026’ అవార్డు అందుకున్న గాజర్ల రమేష్

బెజ్జంకి, సెప్టెంబర్ 5 (ప్రజావాణి) విద్యారంగంలో విశేష కృషి, విద్యా పరిపాలనలో అత్యుత్తమ పనితీరుకు గాను ‘అవార్డు ఫర్ ఎక్సెలెన్స్ ఇన్ ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేషన్ -- 2026’ అవార్డును శ్రీ గాజర్ల రమేష్ (డైరెక్టర్, SCERT -- స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్) అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న జరిగిన కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు.విద్యారంగ అభివృద్ధికి, విద్యా పరిపాలనలో సమర్థవంతమైన సేవలు అందించినందుకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు లభించడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గాజర్ల రమేష్ కి పలువురు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

గురువులే భావి తరాలకు మార్గదర్శకులు

- లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు

బెజ్జంకి,సెప్టెంబర్ 5(ప్రజావాణి) ఉపాధ్యాయు ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా బెజ్జంకి మండలంలొంక్ లక్ష్మీపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ కవిత--రత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎండీ సాదుద్దీన్, సునీత, శృతి, అనూషలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల దినోత్సవం రోజున తమ పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించడం ఇదే తొలిసారి అని తెలిపారు.తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఆ జన్మను తీర్చిదిద్దే తొలి గురువు ఉపాధ్యాయుడని పేర్కొన్నారు. గురువులు బోధించిన పాఠాలను నేర్చుకుని, వారు చూపిన మార్గంలో నడుస్తూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలకు, గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగాధర హరీష్, వార్డు సభ్యులు వనపర్తి పద్మ, బోనగిరి మంజుల పాల్గొన్నారు.

బడిని గుడిగా మార్చిన ‘భగీరథుడు’.. ఉపాధ్యాయ లోకానికి వన్నె తెచ్చిన ధారావత్ నెహ్రూ!

- అవార్డు ఆయనను వెతుక్కుంటూ వచ్చింది.. గురు స్థానానికి సార్థకత తెచ్చింది!
- ఒకే ఒక్క ఏడాది.. 50 మంది కొత్త విద్యార్థులు.. ఇదో విద్యా విప్లవం!
- డిజిటల్ పాఠాలు, అపారమైన ప్రేమ.. అక్షర శిల్పి అద్భుత సృష్టి!
- శాలువాల సత్కారాలు, ఆనంద బాష్పాలు.. నెహ్రూ సేవలకు జనం నీరాజనం!

కేసముద్రం సెప్టెంబర్ 05, ప్రజావాణి.గురువు అనుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని నిరూపించారు ఆయన. పిల్లలు లేక వెలవెలబోతున్న ఒక ప్రభుత్వ బడిని తన నిరంతర శ్రమ, అంకితభావంతో అక్షర నందనవనంగా మార్చారు. కేసముద్రం మండల పరిధిలోని ఉప్పరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,ప్రధానోపాధ్యాయులు ధారావత్ నెహ్రూను ఈ ఏడాది ‘మండల ఉత్తమ ఉపాధ్యాయ’ పురస్కారం వరించింది. కేవలం ఒక అవార్డు ఆయనను వెతుక్కుంటూ రాలేదు, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన పడిన తపనే ఈ రోజు ఆయనకు సమాజంలో అత్యున్నత గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆయన చూపిన చొరవ ప్రతి ఒక్కరినీ అబ్బురపరుస్తోంది.

ఒక్క ఏడాదే.. కానీ ఒక శతాబ్దపు మార్పు!23 నుండి 73 కి చేరిన విద్యార్థులు.

ఒక ప్రభుత్వ పాఠశాలలో ఒకే ఏడాదిలో విద్యార్థుల సంఖ్య మూడు రెట్లు పెరగడం అంటే అది ఒక అద్భుతమనే చెప్పాలి. గత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో కేవలం 23 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంతో బడి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఆ సమయంలో బాధ్యతలు చేపట్టిన హెచ్ఎం నెహ్రూ, తన గురుతర బాధ్యతను భుజానికెత్తుకున్నారు. ఆయన చేసిన భగీరథ ప్రయత్నం వల్ల ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థుల సంఖ్య ఏకంగా 73 మందికి చేరింది. ఒక్క ఏడాదిలోనే 50 మంది కొత్త విద్యార్థులు కార్పొరేట్ బడులను వదిలి ఈ ప్రభుత్వ బడిలో చేరడం, నెహ్రూ గారి విద్యాబోధనపై ఉన్న నమ్మకానికి నిదర్శనం.

ఇంటింటికీ తిరిగిన పాదాలు.. తల్లిదండ్రుల్లో పెరిగిన నమ్మకం.!

కేవలం తరగతి గదికే పరిమితం కాకుండా, ఉప్పరపల్లి గ్రామంలోని ప్రతి ఇంటి గుమ్మాన్ని తొక్కారు ఆదర్శ ఉపాధ్యాయుడు నెహ్రూ. ప్రభుత్వ పాఠశాలల్లో లభించే ఉచిత నాణ్యమైన విద్య, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, పౌష్టికాహారం గురించి తల్లిదండ్రులకు కరతలామలకంగా వివరించారు. ‘మీ పిల్లల భవిష్యత్తుకు నాది పూచీ’ అంటూ వారిలో నమ్మకాన్ని నింపారు. బడిలో ఆహ్లాదకరమైన, మెరుగైన విద్యా వాతావరణాన్ని సృష్టించి, ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా డిజిటల్ బోధనను, క్రమశిక్షణను అలవాటు చేశారు.విద్యా రంగానికి ధారావత్ నెహ్రూ చేసిన అసాధారణ సేవలను గుర్తించిన ఉన్నతాధికారులు ఆయనను మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడంతో ఉప్పరపల్లి గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ ప్రకటన వెలువడగానే గ్రామస్థులు, పాఠశాల కమిటీ, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు ఆయనను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సమాజంలో గురువు స్థానాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లిన నెహ్రూ గారి సేవలు అభినందనీయమని, ఆయనే మా ఊరి గర్వకారణమని గ్రామస్థులు కొనియాడారు. బడిని గుడిగా, విద్యార్థులను దేవతలుగా భావించి సేవ చేస్తున్న ఇలాంటి గురువులకు దక్కే గౌరవమే.. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెస్తుందని పలువురు ప్రశంసించారు.

బీరప్ప గడ్డ లోని శ్రీ సీతా రాముల ఆలయాన్ని దర్శించుకున్న

- ఎం ఎల్ ఏ బండారి లక్ష్మా రెడ్డి

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 5 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) బీరప్ప గడ్డ డివిజన్ పరిధిలోని సీతారామ కాలనీలో శ్రీ సీతారాముల ఆలయాన్నిఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి శనివారం దర్శించుకున్నారు. స్థానిక నాయకుడు పల్లె రాజ్ కుమార్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానికులు, కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు. ?ఆలయంలో శ్రీ సీతారామచంద్రస్వామికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా ఆయన మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో పాటు ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. కాలనీల్లో పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందర, ఖాళీ స్థలాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.?ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు పాటు కాలనీ ముఖ్య నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత కావాలి.

మన ప్రజావాణి. మంథని ప్రతినిధి. మంథని మండలం కన్నాల గ్రామంలో ఈరోజుజ లసిరి కార్యక్రమంలో భాగంగాగ్రామంలో ఇంకుడుగుంతలకు సర్పంచ్ ఆధ్వర్యంలో ముగ్గులు పోయడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచి గుడిసె గట్టయ్య యాదవ్ మరియు ఎంపీడీవో శ్రీజ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలని దీనితో వర్షం పడ్డ ప్రతి నీరు ఒడిసి పట్టాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గుడిసె గట్టయ్య యాదవ్ మండల అభివృద్ధి అధికారి శ్రీజ రెడ్డి గ్రామ ఉపసర్పంచి గాదె దివ్య మరియువార్డ్ సభ్యులు పర్వవేన, అనిల్ గ్రామ కార్యదర్శి కేశెట్టి మధుకర్ ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువ పత్రాల పరిశీలన వేగవంతం చేయాలి

- మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 5 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ- 2026లో నోటీసుల జారీ అనంతరం సంబంధిత ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి.శనివారం జిల్లాలోని అంతాయిపల్లి, ఉప్పరపల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్ లను ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ- 2026లో భాగంగా జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026లో హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో మ్యాప్పింగ్ జరగకుండా ఉన్న ఓటర్లు ఓటర కార్డ్ లో ఉన్న వ్యత్యాసల కేటగిరీల ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల విచారణ

వేగవంతం చేయాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. జాబితాలో గల ఓటర్లు తమ వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా చర్యలు తీసుకోవాలని, ఎస్.ఐ.ఆర్ 2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు. కొత్తగా నమోదు చేసుకునే ఓటర్లు ఫారం --6, చిరునామా మార్పు కోసం ఫారం 7 , మరణించిన/శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్ల ఫారం 8 ఓటర్లకు అందచేసి, అవగాహన కల్పిస్తూ ఈ ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధ్రువపత్రాలను దృవీకరించిన అనంతరము సంబంధిత పత్రాలను అప్లోడ్ చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ వెంకట రెడ్డి, ఏఈఆర్ఓ మధుసూదన్ రెడ్డి , బిఎల్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇనుగుర్తిలో 10న,మండల ఎస్ జి ఎఫ్ గేమ్స్

ప్రజావాణి,ఇనుగుర్తి: మండల కేంద్రం ఇనుగుర్తిలో 70వ,మండల స్థాయి ఎస్ జి ఎఫ్ గేమ్స్ బాల బాలికలకు ఈనెల 10న స్థానిక హైస్కూల్లో నిర్వహించనున్నట్లు ఎంఈఓ వెన్న వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, అండర్ 17 చెందిన బాలబాలికలకు కబడ్డీ వాలీబాల్,కోకో క్రీడల్లో సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సెలక్షన్లలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచిన వారిని జోనల్ స్థాయికి సెలక్షన్ లకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మండల విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అండర్ 14 కు చెందిన సెలక్షన్లలో పాల్గొనే వారు జనవరి 1-2013 తర్వాత జన్మించి ఉండాలని, అండర్ 17 కు చెందిన వారి వయసు జనవరి 1, 2010 తర్వాత జన్మించి ఉండాలని తెలిపారు. ఆసక్తిగల బాల బాలికలు ఈనెల 10వ తేదీ ఉదయం 9.00గం.ల వరకు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాల కోసం ఫిజికల్ డైరెక్టర్ తాళ్ల ప్రణయ్ మొబైల్ నెం.93470 45680 కు కాల్ చేసి సంప్రదించాలని పేర్కొన్నారు.

గురుపూజోత్సవం సందర్భంగా కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు

కూకట్పల్లి విలేజ్ (ప్రజావాణి) సెప్టెంబర్ 5 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్. మొలుగు ఆనందరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రోత్సాహకాల బహుమతులను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి, తండ్రి తర్వాత గురువుదే ప్రధాన పాత్ర అని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగడానికి ఉపాధ్యాయుల బోధనలు మనకు మార్గదర్శనంగా నిలుస్తాయని వారు చెప్పిన బాటలో పయనిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు...విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగితే తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఎంతో సంతోషిస్తారని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులను గౌరవిస్తూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తారని అన్నారు. తాను కూడా ఇదే పాఠశాలలో చదువుకొని ఎమ్మెల్యేగా ఎదిగానని గుర్తుచేశారు. అనంతరం ఉపాధ్యాయులందరికీ టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో .. మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ ,మాధవరం రంగారావు..ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు

- మద్దూరు గ్రామ సర్పంచ్ దామెర మల్లేశం

మద్దూరు సెప్టెంబర్ 5, ప్రజా వాణి ,ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాల మద్దూర్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మద్దూరు గ్రామ సర్పంచ్ దామేర మల్లేశం కళాశాలలో అధ్యాపకులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని సర్పంచ్ దామెర మల్లేశం మాట్లాడుతూ ఉపాధ్యాయులు అధ్యాపకులు సమాజానికి మరియు దేశ పునర్నిర్మాణానికి మానవ వనరులను తయారు చేసే గొప్ప శిల్పులని వివరించడం జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అవరోధించాలని గురువులను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు.దేశం భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మించబడుతుందని సూచించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సర్పంచ్ మల్లేశంను శాలువాతో సన్మానించారు.ఆసంతరం సీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 7, 8 తేదీల్లో ఎస్జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడా పోటీలు: ఎంఈఓ జీవీవీ సత్యనారాయణ!

వెంకటాపురం (నూగూరు), సెప్టెంబర్ 05 (ప్రజావాణి):మండల స్థాయిలో 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' (ఎస్జీఎఫ్ఐ) క్రీడా పోటీలను సెప్టెంబర్ 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) జీవీవీ సత్యనారాయణ శనివారం ప్రకటనలో తెలిపారు. క్రీడా వివరాలుఈ పోటీలలో 14 మరియు 17 సంవత్సరాల వయస్సు విభాగాలకు చెందిన బాలబాలికలు పాల్గొనవచ్చని ఎంఈఓ వెల్లడించారు. మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోటీలలో భాగంగా కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ మరియు అథ్లెటిక్స్ క్రీడలను నిర్వహించనున్నారు.పోటీల వేదికలు:బాలురకు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్ పి హెచ్ ఎస్), వెంకటాపురం.బాలికలకు: ఆశ్రమ ఉన్నత పాఠశాల (ఏ హెచ్ ఎస్), చిరుతపల్లి-1.ముఖ్య నిబంధనలు:పోటీలలో పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా తమ వెంట ఆధార్ కార్డు మరియు అధ్యయన ధ్రువీకరణ పత్రం (స్టడీ సర్టిఫికెట్) తీసుకురావాలని అధికారులు స్పష్టం చేశారు. ఇతర వివరాలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (వెంకటాపురం) దేహదార్ఢ్య ఉపాధ్యాయుడు (గ్రా.ణ) బి. ప్రదీప్ ఫోన్ నెంబర్ సంఖ్య: 8309648722 లో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది: ఎంఈవో

- ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

ప్రజావాణి, ఇనుగుర్తి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఉత్తమ సమాజ నిర్మాణం ఉపాధ్యాయుల తోనే సాధ్యమవుతుందని ఎంఈఓ వెన్న వెంకటరెడ్డి అన్నారు.గురు పూజోత్సవం పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన 13 మంది టీచర్స్ ను శనివారం మండల కేంద్రం ఇనుగుర్తి హై స్కూల్ లో విద్యాశాఖ తరఫున ఎంఈఓ వెంకటరెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉండడం మన అదృష్టమని ఇకనుంచి మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఉత్తములుగా ఎన్నికైన సన్మాన గ్రహీతల లోఎం.ప్రవీణ్,ఎస్. శ్రీనివాస్,ఎం.మాధవ్,బి. వీరన్న,బి.మధుబాబు, వి.మల్లయ్య, కే.రేవతి, పి.సారంగపాణి,పి.యుగేందర్,ఎల్.స్వాతి,బి,అమృత, వి.శైలజ,ఎం.నాగమణి ఉన్నారు. కార్యక్రమంలోవివిధ ఉపాధ్యాయ సంఘాల భాద్యులు భాస్కర్,వీరన్న, రమేష్,మధుబాబు, ప్రభాకర్,ఉప్పలయ్య లతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రామంతాపూర్ లో నిర్వహించిన వంట వార్పు కార్యక్రమం లో పాల్గొన్న

- ముఖ్య అతిథి మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మా రెడ్డి

మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 5 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన 1000 రోజులు గడిచినా ప్రజల కష్టాలు తీరలేదు వంటింటి మంటలు ఆరిపోతున్నాయా ఇంట్లో వంట చేసుకునే పరిస్థితులు లేక రోడ్డుపై వంట చేసుకునే దుస్థితి ఎందుకు వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయి ప్రజలకు ఇచ్చిన మాటలు ఎక్కడ ధరల భారం, నిరుద్యోగం, ప్రజా సమస్యలకు పరిష్కారం ఎక్కడ 1000 రోజుల పాలనపై ప్రజల ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి ప్రజల కోసం ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిద్దాం

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా పాలన లక్ష్యం

- వెయ్యి రోజుల పాలనలో పేదల సంక్షేమానికి పెద్దపీట --- బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను నమ్మొద్దు: భానూరి శివశంకర్ గౌడ్

చేవెళ్ల, సెప్టెంబర్ 5, 2026: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పేదలు, రైతులు, మహిళలు, వృద్ధుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని చేవెళ్ల నియోజకవర్గం టీపీసీసీ--ఐఎన్టీయూసీ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో వెయ్యి రోజులుగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, ముఖ్యమంత్రి సహాయనిధి, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, వృద్ధాప్య పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు ఉచిత వ్యవసాయ విద్యుత్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, అర్హులైన పేదలకు రేషన్ కార్డుల మంజూరు వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.గత పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆయన విమర్శించారు. పేదలకు రేషన్ కార్డుల మంజూరు, గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం వంటి అంశాల్లో గత ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఫలితాలు అందించలేక పోయిందన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి సమగ్రంగా కృషి చేస్తుంటే, దీనిని ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని భానూరి శివశంకర్ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మకుండా వాస్తవాలను గమనించాలని ఆయన సూచించారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని, ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భానూరి శివశంకర్ గౌడ్ స్పష్టం చేశారు.

అంకితభావానికి దక్కిన గుర్తింపు - జిల్లా ఉత్తమ ఉపాధ్యాయంగా వంగళ మహేశ్ ఎంపిక...!

- తెలుగు వెలుగు వంగళ మహేశ్ కు పురస్కారం
- 24 ఏళ్ల నిరంతర సేవకు సార్థకత.
- ప్రభుత్వ విప్ను మరియు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మంగళ మహేష్ కు ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారం.

//వేములవాడ నియోజకవర్గం// సెప్టెంబర్ - 05 (ప్రజావాణి)
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం కోనాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తెలుగు పాఠశాల సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న ప్రముఖ ఉపాధ్యాయులు వంగళ మహేశ్ ప్రతిష్టాత్మక జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2026కు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఈ పురస్కారాన్ని ప్రకటించింది.
2002 ఏప్రిల్ 3న ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టిన మహేశ్ గత 24 ఏళ్లుగా విద్యారంగానికి నిస్వార్థ సేవలందిస్తున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు పాఠశాల అభివృద్ధికి ఆయన చేస్తున్న విశేష కృషి అందరి ప్రశంసలు అందుకుంటోంది.
ముఖ్యంగా తెలుగు బోధనలో వినూత్న బోధనా పద్ధతులను అవలంబిస్తూ విద్యార్థుల్లో తెలుగు భాషపై అభిమానం, చదువుపై ఆసక్తిని పెంపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి తరగతిలో తరగతి గ్రంథాలయాలను ఏర్పాటు చేసి, దాతల సహకారంతో వందలాది కొత్త పుస్తకాలను సేకరించి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా 500 మంది ప్రముఖ తెలుగు కవుల చిత్రాలతో భారీ ప్రదర్శనను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో భాషా స్ఫూహ కలిగించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంపు, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించే బడిబాట కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించి, తల్లిదండ్రులను చైతన్యపరచడం ద్వారా పాఠశాల విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచారు. ఆయన బోధనా ప్రతిభకు నిదర్శనంగా 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో పదవ తరగతి తెలుగు సబ్జెక్టులో 100% ఉత్తీర్ణత ఫలితాలు సాధించారు.విద్యతో పాటు సామాజిక బాధ్యతలోనూ ముందుంటున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి, వాటిలో 90% మొక్కలను సంరక్షించి మనుగడ సాధించేలా చేశారు. పాఠశాల మౌలిక వసతుల కల్పనలో భాగంగా విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులు అందించడం, పేద విద్యార్థులకు క్రీడా దుస్తులు, షూస్ కోసం దాతలను ప్రోత్సహించడం, దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేయడం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టారు.విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, కవితా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించి వారికి బహుమతులు వచ్చేలా తీర్చిదిద్దుతున్నారు. ఆయన సేవలను ఇప్పటికే గుర్తించిన వేములవాడ మండల విద్యాధికారి మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించారు.
నిబద్ధత, అంకితభావం, వినూత్న బోధన, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

నెల రోజులకే పగుళ్లు.. ఎన్ఆర్ఈజీఎస్ సీసీ రోడ్లపై ఆరోపణలు

- రూ.10 లక్షల పనుల్లో నాణ్యతపై అనుమానాలు..
- అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు

నెల రోజులకే పగుళ్లు బారిన సీసీ రోడ్లను

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 5, ప్రజావాణి: మంథని మండలం ఖాన్సాయిపేట గ్రామపంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లపై నాణ్యతపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణం పూర్తయి నెల రోజులు కూడా గడవకముందే రెండు సీసీ రోడ్లు పగుళ్లు బారడంతో పనుల నాణ్యతపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.
ఒక్కో సీసీ రోడ్డుకు రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్లు సమాచారం. అయితే నాసిరకమైన మెటీరియల్ వినియోగం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే రోడ్లు ఇలా పగుళ్లు బారుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
తీర్మానం చేసిన చోట కాకుండా మరోచోట నిర్మాణం?
గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం ప్రకారం ఎస్సీ కాలనీ నుంచి పోచమ్మ గుడి, స్మశాన వాటిక వరకు సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా అవసరం లేని ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టారని బిఆర్ఎస్ ఖాన్సాయిపేట గ్రామశాఖ అధ్యక్షుడు కుడుదుల వెంకటేష్ ఆరోపించారు. అంతేకాకుండా గ్రామపంచాయతీ కార్యాలయం, పాఠశాల ముందు ఇప్పటికే ఉన్న సీసీ రోడ్డుపైనే మళ్లీ సీసీ రోడ్డు వేసినట్లు ఆయన పేర్కొన్నారు.
ఇంజనీర్ పర్యవేక్షణ ఏది?
నిర్మాణ సమయంలో సంబంధిత ఇంజనీర్ క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించలేదని, గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే పనులు చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని వెంకటేష్ తెలిపారు. పనుల నాణ్యత, అంచనాలు, ఉపయోగించిన మెటీరియల్, నిర్మాణ విధానంపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.
సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపట్టినట్లు తేలితే బాధ్యులైన కాంట్రాక్టర్పై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని కుడుదుల వెంకటేష్ కోరారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి...

- అన్ని రంగాలలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందంటూ బిఆర్ఎస్ ధర్నా.
- హాజరైన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి.

సెప్టెంబర్ 05 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి
విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో శనివారం రోజు బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన ధర్నా కార్య క్రమంలో మాజీ మంత్రి , సూర్యాపేట శాసన సభ్యులు జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి , జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి , యూత్ డిక్లరేషన్ను అమలు చేయాలి అనే ప్రధాన డిమాండ్లతో యువతకు మద్దతు తెలిపారు. విద్యార్థులు నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న సమస్యలను ప్రభుత్వం సీరియస్గా పరిగణించి వెంటనే పరిష్కరించాలని కోరారు.పెండింగ్లో ఉన్న రియంబర్స్మెంట్ బకాయి లను చెల్లించడంతోపాటు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించేందుకు జాబ్ క్యాలెండర్ ను విడుదల చేసి యూత్ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల విద్యా భ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా రియంబర్స్మెంట్ బకాయి లను త్వరితగతిన విడుదల చేయాలన్నారు. దొంగ హామీలతో గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని విమర్శించిన ఆయన వరంగల్ నుండి వచ్చే దాంట్లో వాటా అడిగి నందుకే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేశారని ఆరో పించారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు , కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి , భువనగిరి మాజీ శాసన సభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి , ఆలేరు మాజీ శాసన సభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్ , మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి , జిల్లా పార్టీ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి , బిఆర్ఎస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సమాజం లో మంచి మనిషిగా ఎదగడానికి ఉపాధ్యాయుల పాత్ర కీలమైనది

మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 5 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమైనది, భారతదేశ మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ని స్మరించుకుంటూ ఉపాధ్యాయులందరికీ నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు జిల్లా కలెక్టర్ మను చౌదరి.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక దేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి వినోద్ కుమార్, వివిధ ఉపాధ్యాయ యూనియన్ సభ్యులు తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి జ్యోతి ప్రజ్వలన గావించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడతూ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్న ప్రతి ఒక్కరూ తమ విజయంలో పాఠశాల ఉపాధ్యాయుల పాత్రను ఎంతో మరువలేనిదిగా భావిస్తారని తెలిపారు.ఉపాధ్యాయులు విద్యార్థుల కోణం నుండి ఆలోచించి పాఠాలు అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.ఉపాధ్యాయులు నేర్చుకోవల్సిన అంశాలు విద్యార్థులకు నేర్పించవల్సిన అంశాలు పై చర్చిస్తూ విద్యార్థులో ఆత్మ విశ్వాసం, వ్యక్తిత్వ వికాసం పెంచడం, నిరంతర అభ్యాసము, విషయ పరిజ్ఞానన్ని తెలుసుకొనే జిజ్ఞాసను పెంచుకొనే విధంగా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు.పుస్తకాలు జ్ఞానాని ఇస్తాయి కానీ దాని ఎలా ఉపయోగించుకోవాలో నేర్పేది ఉపాధ్యాయులే, సమాజములో మంచి మనిషిగా ఎదగడానికి క్రమ శిక్షణ తో కూడిన విద్య , ఆచరణాత్మకమైన విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు నేర్పించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులని కోరారు. విద్యార్థులలో ఉన్న లోపాలను సరిధిద్ధి వారిలోని నైపుణ్యాని వెలికి తీసి సులభమైన పద్ధతిలో, అర్థమయే రీతిలో బోధన చేయాలన్నారు.విద్యార్థి విజయాన్ని మెచ్చుకొని సంతోషపడే గురువు అదే విద్యార్థి వైపల్యం చెందితే ధైర్యము నింపి మళ్ళీ ప్రయత్నించే విధముగా ప్రోత్సహించాలి. ప్రతి రోజు విద్యార్థులు కనీసం ఐదు నుంచి పది నిమిషాల పాటు దినపత్రికలు చదివించేలా చూడాలని తద్వారా విద్యార్థులో సామాజిక విలువలు పెంపొందుతాయని, భవిష్యత్తు లో పోటి పరీక్షలకు ఉపయోగ పడతుందని అన్నారు.పాఠశాల వదిలి వెళ్ళిన తర్వాత కూడా మనతో నిలిచిపోయేదే నిజమైన చదువు. పాఠశాలలో నేర్చుకున్న విషయాలను విద్యార్థి తన జీవితంలో, సమాజంలో వర్తింపజేయగలిగితే ఉపాధ్యాయుని బాధ్యత సంపూర్ణంగా నెరవేరి నట్లు అవుతుందని జిల్లా లో పని చేస్తున్న ఉపాధ్యాయుల అందరికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు ఆధునికరణను ఆకళింపు చేసుకుంటూ పాఠ్యప్రణాళిక లను రూపొందించుకొని విద్యార్థులకు ఆదర్శమైన, ఆధునికరమైన విద్యను అందిస్తూ విద్య వ్యవస్థను పటిష్టం చేసుకుంటూ ముందుకు పొతున్నాము అని జిల్లా విద్య శాఖ అధికారి అన్నారు. దేశానికి కావలసిన బావితరాలను అందించడానికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు.అనంతరము జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులకు అదనపు కలెక్టర్ లోకల్ బాడిస్ ఫైజాన్ అహ్మద్ శాలువ కప్పి ప్రశంస పత్రాలను అందచేస్తూ పూల మొక్కలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా నీట్ ర్యాంకు సాధించిన మహతి కి సన్మానం

● ఉప్పల్ ఎం ఎల్ ఏ బండారి లక్ష్మా రెడ్డి

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 5 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి) ఆల్ ఇండియా నీట్ ర్యాంక్ 3759,తెలంగాణ స్టేట్ ర్యాంక్ 117 సాధించిన మహతి నీ అభినందించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బీరప్ప గడ్డ డివిజన్ లో నీ కళ్యాణపురి కాలనీలో నివసించే మహతి షిరాల్కర్ తల్లిదండ్రులు అమిత్ మరియు లలిత కుమార్తె ఆల్ ఇండియా నీట్ ర్యాంక్ 3759 స్టేట్ నీట్ ర్యాంకు 117 సాధించడం జరిగింది వారి నీటి పర్సంటేజ్ 99.08 కావడం నిజంగా కూడా చాలా అదృష్టం అని, ఈరోజు మహతి ని ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి గారు రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి కళ్యాణపురిలో ని వారి నివాసంలో వారికి నీట్ లో అంత మంచి ర్యాంకు రావడం నిజంగా కూడా చాలా అదృష్టమని వారి చేసిన కష్టానికి ఫలితం అని వారికి అభినందిస్తూ వారికి శాలువాతో సత్కరించి వారి తల్లిదండ్రులను సూపర్ స్టార్ నీ కన్నారని వారిని అభినందించారు. అనంతరం మహతి విద్యకు సంబంధించిన ఫీజు అంతా కూడా వారు భరిస్తానని వారికి అభయమిస్తూ వారికి మరొక్కసారి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళ్యాణపురి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు టిఆర్ వికాస్ జిఎస్ గణేష్ కుమార్, జెఎస్ ప్రదీప్, సిఎస్ మాధవి రెడ్డి, ఏ ఎస్ ఎన్ మూర్తి, శ్వేత , స్వప్న మొదలగు వారు పాల్గొన్నారు

గురువులకు ఘన సన్మానం, విద్యార్థులకు ప్రోత్సాహం - కృష్ణవేణి స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ సంబరం...!

● కృష్ణవేణి టాలెంట్ స్కూల్ టీచర్స్ డే వేడుకలు.. ప్రతిభావంతులకు బ్యాడ్జ్ ల ప్రదానం.

//వేములవాడ నియోజకవర్గం// సెప్టెంబర్ - 05 (ప్రజావాణి) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా, ఆనందోత్సాహాల నడుమ జరిగాయి. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయ వృత్తి గొప్పతనాన్ని కొనియాడారు.పాఠశాల డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. ఉపాధ్యాయుల కృషి, అంకితభావం వెలకట్టలేనిదని కొనియాడారు.విద్యార్థులందరికీ, ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేష్ మాట్లాడుతూ...ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని, వారి సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా బ్యాడ్జ్ ల ప్రదానోత్సవం నిర్వహించారు. విద్యా సంవత్సరంలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించారు. స్టూడెంట్ కౌన్సిల్ లీడర్లు, క్లాస్ 1-2-3 ర్యాంకర్లు, సబ్జెక్ట్ టాపర్లు, స్టార్ రైటర్లు, స్టార్ రీడర్లు, స్పీకింగ్ స్క్వాడ్ సభ్యులకు గౌరవంగా బ్యాడ్జ్‌లను అందజేసి అభినందించారు. బ్యాడ్జ్ లు పొందిన విద్యార్థుల్లో నూతన ఉత్సాహం వెల్లివిరిసింది.అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను కీర్తిస్తూ ప్రదర్శించిన ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, ప్రసంగాలు అందరినీ అలరించాయి. ఉపాధ్యాయులకు విద్యార్థులు పూలమాలలు, గ్రీటింగ్ కార్డులతో కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట...

- సమాజంలో పవిత్రమైన స్థానం ఉపాధ్యాయులదే.
- విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గ దర్శకాలు.
- 80 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు.
- మెమెంటో శాలువాలతో ఘనంగా సత్కారాలు
- ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐయిలయ్య.

సెప్టెంబర్ 05 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యా యుల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. శని వారం రోజు కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఉపాధ్యాయుల దినోత్సవం , దిగంవత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేసి అనేక కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. సమాజంలో పవిత్రమైన స్థానం ఉపాధ్యాయులదని ఆయన కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించి ఉత్తమ ఉపాధ్యా యులగా ఎంపిక చేయడం ఉపాధ్యాయులకు ఎంతో గౌరవ ప్రదంగా ఉంటుందన్నారు. గురువులను సన్మానించు కోవడం అంటే ఒక జన్మ దిన ధన్యమే అని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత మనం ఎక్కువ గౌరవించేది గురువులని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే వారిని తీర్చిదిద్దే బాధ్యత గురువు లదేనని వారి సేవలను కొనియాడారు. గురువులు ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తులో వెలుగులు నింపారని తెలిపారు. ఉపాధ్యాయుల శ్రమ మట్టిలో మాణిక్యం లాంటిది అని , ఉపాధ్యాయులు పిల్లలను తన సొంత పిల్లలుగా చూసుకుంటున్నారని తెలిపారు. తాను రైతు కుటుంబంలో పుట్టి ఒక ఉన్నత స్థాయికి ఎదిగా మంటే ఆ గౌరవ ప్రదం గురువులకే దక్కుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారతదేశం తోనే కా కుండా ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా విద్యా రంగం పై పెద్దపీట వేసిందని అన్నారు. ఇంటి గ్రేటెడ్ స్కూల్స్ , ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సన్న బియ్యంతో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని ఇవ్వడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలో అన్ని మౌలిక వసతులను కల్పించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఉపాధ్యాయు లు ఏ పని చేసిన ఒక చిత్త శుద్ధితో పని చేస్తారని ఉపాధ్యాయులను అభి నందించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ముందుగా ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయు ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మంచి నడవడిక , క్రమ శిక్షణ , నైతిక విలువలు నేర్పిస్తూ వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం లో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినంద నీయమన్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యా యులే మార్గదర్శకులని, వారి బోధన , ప్రోత్సాహం విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపు తారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విద్యార్థుల్లో సృజనాత్మ కత , నైపుణ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి , ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య , ఆహారం అందేలా ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని అన్నారు. అనంతరం 80 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యా యులను పురస్కారాలు , మెమెంటో శాలువాతో సత్కరించారు. ఈ కార్య క్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ అవేజ్ చిస్తి , జడ్పీ సీఈఓ శోభారాణి , జిల్లా విద్యాధికారి భిక్షపతి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయినీ , ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

పిట్టల ఎల్లయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

పెద్దపల్లి సెప్టెంబర్ 5 ప్రజావాణి :పిట్టల ఎల్లయ్యపల్లి లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని పిట్టల ఎల్లయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తవుటమ్ సంతోష్ మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని గౌరవాన్ని తీసుకువచ్చారని, ఉత్తమ ఉపాధ్యాయుడిగా, తత్వవేత్తగా దేశానికి విశిష్ట సేవలు అందించడంతో పాటు భారత రాష్ట్రపతిగా అత్యున్నత బాధ్యతలు నిర్వర్తించారని కొనియాడారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థులు, తల్లిదండ్రులు సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులు చూపిన అభిమానం, గౌరవం పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం సుమలత, పూర్వ ప్రాథమిక పాఠశాల సిబ్బంది పద్మ, మానస, విద్యాభిమాని యాదగిరి సమ్మయ్య, లత, మధురమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న కొమురం భీం విగ్రహానికి భూమి పూజ.

మంచిర్యాల జిల్లాప్రజావాణి తేదీ 5/9/2026 దండేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న కొమురం భీం విగ్రహానికి భూమి పూజ. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన అర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఆర్డిపిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి,సర్పంచ్ అజ్మీర రాజేశ్వర్ నాయక్, ఉప సర్పంచ్ సిరికొండ నవీన్, కాంగ్రెస్ నాయకులు లక్కాకుల సృజన్,ఆకుల దుర్గ ప్రసాద్,కొంగల నవీన్,అదివాసీ నాయకులు పెంద్రం శ్రీనివాస్, రాజు,కుడిమెత సోము పాల్గొన్నారు.

గురువులకు ఘన సన్మానం.. ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ఓదెల/పెద్దపల్లి సెప్టెంబర్ 5 ప్రజావాణి:డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తి గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి యాదవ సంఘం మాజీ మండల అధ్యక్షులు కావటి రాజు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో గురువుల సేవలు చిరస్మరణీయమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికతను అందిస్తూ సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుల్లూరి శ్రీనివాస్, సహ ఉపాధ్యాయులు మేకల కుమారస్వామి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు మారం సంధ్య, ప్రాథమిక పూర్వ విద్యా ఉపాధ్యాయురాలు కంకణాల శివాంజలి, ఆయా చెలికాని భవాని, అలాగే మారం సుధాకర్ రెడ్డి, మద్దూరి శ్రీనివాస్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు గురువుల గొప్పతనాన్ని వివరిస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞత భావాన్ని చాటుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించి, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని తమ పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించిన కావటి రాజు యాదవ్ కి పాఠశాల తరఫున ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తంగళ్లపల్లిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

తంగళ్లపల్లి: శ్రీ సరస్వతీ శుభోదయం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప ఉపాధ్యాయుడు, స్కాలర్, తత్వవేత్తగా దేశానికి సేవలందించారని, భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా, అనంతరం రెండో రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. 1962 సంవత్సరం నుంచి భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు.ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని నింపడంతో పాటు, వారిని సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దుతారని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇంజనీర్లు, వైద్యులు, న్యాయవాదులు తదితర వివిధ రంగాల్లో సేవలందించే నిపుణులను తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ మార్గదర్శకులుగా నిలుస్తూ, వారి భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు నిరంతరం ఆలోచిస్తారని తెలిపారు.అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడిని కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస్ యాదవ్ ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు, ఆశీస్సులు అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస్ యాదవ్‌తో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజావాణి తేదీ,5/9/2026మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వెలుగనూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు... ఈ సందర్భంగా పిల్లలు ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు.. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, బొలిశెట్టిరాజన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు...

బోధనలోని మాధుర్యాన్ని ఆస్వాదించిన విద్యార్థులు

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 5: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలోని గాయత్రీ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు స్వయంగా అధ్యాపకుల పాత్రను పోషిస్తూ తరగతులకు బోధన నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తిలోని గొప్పతనాన్ని, బోధనలోని మాధుర్యాన్ని వారు అనుభవించారు. అనంతరం విద్యార్థులు తమ అధ్యాపకులను ఘనంగా సన్మానించి సత్కరించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత రాష్ట్రపతి స్థాయికి ఎదిగి, ప్రపంచం గర్వించదగిన మేధావిగా నిలిచారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి వచ్చిన వ్యక్తి దేశ అత్యున్నత పదవిని అలంకరించడం భారతదేశంలోని ఉపాధ్యాయులం దరికీ గర్వకారణమని అన్నారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని, విద్యార్థులు మరియు అధ్యాపకులు ఆయనను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సురేష్, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు, యువత సమస్యలను పరిష్కరించాలి -- ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి-- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం ఆగస్టు 05మిర్యాలగూడ: కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా బీ=ూ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు నాయకత్వంలో విద్యార్థులు, యువత సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గ కేంద్రంలోని రెడ్డి కాలనీలో గల BRS పార్టీ కార్యాలయంలో విద్యార్థులు, యువతతో సమావేశం నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని నాయకులు విమర్శించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలని, యూత్ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం BRS పార్టీ కార్యాలయం నుంచి భారీగా బైక్ ర్యాలీగా బయలుదేరి గాంధీ బొమ్మ, బస్టాండ్ మీదుగా రౌండ్ వరకు యువత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యువత పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలపై నినాదాలు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తోందని, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే BRS పార్టీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీ=ూ యువనాయకులు నల్లమోతు సిద్ధార్థ,ఎండి.యూసుఫ్, ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి,ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, ఎండి.ఇలియాస్ ఖాన్,అంగోతు హతిరాం నాయక్, కుందూరు వీరకోటి రెడ్డి, ఎండి.మగ్దుంపాషా,ఎండి.మాజీద్,BRSV రాష్ట్ర కార్యదర్శి ఎండి.షోయబ్, యర్రమళ్ళ దినేష్, PCK ప్రసాద్, BRS పార్టీ నాయకులు, విద్యార్థి నాయకులు,యువజన నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలు ఉమాదేవికి ఎస్పీ అభినందనలు

- విద్యార్థినులకు పోక్సో చట్టం, సైబర్ నేరాలు, డ్రగ్స్ పై అవగాహన
- విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు
- సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్

చిలిపిచెడ్.సెప్టెంబర్ 5 ప్రజావాణి చిలిపిచెడ్ మండలం చిట్కుల్ కేజీబీవీ పాఠశాలలో శనివారం నిర్వహించిన వేడుకల్లో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ఎస్పీ పేర్కొన్నారు.విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి, మార్గదర్శకత్వం ఉంటుందన్నారు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఉమాదేవిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విద్యారంగానికి ఆమె అందిస్తున్న సేవలను ప్రశంసించారు.అనంతరం విద్యార్థినులతో ఎస్పీ గారు ముఖాముఖిగా మాట్లాడి పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు.బాలికలు తమకు ఎదురయ్యే ఇబ్బందులను పోలీస్ అక్క దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు పంచుకోవద్దని సూచించారు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు.విద్యార్థినుల విద్యాభ్యాసం, భవిష్యత్తు లక్ష్యాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎంఈఓ, పాఠశాల అధ్యాపకులు, సీఐలు సందీప్ రెడ్డి, రంగాకృష్ణ, ఎస్ఐ నర్సింలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్వల కదిలింది.. 'ఎస్ ఐ ఆర్' గ్రామ సభతో పల్లె ప్రగతికి సరికొత్త బాట!

- ఓటు హక్కు పారదర్శకతపై కేసముద్రం తహశీల్దార్ వివేక్ దిశానిర్దేశం.!
- సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రయ్య ఆధ్వర్యంలో ప్రజా చైతన్యం.!
- వేలాది మంది గ్రామస్థులకు చేకూరనున్న లబ్ధి కల్వల పంచాయతీ ఆదర్శం.!

కేసముద్రం సెప్టెంబర్ 5, ప్రజావాణి.పల్లె ప్రగతికి అసలైన పునాది ఎక్కడ పడుతుంది? ఒక ఓటు హక్కులో.. ఆ ఓటును ఎన్నుకునే పారదర్శకమైన వ్యవస్థలో! సరిగ్గా ఇదే సూత్రాన్ని నిరూపించింది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని కల్వల గ్రామ పంచాయతీ. అక్కడ నిర్వహించిన 'ఎస్ ఐ ఆర్' (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) గ్రామ సభ కేవలం ఒక ప్రభుత్వ నిరుత్సాహపూరిత మీటింగ్‌లా సాగలేదు. అదొక ప్రజాస్వామ్య పండుగలా, ఊరి భవిష్యత్తును మార్చే ఒక బృహత్తర వేదికలా ఊరి జనాలను కదిలించింది. సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రయ్య సారథ్యంలో జరిగిన ఈ సభ, పాలకులకు-ప్రజలకు మధ్య సరికొత్త నమ్మకాన్ని కల్పించింది.

సారాంశం లోతుల్లోకి వెళ్తే.. అసలేమిటీ 'ఎస్ ఐ ఆర్'?

చాలామందికి గ్రామ సభ అనగానే ఏదో నిధుల గురించో, రోడ్ల గురించో అనుకుంటారు. కానీ, అన్నింటికన్నా ముఖ్యం 'ఓటర్ల జాబితా పారదర్శకత'.ఈ విషయాన్నే సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన కేసముద్రం తహశీల్దార్ వివేక్ ఎంతో ఆసక్తికరంగా వివరించారు.అర్హత ఉండి కూడా ఓటు లేని యువతకు అవకాశం కల్పించడం,ఊరిలో లేని వారిని, మరణించిన వారి ఓట్లను తొలగించడం,తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయడమే ఈ 'ఎస్ ఐ ఆర్' అసలు లక్ష్యం.బి ఎల్ ఓ లు, వార్డు సభ్యులు క్షేత్రస్థాయిలో పడిన కష్టాన్ని ఈ సభలో ప్రజల ముందే ఉంచి చర్చించడం అధికారుల పారదర్శకతకు అద్దం పట్టింది.తప్పుడు ఓట్లు పోయి.. నిజమైన ఓటరు నిలబడితేనే.. నిజాయితీ గల నాయకుడు వస్తాడు. అప్పుడే ఊరు బాగుపడుతుంది – ఇదే ఈ గ్రామ సభ ఇచ్చిన అతిపెద్ద సందేశం. ఈ సభ ద్వారా కల్వల గ్రామానికి జరిగే ప్రయోజనాలు ఇవే:

అర్హులకే పథకాలు:

సరైన ఓటర్ల జాబితా ఉంటే, రేపు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా ఎలాంటి తారుమారు లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరుతాయి.

ప్రశ్నించే హక్కు:

వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు అంతా ఒకే చోట చేరి, ఓటు హక్కుతో పాటు ఊరిలోని తాగునీరు, డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల వంటి సమస్యలపై అధికారులను నేరుగా ముఖాముఖి ప్రశ్నించే ధైర్యాన్ని ఈ సభ ఇచ్చింది.

యువతకు పెద్దపీట:

కొత్తగా ఓటు హక్కు పొందుతున్న యువత, తమ ఊరి అభివృద్ధిలో తాము కూడా భాగస్వాములం కాబోతున్నామనే ఉత్సాహంతో సభలో పాల్గొనడం విశేషం.గ్రామ సర్పంచ్ సుజాత రామచంద్రయ్య ప్రత్యేక చొరవతో ఊరిలోని మహిళలు, రైతులు, యువకులు ఉదయాన్నే పనులన్నీ పక్కనబెట్టి గ్రామ సభకు తరలివచ్చారు. ప్రజల్లో కనిపించిన ఈ చైతన్యాన్ని, క్రమశిక్షణను చూసి తహశీల్దార్ వివేక్ గారు ముగ్ధులయ్యారు. "అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి ఒకే తాటిపైకి వస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో కల్వల నిరూపించింది" అని ఆయన కొనియాడారు. కల్వల చూపిన ఈ పారదర్శక బాట, మహబూబాబాద్ జిల్లాలోని మిగతా గ్రామాలకు ఒక దిక్సూచిగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వివేక్, గ్రామసభ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

- మెదక్ జిల్లా ఎస్పీ డీ.వి. శ్రీనివాసరావు ఐపిఎస్

చిలిపిచెడ్. సెప్టెంబర్ 5 ప్రజావాణి చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐ.పి.ఎస్ .మెదక్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐ.పి.ఎస్ చిలిపిచెడ్ మండల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, మరియు పోలీసింగ్‌లో నూతన సాంకేతిక వ్యవస్థల అమలు తీరును ఎస్పీ నిశితంగా పరిశీలించారు.తనిఖీలో భాగంగా జిల్లా ఎస్పీ అధికారులకు, సిబ్బందికి జారీ చేసిన ముఖ్య ఆదేశాలు సాంకేతికత వినియోగం రికార్డులు పోలీస్ స్టేషన్‌లో సాంకేతికతను (సీ సీ టి ఎన్ ఎస్) మరింత సమర్థవంతంగా ఉపయోగించాలని ఆదేశించారు. ఎఫ్.ఐ.ఆర్ (ఆఫ్ ఐ ఆర్), జనరల్ డైరీ (జి డి), కేస్ డైరీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు.ఆన్-సైట్ జీరో ఎఫ్.ఐ.ఆర్: సుప్రీంకోర్టు మరియు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆన్-సైట్ ఎఫ్.ఐ.ఆర్ (వన్ సైడ్ ఎఫ్ ఐ ఆర్) మరియు జీరో ఎఫ్.ఐ.ఆర్ (జీరో ఎఫ్ ఐ ఆర్) విధానాలను పక్కాగా అమలు చేయాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును చట్టప్రకారం తక్షణమే నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

యాప్ వినియోగం: కేసులకు సంబంధించిన డిజిటల్ మరియు భౌతిక సాక్ష్యాలను నిబంధనల ప్రకారం 'ఈ-సాక్ష్యం' యాప్‌లో క్షుణ్ణంగా భద్రపరచాలని, ఆధునిక దర్యాప్తు విధానాల ద్వారా నిందితులకు కోర్టులో శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలు సేకరించాలన్నారు.శాంతిభద్రతలు,రాత్రి పహారా: చిలిపిచెడ్ మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా ఇళ్లు, వాహనాల దొంగతనాలు జరగకుండా రాత్రి పహారా (నైట్ పెట్రోలింగ్) ముమ్మరం చేయాలన్నారు. పాత నేరస్థులు, రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని స్పష్టం చేశారు.ప్రజాస్నేహపూర్వక పోలీసింగ్: స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరియు పిల్లల సమస్యలపై సిబ్బంది తక్షణమే స్పందించి న్యాయం చేయాలని, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని సూచించారు.అనంతరం ఎస్పీ స్టేషన్ ఆవరణను, సీసీటీవీ (సీసీటీవీ) కెమెరాల పనితీరును, మాల్ఖానా మరియు సీజ్ చేసిన వాహనాల వివరాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మెదక్ డిఎస్పి నరేందర్ గౌడ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) రంగాకృష్ణ, చిలిపిచెడ్ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) నర్సింలు మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం

- నూతన యూనియన్ ఐడీ కార్డుల పంపిణీ

మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 05 (మరవెల్లి) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశంతో పాటు నూతన యూనియన్ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. అందోలు మండలం మరవెల్లి గ్రామంలోని శివ పార్వతుల ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేశం అధ్యక్షం వహించారు.

ఈ సందర్భంగా జర్నలిస్టులకు నూతన యూనియన్ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, ఐక్యత, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం సంఘం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సమావేశంలో పలువురు పేర్కొన్నారు.కార్యక్రమానికి తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ సలహాదారులు శెట్టి అమృత, ముఖ్య అతిథులుగా జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ వీరు మల్లప్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల వైద్యనాథ్, రాంసాన్పల్లి ఉపసర్పంచ్ పృథ్వి సాగర్ రెడ్డి, ఉపసర్పంచ్ వెండికోల్ భూమయ్య, మాజీ విద్యా కమిటీ చైర్మన్ జుట్టు నరసింహులు, మాజీ ఉపసర్పంచ్ మంగలి వీరయ్య హాజరయ్యారు.అలాగే తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీ టి. సంగమేశ్వర్, నేషనల్ పబ్లిసిటీ సెక్రటరీ కే. సంగమేశ్వర్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వి. వెంకటేశం, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బి. కృష్ణ, రాష్ట్ర సెక్రటరీ ఎం. నాగేష్, జాయింట్ సెక్రటరీ మన్నె పోచయ్య, రాష్ట్ర అడ్వైజర్ బి. సంగమేశ్వర్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సిహెచ్. బస్వరాజ్, వైస్ ప్రెసిడెంట్ టి. నాగరాజు, క్యాషియర్ కే. మల్లేశం గౌడ్, జనరల్ సెక్రటరీ జె. రాజు, జిల్లా అడ్వైజర్ శ్రీనివాస్ నాయక్, జిల్లా సభ్యుడు పవన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా యూనియన్ సభ్యులు శ్రీకాంత్ వైస్ ప్రెసిడెంట్ వినోద్ చారి కమిటీ మెంబర్ తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నూతన సభ్యులు, జర్నలిస్టులకు ఐడీ కార్డులు అందజేశారు.

మఠంపల్లి మోడల్ స్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

హుజూర్నగర్ సెప్టెంబర్ 5 (ప్రజావాణి) భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, గొప్ప విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం మఠంపల్లి లోని తెలంగాణ మోడల్ స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. సమాజ నిర్మాణంలో, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని కొనియాడారు. ప్రతి విద్యార్థిని బాధ్యతాయుతమైన పౌరుడిగా మార్చే శక్తి ఒక్క గురువుకే ఉందన్నారు. దేశ విద్యారంగానికి డా. రాధాకృష్ణన్ అందించిన అమూల్యమైన సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు.వైభవంగా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు: ఈ వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకుంటూ పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. గురువుల గొప్పదనాన్ని వివరించే లా విద్యార్థులు చేసిన ప్రసంగాలు, పాడిన గీతాలు, మరియు ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సీనియర్ విద్యార్థులు నేడు ఉపాధ్యాయుల పాత్రను పోషించి (సెల్ఫ్ గవర్నమెంట్ డే) తరగతులు నిర్వహించడం విశేషం.

బహుమతుల ప్రదానం:

ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అలాగే విద్యాబోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను పాఠశాల తరపున ఘనంగా సన్మానించారు.

ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల యాజమాన్యం తరపున గురుదేవులందరికీ హృదయపూర్వక ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

బడిబాటలో 'సురేష్' ముద్ర.. సేవకే దక్కిన 'ఉత్తమ' గౌరవం!

- తల్లిదండ్రుల నమ్మకానికి నిలువెత్తు రూపం.. విద్యార్థుల పాలిట అప్యాయత మూర్తి మన సురేష్ సార్.!
- ఉపాధ్యాయ వృత్తి అంటే కేవలం పుస్తకాల్లోని పాఠాలు చెప్పడం మాత్రమే కాదు..
- ఒక తరాన్ని నడిపించే బాధ్యత అని నిరూపించారు సురేష్ సార్.
- ఆయన విద్యా సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ప్రకటించిన 'మండల ఉత్తమ ఉపాధ్యాయుడు' పురస్కారం, ఆయన అంకితభావానికి దక్కిన సముచిత గౌరవం.
- ఈ సందర్భంగా సార్‌పై ప్రత్యేక కథనం.. ప్రజావాణిలో..

కేసముద్రం సెప్టెంబర్ 05.ప్రజావాణి. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెస్తూ, విద్యార్థుల భవిష్యత్తును బంగారు బాటగా తీర్చిదిద్దుతున్న ప్రముఖ ఉపాధ్యాయులు సురేష్ సార్‌ను ఈ ఏడాది 'మండల ఉత్తమ ఉపాధ్యాయుడు' పురస్కారం వరించింది. ఆయన అందించిన నిరుపమాన సేవలకు దక్కిన సముచిత గౌరవంగా ఈ అవార్డు నిలిచింది. కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, విద్యార్థుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న సురేష్ సార్ ప్రస్థానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం.

తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ..

నేటి రోజుల్లో పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రుల్లో ఎన్నో ఆందోళనలు ఉంటాయి. కానీ, సురేష్ సార్ క్లాస్‌రూమ్‌లోకి అడుగుపెట్టారంటే తల్లిదండ్రులకు ఒక కొండంత నమ్మకం. తమ పిల్లలను బాధ్యతగల పౌరులుగా మార్చే బాధ్యతను ఆయన భుజాన వేసుకున్నారు. తల్లిదండ్రులు ఆయనపై ఉంచిన విశ్వాసాన్ని ప్రతిక్షణం కాపాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులను సైతం నగరాల పిల్లలతో పోటీపడేలా తీర్చిదిద్దుతున్నారు. స్కూల్ మరియు పేరెంట్స్ మధ్య ఒక బలమైన నమ్మక వారధిగా ఆయన నిలిచారు.

విద్యార్థుల పట్ల అపారమైన ప్రేమ -- చదువుపై ఆసక్తి.

సురేష్ సార్ బోధనలో కేవలం మార్కులు మాత్రమే ముఖ్యం కాదు, విద్యార్థుల సమగ్ర వికాసమే ధ్యేయం. పిల్లలపై ఆయన చూపించే పితృ సమానమైన ప్రేమ, ఆప్యాయత విద్యార్థులను బడికి రప్పించేలా చేస్తున్నాయి. చదువంటే భయపడే పిల్లల్లో సైతం సబ్జెక్ట్ పట్ల ఆసక్తిని, జిజ్ఞాసను పెంచడంలో ఆయన శైలి అద్భుతం. క్రమశిక్షణతో కూడిన ఆయన ప్రేమ విద్యార్థుల్లో చదువుపై సరికొత్త కసిని పెంచుతోంది.

మరింత మెరుగైన బోధన.. ఉన్నత దిశగా అడుగులు.

మారుతున్న కాలానికి అనుగుణంగా సురేష్ సార్ తన బోధనా పద్ధతులను మరింత మెరుగుపరుచుకుంటూ వెళ్తున్నారు. క్లిష్టమైన అంశాలను సైతం సరళంగా, సరికొత్త ప్రయోగాలతో విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పడంలో ఆయన దిట్ట. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, వాటిని విద్యార్థులకు మరింత మెరుగ్గా అందిస్తూ విద్యా ప్రమాణాలను పెంచుతున్నారు. ఈ 'మండల ఉత్తమ ఉపాధ్యాయ' పురస్కారం సురేష్ సార్ సేవలకు దక్కిన చిన్న గుర్తింపు మాత్రమేనని.. ఆయన నేతృత్వంలో మరెన్నో తరాలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాయని స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దళిత నాయకులు,బొట్ల స్వామికి ఘన నివాళులు

రామగుండం సెప్టెంబర్ 5 ప్రజావాణిఅకాల మరణం పొందిన,అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రామగుండం నియోజకవర్గ ఇన్చార్జి బొట్ల స్వామికి, అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఘన నివాళులర్పించింది, 30 సంవత్సరాల క్రితం ఎలకలపల్లి గేటు అంబేద్కర్ సంఘం అధ్యక్షునిగా ప్రస్థానం మొదలై ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రామగుండం నియోజకవర్గ ఇన్చార్జిగా ఎదిగిన బోట్ల,స్వామి గుండెపోటుతో చికిత్స పొందుతూ శుక్రవారం అకాల మరణం చెందారు శనివారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కవ్వంపల్లి సతీష్, సీనియర్ నాయకులు పానుగంటి రాజలింగం పుల్లూరి మహేందర్, కాదాసి, కనకయ్య లు, భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు, శవ పేటికపై నీలి జెండా కప్పి ఆయన దళితుల కోసం చేసిన సేవలను కొనియాడారు, బొట్ల స్వామి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతి సంతాపాన్ని తెలిపారు ఆయన కుటుంబానికి ఎల్లవేళలా ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం అండగా ఉంటుందన్నారు, ఈ కార్యక్రమంలో పలువురు ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, పాల్గొన్నారుం

కాంగ్రెస్ మోసపూరిత పాలనపై భగ్గుమన్న బీఆర్ఎస్..

- విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తాం..
- విద్యార్థినులకు స్కూటీల హామీ ఏమైంది..
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి..
- మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్..

కోదాడ, సెప్టెంబర్ 5/ ప్రజావాణి మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కారు అడుగడుగునా అన్ని వర్గాల ప్రజలను దారుణంగా నయవంచన చేస్తోందని కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కోదాడ బస్టాండ్ సెంటర్ వద్ద గల గాంధీ విగ్రహం నుంచి రంగా థియేటర్ వరకు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చదువుకునే ఆడపిల్లలకు, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, గద్దెనెక్కాక ఆ హామీని పూర్తిగా గాలికొదిలేసిందని విమర్శించారు. విద్యార్థులు చదువుకోవడానికి వెసులుబాటు కల్పించే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని, చదువు పూర్తయినా సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కాలేజీలు చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.బకాయిలు అడిగిన విద్యాసంస్థల యాజమాన్యాలను ఈ ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ చేస్తోందని మండిపడ్డారు. అదేవిధంగా సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులకు కనీసం సరైన తిండి కూడా పెట్టలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. పురుగుల అన్నం పెడుతుండటంతో కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారని, గురుకులాల్లో పాముకాట్లకు గురై విద్యార్థులు మృత్యువాత పడుతున్న సంఘటనలు నిత్యం కనిపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగు నెలలైనా టెండర్లను ఖరారు చేయకుండా మంత్రులు తమ వాటాలు, కమీషన్ల కోసం విద్యార్థుల భవిష్యత్తు, పౌష్టికాహారంతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. మరోవైపు నిరుద్యోగులకు కొత్త జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ గారు ఇచ్చిన నోటిఫికేషన్లు, పూర్తి చేసిన రిక్రూట్‌మెంట్ల ప్రక్రియకు సంబంధించి ఇప్పుడు నియామక పత్రాలు అందజేస్తూ తమ ఘనతగా రేవంత్ రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారని, "మందికి పుట్టిన పిల్లలను మా వాళ్ళు" అని చెప్పుకుంటూ చంకలు గుద్దుకుంటున్నారని ఎద్దేవా చేశారు. విద్యార్థి లోకానికి ప్రభుత్వం నుండి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలనీ, నిరుద్యోగ యువత కోసం పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లను తక్షణమే విడుదల చేయాలనీ, అధికారంలోకి రావడానికి విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా అడుగడుగునా ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని, విద్యార్థుల తిరుగుబాటు ప్రతాపం ఏంటో చూపిస్తామని బొల్లం మల్లయ్య యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

పెద్దవంగర సెప్టెంబర్ 05 ప్రజావాణి

1000 రోజుల కాంగ్రెస్ ధగ పాలన పై నిరసన గా పెద్దవంగర మండలంలో మోటర్ బైక్ ర్యాలీని ప్రారంభించిన బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య మండల ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ సంజయ్ , మండలయూత్ అధ్యక్షుడు కాన్వాయిగూడెం సర్పంచ్ కాసాని హరీష్ ,రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో.యువత, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం నేడు (సెప్టెంబర్ 5న) పాలకుర్తి నియోజకవర్గం తొర్రూర్ మున్సిపాలిటీ లో జరుగుతున్నా బీఆర్ఎస్ పార్టీ భారీ బైక్ ర్యాలీ కి పెద్ద వంగర మండలం నుండి భారీ ఎత్తున బైక్ ర్యాలీ తో బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు,అభిమానులు,యువత అధిక సంఖ్యలో పాల్గొనారు.

ఎస్సార్ ప్రైమ్ స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

కోదాడ సెప్టెంబర్ 5.ప్రజావాణి : ఎస్సార్ ప్రైమ్ స్కూల్లో జోనల్ ఇన్చార్జ్ స్నేహలత ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువు లేనిదే జ్ఞానం లేదు జ్ఞానం లేనిదే అభివృద్ధి లేదని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ పటానికి పూలమాల వేసి, రాధాకృష్ణ గొప్పతనాన్ని తెలియజేశారు. ప్రతి యొక్క ఉపాధ్యాయుడు నిబద్ధతతో పని చేయాలన్నారు. ఉపాధ్యాయులు దేశ నిర్మాతలని కొనియాడారు. దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల యొక్క చేతిలో ఉందని అన్నారు. ప్రిన్సిపల్ పుల్లయ్య మాట్లాడుతూ ఎవరినైనా తయారు చేయగల శక్తి ఒక ఉపాధ్యాయునికే ఉందని అన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తు ఉపాధ్యాయుల మీద ఆధారపడి ఉందని అన్నారు. జీవితంలో తల్లిదండ్రుల తరువాత స్థానం ఉపాధ్యాయులదే అన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారిని సరియైన మార్గంలో నడిపే వారే ఉపాధ్యాయులు అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు,విద్యార్థిని, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ మైనార్టీ గురుకులంలో న్యాయ విజ్ఞాన సదస్సు

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలివిద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి
- న్యాయమూర్తి ఎం.హేమలత

నర్సాపూర్.సెప్టెంబర్ 5 ప్రజావాణిజాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు, మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సూచనలతో నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో నర్సాపూర్ మైనార్టీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి, కం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ఎం.హేమలత, హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు న్యాయపరమైన అంశాలతో పాటు సైబర్ భద్రత, సామాజిక మాధ్యమాల బాధ్యతాయుత వినియోగంపై అవగాహన కల్పించారు.న్యాయమూర్తి ఎం.హేమలత మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని అన్నారు. ఉపాధ్యాయులు బోధించే విషయాలను శ్రద్ధగా విని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు.ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హేమలత సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారాన్ని అందించవద్దని తెలిపారు. సైబర్ నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని, తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని అన్నారు. అవసరమైన సమయంలో న్యాయ సేవల సంస్థల ద్వారా అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులకు న్యాయమూర్తి ఎం. హేమలత శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మండల విద్యాధికారి తారా సింగ్, లీగల్ సర్వీసెస్ న్యాయవాది రాజు నాయక్, సీనియర్ మహిళా న్యాయవాది స్వరూప రాణి, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ న్యాయవాది మధు శ్రీ శర్మ, కళాశాల ప్రిన్సిపల్ మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హమారా ప్రసాద్ పై దేశద్రోహ కేసు నమోదు చేయాలి

- హమారా ప్రసాద్ వ్యాఖ్యల వెనుక ఉన్న శక్తులపై సమగ్ర విచారణ జరపాలి.
- కోటగిరిలో అంబేద్కర్ విగ్రహం వద్ద హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దగ్ధం.
- నిరసన తెలిపి,ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు.

కోటగిరి/ప్రజావాణి:-భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై తప్పుడు ప్రచారం చేస్తున్న హమారా ప్రసాద్‌పై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే దేశద్రోహ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్ సోంపూర్ పోచిరాం డిమాండ్ చేశారు.శనివారం నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కే.పోశెట్టి (పండు)ఆధ్వర్యంలో నాయకులు హమారా ప్రసాద్ దిష్టి బొమ్మను దగ్ధం చేసి తీవ్ర నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సోంపూర్ పోచిరాం మాదిగ మాట్లాడుతూ.ప్రజా ఉద్యమా లు చేసే వారిని అణచివేసి జైళ్లలో పెడుతున్న ప్రభుత్వాలు, రాజ్యాంగ నిర్మాతపైనే అసత్య ప్రచారాలు చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు.బాబాసాహెబ్ అంబేద్క ర్‌ను కల్పిత నాయకుడిగా సంబోధించడం అత్యంత విచారకరమని.ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు శక్తులపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కుల,వర్ణ,ప్రాంతీయ భేదాలు లేకుండా అందరికీ సమాన హక్కులు కల్పించింది అంబేద్కర్ రాసిన రాజ్యాంగమేనని గుర్తుచేశారు.ఈ నిరసన కార్యక్రమంలో కోటగిరి వార్డ్ సభ్యులు కన్నం శ్రీనివాస్,ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు సోనాలి లాలయ్య,యూత్ అధ్యక్షులు దినేష్,నాయకులు పేగు లాలయ్య,కే .సాయిలు, పోశెట్టి,కే.అబ్బయ్య,ఎడ్ల సాయిలు,ఎడ్ల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి సందర్భంగా రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 5, ప్రజావాణి: రాబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మంథని పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లకు శనివారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు.పండుగ సమయంలో నేరాలకు పాల్పడటం, గొడవలు సృష్టించడం, బలవంతపు చందాలు వసూలు చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గుంపులు ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు పాల్పడవద్దని పోలీసులు కఠినంగా హెచ్చరించారు. స్టేషన్ పరిధి విడిచి వెళ్లాల్సి వస్తే ముందుగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.వినాయక చవితి పండుగ బందోబస్తులో భాగంగా బీట్ చెకింగ్, నైట్ రౌండ్స్, ప్రత్యేక పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ప్రజలు వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో జరుపుకోవాలని పోలీసులు కోరారు. ఏదైనా సమస్య తలెత్తినా, అనుమానాస్పద పరిస్థితులు కనిపించినా వెంటనే మంథని పోలీసులను సంప్రదించాలని సూచించారు.

చిలిపిచ్చేడ్ పోలీస్ స్టేషన్ లో ఎస్పీ వార్షిక తనిఖీ

- మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్
- చిలిపిచ్చేడ్ పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీ చేశారు.

చిలిపిచెడ్.సెప్టెంబర్ 5 ప్రజావాణి చిలిపిచెడ్ మండలం లోస్టేషన్ ఆవరణలో మొక్క నాటి, సిబ్బంది కిట్ ను పరిశీలించారు ఎఫ్ ఐ ఆర్ ల నమోదు, స్టేషన్ డైరీలు, రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లు, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు,సీసీటీ అన్ ఎస్ ఈ సాక్ష్య నమోదును క్షుణ్ణంగా పరిశీలించారు పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు

ఎస్పీ ఆదేశాలు సూచనలు డయల్ 112: ఆపదలో ఉన్నవారు, అత్యవసర వేళ బాధితులు వెంటనే డయల్ 112 కు సమాచారం ఇవ్వాలి రికార్డులను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేసి పకడ్బందీగా నిర్వహించాలి బాధితులకు సత్వర న్యాయం కోసం నాణ్యమైన, పారదర్శక దర్యాప్తు చేయాలి స్టేషన్ కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, ఓర్పుతో విని సహాయం చేయాలి దుకాణాలు, వ్యాపార సంస్థలు, ప్రధాన కూడళ్ల వద్ద నీసీ కెమెరాల ఏర్పాటు ను ప్రోత్సహించాల- విలేజ్ పోలీస్ ఆఫీసర్లు గ్రామాలపై పూర్తి అవగాహనతో పనిచేయాలి సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్పరిణామాలపై ప్రతి గ్రామంలో విస్తృత అవగాహన కల్పించాల రౌడీషీటర్లు, సస్పెక్ట్ లపై నిరంతర నిఘా, బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలిఈ కార్యక్రమంలో డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు సందీప్ రెడ్డి, రంగా కృష్ణ, ఎస్ఐ నర్సింలు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలు లేకున్నా నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు.. పథక సామగ్రి ఎటు?

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి సెప్టెంబర్ 05 ప్రతి నెల గుడ్లు, పప్పుదినుసులు, నూనె సరఫరా.. లబ్ధిదారులు లేని కేంద్రాల్లో పంపిణీపై అనుమానాలు జూలపల్లి, సెప్టెంబర్ 5: జూలపల్లి మండల కేంద్రంలో పిల్లలు లేకున్నా కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా కేంద్రాల్లో చిన్నారుల హాజరు లేకపోయినా, ప్రభుత్వం తరఫున ప్రతి నెల గుడ్లు, పప్పుదినుసులు, వంట నూనె తదితర పోషకాహార సామగ్రి క్రమం తప్పకుండా సరఫరా అవుతున్నట్లు సమాచారం.చిన్నారులు లేకపోయినా కేంద్రాల నిర్వహణ పేరుతో ప్రభుత్వం నుంచి వస్తున్న పోషకాహార సామగ్రి ఎక్కడికి వెళ్తోంది..? అసలు లబ్ధిదారులు ఎంత మంది ఉన్నారు..? హాజరు రిజిస్టర్లలో నమోదు చేస్తున్న వివరాలు నిజమేనా..? అనే అనుమానాలు స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సి ఉంటుంది. అయితే జూలపల్లి మండల కేంద్రంలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య లేకపోయినా ప్రభుత్వ సరఫరాలు మాత్రం ప్రతి నెల కొనసాగుతున్నాయనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.ప్రతి నెల కేంద్రాలకు గుడ్లు, పప్పుదినుసులు, వంట నూనె తదితర సామగ్రి ఎంత మేరకు వస్తోంది, వాటిని ఎంత మంది లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు అనే విషయంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.పిల్లలు లేని కేంద్రాల్లో కూడా పోషకాహార సరఫరాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సంబంధిత ఐసీడీఎస్ అధికారులు స్పందించి, కేంద్రాల వారీగా లబ్ధిదారుల సంఖ్యను పరిశీలించాలని కోరుతున్నారు. హాజరు రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లు, పోషకాహార పంపిణీ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.ప్రభుత్వం పేద గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుండగా, లబ్ధిదారులు లేని కేంద్రాల్లో కూడా సామగ్రి సరఫరా జరుగుతోందనే ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.జిల్లా అధికారులు వెంటనే జోక్యం చేసుకుని జూలపల్లి మండల కేంద్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలపై సమగ్ర విచారణ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన ఇసుక రీచ్ లపై డీఎల్ఎస్సీ సమావేశం

- సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష.

రాజన్న సిరిసిల్ల, ప్రజావాణి ప్రభుత్వ అభివృద్ధి పనులు, నిర్మాణాలు, వాణిజ్య నిర్మాణాల కోసం గుర్తించిన నూతన ఇసుక రీచ్ లపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నూతన ఇసుక రీచ్ ల కోసం మైనింగ్ శాఖ, నీటి పారుదల, భూగర్భ, రెవెన్యూ, జిల్లా పంచాయతీ, మిషన్ భగీరథ, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారుల ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ఇసుక రీచ్ లు పరిశీలించగా.. దానిపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం డిస్ట్రిక్ట్ లెవెల్ శాండ్ కమిటీ (డీఎల్ఎస్సీ) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి పనులు, నిర్మాణాలు, వాణిజ్య నిర్మాణాల కోసం నూతన ఇసుక రీచ్ ల ఏర్పాటుపై చర్చించామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో టీజీఎండీసీ పీఓ శ్రీనివాస్, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి కుమార్, టీజీ, నీటి పారుదల శాఖ అధికారులు ప్రశాంత్, కిషోర్ కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్లు మహేష్, మురళి, భూగర్భ జల శాఖ, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు సర్టిఫికెట్లతో సర్పంచ్ పదవి?

- రంగంలోకి దిగిన ఆర్డీఓ.. విచారణతో పెరిగిన ఉత్కంఠ!

టేక్మాల్ సెప్టెంబర్ 5: (మన ప్రజావాణి) వెంకటాపూర్ గ్రామంలో ఎరుకల రాంబాయి,సర్పంచ్ పదవికి సంబంధించిన సర్టిఫికెట్ల విషయంలో తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించారన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. టేక్మాల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మెదక్ ఆర్డిఓ రమాదేవి తప్పుడు ధ్రువ పత్రాలపై విచారణ చేపట్టారు ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందడంతో ఆర్డీఓ రంగంలోకి దిగినట్లు సమాచారం. సంబంధిత ధ్రువపత్రాల నిజానిజాలను పరిశీలించేందుకు అధికారులు విచారణ చేపట్టడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సర్పంచ్ పదవికి అర్హత విషయంలో సమర్పించిన సర్టిఫికెట్లు నిజమైనవేనా? నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.ఇప్పటికే సంబంధిత రికార్డులు, ధ్రువపత్రాలపై పరిశీలన జరుగుతున్నట్లు సమాచారం. విచారణలో సర్టిఫికెట్లు నిజమైనవని తేలితే ఆరోపణలకు తెరపడనుండగా, అవకతవకలు నిర్ధారణ అయితే తదుపరి చర్యలు తప్పవన్న చర్చ స్థానికంగా జోరందుకుంది ఆర్డీఓ విచారణలో అసలు నిజం వెలుగులోకి వస్తుందా?సర్పంచ్ పదవి కొనసాగుతుందా.. లేక కొత్త మలుపు తిరుగుతుందా? అన్నది ఇప్పుడు స్థానికంగా హాట్‌టాపిక్‌గా మారింది.

రైతు ప్రయోజనమే ధ్యేయంగా.. వ్యవసాయ శాఖ అడుగులు.!

- సన్న వడ్ల రైతులకు ప్రభుత్వం తీపి కబురు.. క్వింటాలుకు రూ.500 బోనస్.
- సెప్టెంబర్ 10లోగా సీడ్ సెల్ యాప్‌లో నమోదు తప్పనిసరి.
- రైతులకు అవగాహన కల్పిస్తూ క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ బి. వెంకన్న ప్రత్యేక చర్యలు.

కేసముద్రం, సెప్టెంబర్ 5, ప్రజావాణి.రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేసింది. ప్రభుత్వం ప్రకటించిన సన్న రకాల వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ రైతులకు అందేలా కేసముద్రం మండల వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి తో . రైతులు చివరి నిమిషంలో ఇబ్బందులు పడకుండా ముందుగానే విత్తన వివరాలను నమోదు చేయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.ఈ మేరకు శనివారం కేసముద్రం మండలంలోని పలు విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న, వ్యవసాయ విస్తరణ అధికారులు సందర్శించి విత్తన డీలర్లతో రైతుల వివరాలను సీడ్ సెల్ యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు.రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనం ఎక్కడా చేజారకుండా అధికారులు తీసుకుంటున్న ఈ ముందస్తు చర్యలు రైతుల్లో భరోసా కల్పిస్తున్నాయి.

రూ.500 బోనస్.. రైతులకు అదనపు ప్రోత్సాహం!

2026--27 వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న రకాల వరిని సాగు చేసిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించినప్పుడు, నిబంధనల ప్రకారం మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ పొందే అవకాశం ఉంది.ప్రభుత్వం గుర్తించిన సన్న రకాలు:

తెలంగాణ సోనా (ఆర్ ఎన్ ఆర్ 15048), బి బి టి 5204, కే ఎన్ ఎం 1638, ఎక్స్ ఎన్ టి సోనా, జై శ్రీరామ్, డబ్ల్యూ జి ఎల్ 44, కే ఎన్ ఎం 7715.

రైతులారా.. సెప్టెంబర్ 10 మరిచిపోవద్దు!

సన్న రకాల వరి సాగు చేసిన రైతులు తాము విత్తనం కొనుగోలు చేసిన డీలర్‌ను సంప్రదించి సెప్టెంబర్ 10లోగా సీడ్ సెల్ యాప్‌లో వివరాలను నమోదు చేయించుకోవాలి.తప్పనిసరిగా తీసుకెళ్లాల్సిన పత్రాలు:

విత్తన కొనుగోలు బిల్లు,

ఆధార్ కార్డు,

పట్టాదారు పాస్‌బుక్/సంబంధిత భూ వివరాలు,

అవసరమైన ధ్రువీకరణ పత్రాలు

రైతులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే నమోదు పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించారు.

సొంత విత్తనం వాడినా.. నమోదు తప్పనిసరి.!

డీలర్ వద్ద విత్తనం కొనుగోలు చేయకుండా సొంతంగా విత్తనం సమకూర్చుకుని సన్న రకాల వరి సాగు చేసిన రైతులు కూడా తమ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలి.ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ సమర్పించి సెప్టెంబర్ 10లోగా విత్తన నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు తెలిపారు.

పంట నమోదు ఉంటేనే.. మద్దతు ధరకు మార్గం.!

వానాకాలం పంటల వివరాలను నమోదు చేసేందుకు ప్రతి రెవెన్యూ గ్రామంలో వ్యవసాయ శాఖ సర్వేయర్లు (వాలంటీర్లు) ద్వారా డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే నిర్వహిస్తోంది. రైతులు తమ పొలాల్లో సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా డిజిటల్ క్రాప్ బుకింగ్‌లో నమోదు చేయించుకోవాలని అధికారులు సూచించారు.వరి, పత్తి,వ్వ మొక్కజొన్న తదితర పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే సమయంలో ప్రభుత్వ మద్దతు ధర పొందేందుకు పంట నమోదు ప్రక్రియ కీలకమని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.

రైతు ప్రయోజనం కోసం.. అధికారుల ముందడుగు.!

రైతులకు ప్రభుత్వ పథకాలు, మద్దతు ధరలు, బోనస్ వంటి ప్రయోజనాలు అందాలంటే కేవలం పంట సాగు చేయడమే కాకుండా అవసరమైన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలను కూడా సకాలంలో పూర్తి చేయడం ఎంతో ముఖ్యం.ఈ విషయాన్ని రైతులకు చేరువ చేసేందుకు కేసముద్రం మండల వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తూ చర్యలు చేపట్టడం అభినందనీయమని రైతులు పేర్కొంటున్నారు.రైతు పండించిన పంటకు ప్రభుత్వం ప్రకటించిన ప్రయోజనం పూర్తిగా అందేలా ప్రతి రైతు వివరాలు సక్రమంగా నమోదు కావాలి. చివరి తేదీ లోపు రైతులందరూ ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి అని మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న సూచించారు.

హామీలు అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి పోస్టు ఊడక తప్పదు: ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హెచ్చరిక

మన ప్రజావాణి సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ :5 కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా నాలుగో రోజు సంగారెడ్డిలో విద్యార్థి--యువజన నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో నిరసన ప్రదర్శన నిర్వహించి ... అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూలమాల వేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువత, విద్యార్థులు, నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు."వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు వెయ్యి రోజులు పూర్తవుతున్నాయి. అయినా ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారం కాలేదు, జాబ్ క్యాలెండర్ అమలు కాలేదు, యూత్ డిక్లరేషన్ హామీలు నెరవేరలేదు. యువతకు ఇచ్చిన మాట ఏమైంది? నిరుద్యోగులకు చూపించిన ఆశలు ఏమయ్యాయి?" అంటూ ప్రశ్నించారు.అధికారం కోసం అవగాహన లేకుండా ఇష్టానుసారంగా హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా యువత, విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోందని ఆరోపించారు.

రేవంత్ రెడ్డి తన భాషను మార్చుకోవాలని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. "రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాషను చూసి విద్యార్థులు, యువత కూడా అదే స్థాయిలో ప్రశ్నిస్తున్నారు. యువతను తక్కువ అంచనా వేయొద్దు" అని అన్నారు.

దేశవ్యాప్తంగా యువత తమ హక్కుల కోసం పోరాడిన సందర్భాలను గుర్తుచేస్తూ, ప్రజాస్వామ్య గొంతును అణచివేయాలని ప్రయత్నించినా యువత ఉద్యమాలు ఆగవని స్పష్టం చేశారు."హామీలు అమలు చేయకపోతే బీఆర్ఎస్ పార్టీ పోరాటం మరింత ఉధృతం అవుతుంది. యువత, విద్యార్థుల పక్షాన చివరి వరకు నిలబడతాం అని ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం అని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి, యూత్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చాలి. లేకపోతే ప్రజా ఉద్యమం తీవ్రతరం అవుతుంది" అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హెచ్చరించారు.

"హామీలు అమలు చేసే వరకు మా పోరాటం ఆగదు... యువతకు న్యాయం జరిగే వరకు మా అడుగులు వెనక్కి పడవు" అంటూ ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఈ నిరసన ర్యాలీలో విద్యార్థులు, యువజన నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో చంద్ర గౌడ్, మాజీ డీసీసీబీ వైస్ పట్నం మాణిక్యం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, హకీం, మాజీ సీడీసీ చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి , విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి , మనోహర్ గౌడ్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు యువత నాయకులు శ్రవణ్ రెడ్డి, వాజిత్ పెద్ద ఎత్తున యువకులు విద్యార్థులు పాల్గొన్నారు

ముసాయిదా ఓటరు జాబితా లోని ఓటర్లందరూ తుది జాబితా లో వుండే లక్ష్యంగా చర్యలు...!

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి ముసాయిదా ఓటర్ల జాబితా లో ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కు పొందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇఆర్ఓ లతో కలిసి శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ, నోటీసుల జారీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో గుర్తించిన అనామలీస్, మ్యాపింగ్ లేని ఓటర్ల వివరాలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసినట్లు, మ్యాపింగ్ లేని, అనామలీస్ ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైందని, ఇందులో 1,75,858 మంది మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీచేయనుండగా, ఇప్పటివరకు 1,75,841 నోటీసులు జనరేట్ చేసి, 1,32,817 మందికి నోటీసులు అందజేశామన్నారు. నోటీసుల ప్రకారం 14,680 మంది ఓటర్ల హియరింగ్ ప్రక్రియ పూర్తిచేశామన్నారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ ఆధారంగా భారత ఎన్నికల సంఘం సూచించిన పత్రాల్లో సంబంధిత పత్రాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. పేర్ల అసంబద్ధత వున్న వారు ధృవీకరణలు సమర్పించకున్న, సంబంధిత బూత్ లెవల్ అధికారులు పంచనామా చేసి ధృవీకరిస్తారన్నారు.

ప్రస్తుతం కూడా అర్హులైన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. 2026 అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఏ శాసనసభ నియోజక వర్గంలోనూ ఓటరుగా నమోదు కాకపోతే ఫారమ్-6 ద్వారా తాజా ఫోటో, వయస్సు ధృవీకరణ పత్రం, డిక్లరేషన్ తదితరాలను జతచేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా...!

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19, 2026న ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్టిసి సదానందం, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, బీ.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధి ఎం.రమేష్, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్, సిపిఐ(ఎం) ప్రతినిధి డి.తిరుపతి రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ.గోపాల రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- శాంతి భద్రతల పరిరక్షణలో కలినంగా వ్యవహరించాలి.
- జిల్లా ఎస్పీ మహేష్ బి గితే.

వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం రోజున ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారు ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్ను పరిశీలించి అభినందించారు. అనంతరం స్టేషన్ సర్కిల్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు,పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించరు.ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ఆరా తీసి సర్కిల్ పరిధిలోని అధికారుల, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు.శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి పారదర్శకమైన సేవలు అందించాలని సూచించారు.సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రత, మోసగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులపై ప్రజలను చైతన్యపరిచి, అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.డయల్--112 కు వచ్చే ప్రతి కాల్‌పై వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు పాత నేరస్తులపై, రౌడి షీటర్స్ పై నిరంతర నిఘా కొనసాగించాలని, వారిని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ నేరాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం కలిగే విధంగా విధులు నిర్వహించాలని, విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సూచించారు.రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహనాల వినియోగం పై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని తెలిపారు. అనంతరం స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులతో కలసి మొక్కలు నాటారు.ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్,ఎస్.ఐలు రమేష్,శ్రీకాంత్,లక్ష్మణ్ ,సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల హామీలను అమలు చేయాల్సిందే రేవంత్ రెడ్డి

- పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా పరిగి,సెప్టెంబర్ 05:విద్యార్థి గర్జనలో, విద్యార్థుల కోసం పాదయాత్రగా నడుచుకుంటూ నిరసనలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి,"ఎక్కడ. ఫీజు రియంబర్స్మెంట్. నిరుద్యోగ భృతి. విద్యార్థులకు స్కూటీలు.మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండర్.రెండు లక్షల ఉద్యోగాలు"అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెట్ కేటీఆర్ పిలుపు మేరకు,పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో,పరిగి పట్టణంలో కొడంగల్ చౌరస్తా నుంచి, అంబేద్కర్ విగ్రహం వరకు,విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు.కాంగ్రెస్ పాలనలో గురుకులాల పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతుంది అని తెలిపారు.ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ నిరసిస్తూ విద్యార్థులతో కలిసి పాదయాత్రగా నడుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసన తెలిపిన మహేష్ రెడ్డి,విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయక,పేద విద్యార్థులు చదువు ఆపేస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేయాలనీ, లేని పక్షంలో విద్యార్థులతో పెద్ద ఎత్తున ధర్నాలో రాస్తారోకో నిర్వహిస్తాం అని ఎచ్చరించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి.

ప్రజాబలం లేని పాలకులకు డబ్బు బలమే దిక్కు!

- మహిళా సంఘాల సభ్యులను రూ.200 చొప్పున ఇచ్చి సభకు తరలించడం సిగ్గుచేటు
- అభివృద్ధి కార్యక్రమాలను రాజకీయ సభలుగా మార్చుకోవడం దురదృష్టకరం

ప్రజావాణి సెప్టెంబర్ 5 ప్రజబలం లేని పాలకులు డబ్బు బలంతో సభలు నిర్వహిస్తున్నారని బీఎస్పీ కొల్లాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు బొల్లి కురుమయ్య తీవ్రంగా విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో రూ.15.87 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు హెచ్ ఏ ఎం రహదారి పనులకు మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి శంకుస్థాపన చేసిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు మహిళా సంఘాల సభ్యులను రూ.200 చొప్పున ఇచ్చి తరలించారని ఆయనఆరోపించారు.అభివృద్ధి పనుల పేరుతో ప్రభుత్వ కార్యక్రమలు నిర్వహిస్తూ వాటిని రాజకీయ సభలుగా మార్చడం సరికాదన్నారు. మహిళా సంఘాల సభ్యులను జనసమీకరణకు ఉపయోగించుకోవడంవారిఆత్మగౌరవాన్నికించవరచడమేనని మండిపడ్డారు. ప్రజబలం ఉంటే డబ్బులుఇవ్వకుండా సభ నిర్వహించి, ప్రజలు స్వచ్ఛందంగా ఎంతమంది వస్తారో చూపించాలని మంత్రులకు సవాల్ విసిరారు.
హామీలు అమలు చేయకుండా శంకుస్థాపనలా?
ప్రజల సమస్యలను పరిష్కరించకుండా, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అభివృద్ధి పనుల శంకుస్థాపనలను రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చుకోవడాన్ని కురుమయ్య తప్పుబట్టారు. ఇది '1000 రోజుల ప్రజాపాలన' కాదని విమర్శించారు. ప్రజల కోసం కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదని స్పష్టంచేశారు .రూ.200 నోటుతో ఆత్మగౌరవాన్ని కొనలేరుమహిళలను స్వయం సమృద్ధి వైపునడిపించాల్సిన ప్రభుత్వమే వారిని రాజకీయ సభలకు జనాలుగా ఉపయోగించుకోవడందురదృష్టకరమన్నారు. రూ.200 నోటుతో ప్రజల ఆత్మగౌరవాన్ని కొనలేరని, ప్రజా సమస్యలను కప్పిపుచ్చలేరని బొల్లి కురుమయ్య ఘాటుగావ్యాఖ్యానించారు .ఇలాంటి చర్యలను బీఎస్పీ తీవ్రంగాఖండిస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి మునిస్వామి, ప్రధాన కార్యదర్శి అంజి, లక్ష్మణ్, నాగశేషి, మధుబాబు, బాలు తదితరులు పాల్గొన్నారు.

సాయి గ్రామర్ స్కూల్ ఘనంగా గురుపూజోత్సవ దినం

చిలుకూరు సెప్టెంబర్5(ప్రజావాణి): చిలుకూరు మండల కేంద్రంలోని సాయి గ్రామర్ స్కూల్ నందు డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు.వారు మాట్లాడుతూ భారత రెండవ రాష్ట్రపతి విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనందకరమైన విషయమని ఆయన నిర్వహించిన ఉపాధ్యాయ వృత్తి భావి భారత పౌరులకు ఆదర్శమని ఆయన చూపిన మార్గంలో విద్యార్థులు పయనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునిలు దీప్తి లావణ్య,ఉమ, అరుణ, ఇందిర, ఇందుమతి, కృష్ణవేణి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మూడో లైన్ మురిపెం.. ప్రయాణికులకు నరకప్రాయం!

- కేసముద్రం రైల్వే అధికారుల గుడ్డి నిర్లక్ష్యం.
- చీకటి కోణంలో ప్రయాణం.. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని..!

కేసముద్రం సెప్టెంబర్ 5, ప్రజావాణి.కాజీపేట – విజయవాడ మూడో లైన్ పనుల్లో భాగంగా కేసముద్రం మీదుగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే, ఈ మూడో లైన్‌పై రైలు దిగిన ప్రయాణికులకు అసలు నరకం కనిపిస్తోంది. ప్లాట్‌ఫారమ్‌పై కనీస వెలుతురు లేకపోవడంతో, రైలు దిగిన వెంటనే ఎటు వెళ్లాలో తెలియక ప్రయాణికులు తలబాదుకుంటున్నారు. ఒకవైపు వేగంగా వెళ్లే రైళ్లు, మరోవైపు చీకటి.. ఈ రెండింటి మధ్య ప్రయాణికులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? అని ప్రయాణికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

వంతెన ఉంది.. కానీ లైట్లు లేవు, అధికారుల నిద్రమత్తుకు పరాకాష్ట!

రైల్వే స్టేషన్‌లో ఒక ప్లాట్‌ఫారమ్ నుండి మరో ప్లాట్‌ఫారమ్‌కు వెళ్లేందుకు నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ (వంతెన) పై కనీసం ఒక్క లైటు కూడా వెలగకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. రాత్రి వేళల్లో మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు ఈ చీకటి వంతెనపై నడవడానికి వణికిపోతున్నారు. రైల్వే శాఖ నిధులు విడుదల చేస్తున్నా, ఇక్కడ లైట్లు వేయడానికి కూడా అధికారులకు తీరిక లేదా? ప్రయాణికుల రక్షణ కంటే అధికారులకు ఇతర పనులే ముఖ్యమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

219 కిలోమీటర్ల ట్రాక్.. కానీ క్షేత్రస్థాయిలో శూన్యం!

మొత్తం 219 కిలోమీటర్ల పొడవున్న ఈ కాజీపేట – విజయవాడ మూడో లైన్ ప్రాజెక్టులో తెలంగాణ పరిధిలోనే 184 కిలోమీటర్ల మేర ట్రాక్ విస్తరించి ఉంది. మహబూబాబాద్ – కాజీపేట మధ్య 70 కిలోమీటర్ల సెక్షన్‌తో సహా దాదాపు 195 కిలోమీటర్ల పనులు పూర్తయి రైళ్లు నడుస్తున్నప్పటికీ, కేసముద్రం స్టేషన్‌లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం అత్యంత విచారకరం. పనులు చివరి దశకు వచ్చాయని సంబరపడాలా, లేక కనీస వెలుతురు లేక చావాలా? అని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా కళ్లు తెరవండి.. పనులు పూర్తి చేయండి!

ఇంతవరకు ఈ సమస్యపై స్థానిక రైల్వే అధికారులు 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరించడం శోచనీయం. పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించే వరకు అధికారులు వేచి చూస్తున్నారా? ఇప్పటికైనా ఉన్నతాధికారులు మరియు రైల్వే జీఎం వెంటనే స్పందించి, కేసముద్రం స్టేషన్‌లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. వంతెనపై మరియు మూడో లైన్ పరిసరాల్లో తక్షణమే హై-మాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి ప్రయాణికుల భద్రతను కాపాడాలని ఈ వార్తా కథనం ద్వారా డిమాండ్ చేస్తున్నాం.

ఉత్తమ ఉపాధ్యాయినిగా డా.పి. సజ్జనకుమారి ఎంపిక

చిలుకూరు, సెప్టెంబర్ 05 (ప్రజావాణి):మండల కేంద్రంలోని పి ఎం శ్రీ జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న డా.పి. సజ్జన కుమారి ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారానికి ఎంపిక కావడం జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఆమె ఈ అవార్డు అందుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని సహా ఉపాధ్యాయులు అన్నారు. గత 30 సంవత్సరాలుగా సజ్జన కుమారి ఉపాధ్యాయ విధులు నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా విద్యా బుద్ధులు, క్రమశిక్షణ, నైతిక విలువలు, సంస్కారం, తెలుగు భాష పై అభిమానం పెంపొందించేలా ఆమె చేసిన సేవలు అభినందనీయమని, సహా ఉపాధ్యాయులు పాఠశాల హెడ్ మాస్టర్ రాజారాం, కైలాసం ఏడుకొండలు,ఆదినారాయణ, రవికుమార్, సాంసంగ్, రేణుక, హమీదాభి, జానిమియా తదితరులు హర్షం వ్యక్తం చేసినారు.

సంగారెడ్డి ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు

మన ప్రజావాణి సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ :5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కమ్ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి శ్రీమతి టి. కలిందింది దుర్గారాణి గారు హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగ విలువలు మరియు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధం, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం (POCSO Act), బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మహిళలు మరియు బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలపై వివరించారు.ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, వ్యక్తిగత సమాచార భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోకూడదని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని, సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.అదేవిధంగా విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని తెలిపారు. చట్టం ప్రతి ఒక్కరికీ సమాన రక్షణ కల్పిస్తుందని, అవసరమైన వారికి ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.జాతీయ న్యాయ సేవల సంస్థ (NALSA), తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల సంస్థ (TSLSA), జిల్లా న్యాయ సేవల సంస్థ (DLSA) ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, సలహాలు మరియు ఇతర న్యాయ సేవలను ప్రజలు,ముఖ్యంగా అర్హులైన విద్యార్థులు మరియు వారి కుటుంబ సభ్యులు వినియోగించు కోవాలని సూచించారు.విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని, చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యతను కూడా పెంపొందిం చుకోవాలని న్యాయమూర్తి సూచించారు. ప్రతి విద్యార్థి చట్టాలను తెలుసుకొని, ఇతరుల హక్కులను గౌరవిస్తూ మంచి పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుల సేవలను అభినందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాయ అవగాహన కల్పించడంలో పాఠశాలలు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. న్యాయ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చట్టపరమైన అంశాలపై విలువైన సమాచారం అందిందని పాఠశాల సిబ్బంది తెలిపారు

దొండపాడు ప్రధానోపాధ్యాయులు ఉద్దోజు శ్రీనివాసాచారికి 'జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డు

- సూర్యాపేట కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం

చింతలపాలెం సెప్టెంబర్ 5 (ప్రజా వాణి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో భాగంగా చింతలపాలెం మండలం, ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ (దొండపాడు) పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉద్దోజు శ్రీనివాసాచారి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. విద్యా రంగంలో ఆయన కనబరుస్తున్న ప్రతిభ, పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు.?పాఠశాల రూపురేఖలు మార్చిన నిశ్రీనివాసాచారి ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి పాఠశాలలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తూ విద్యార్థుల సంఖ్యను 45కు పెంచారు. నాణ్యమైన విద్యతో పాటు గ్రామస్తులు, తల్లిదండ్రులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములను చేస్తూ దాతల సహకారంతో మౌలిక వసతులు సమకూర్చారు.ఈ విద్యా సంవత్సరం నుండి పాఠశాలలో ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించి, ఆంగ్ల మాధ్యమ బోధనను సమర్థవంతంగా అందిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం సాయంత్రం వేళల్లో ప్రత్యేక ట్యూషన్లు నిర్వహించడం, విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికితీయడం, మధ్యాహ్న సమయంలో ప్రభుత్వ కథల పుస్తకాలను చదివిస్తూ తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయడం వంటి కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎండిఆర్ హైస్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.

హుజూర్‌నగర్ సెప్టెంబర్ 5 (ప్రజావాణి) సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ స్థానిక ఎండిఆర్ హైస్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని (టీచర్స్ డే) పురస్కరించుకుని వేడుకలను అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణం లో నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల చైర్మన్ మేరెడ్డి దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని, సమాజ నిర్మాణంలో గురువులే కీలక మార్గదర్శకులని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీసి వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నర్సిరెడ్డి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలుపుతూ మాట్లాడారు.ఈ సందర్భంగా విద్యార్థులు గురువులపై తమకున్న గౌరవాభిమానాలను చాటుతూ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాల్య వివాహాలు బాలల భవితకి సంకెళ్ళు ఆశ్రిత ...

రాయపోల్, సెప్టెంబర్ 05 (ప్రజావాణి)జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయపోల్ మండల కేజీబీవీ లో జిల్లా కలెక్టర్ మరియు డీసీపీవో గారి ఆదేశాల మేరకు బాల్య వివాహాల నిర్మూలన చట్టం 2006 గురించి అశ్రిత స్వచంద సంస్థ అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎస్ ఐ మానస మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం, చేసిన వారు, చూసిన వారు, సహకరించిన వారు శిక్షార్హులు అవుతారు 18 సంవత్సరాలు లోపు అమ్మాయి 21 సంవత్సరాలు లోపు అబ్బాయి కి పెళ్లిళ్లు చేస్తే వారు మానసికంగా శారీరకంగా ఎన్నో ఇబ్బందులు ఎదురుకుంటారు కాబట్టి బాల్య వివాహాలు చేయకూడదు అని పేర్కొన్నారు..ముఖ్యంగా నేటి రోజుల్లో బాల బాలికలు సోషల్ మీడియా ద్వారా తెలియని వ్యక్తులతో పరిచయం అవుతూ ప్రేమలు పెళ్లిళ్లు అని జీవితం లో స్థిరపడకుండానే పెళ్లిళ్లు చేసుకొని అనేక ఇబ్బందులు కొని తెచ్చుకుంటున్నారు ఆలా కాకుండా విద్యార్థులు సరైన లక్ష్యాన్ని ఎంచుకొని జీవితంలో ఉన్నతంగా స్థిరపడే విధంగా పట్టుదలతో చదువుకోవాలన్నారు ..అశ్రిత సిద్దిపేట జిల్లా కోర్డినేటర్ బండకాడి గణేష్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్ లైన్ నెంబర్ 1098 కి సమాచారం ఇవ్వాలి అన్నారు. వారికీ కౌన్సిలింగ్ ఇచ్చి బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను అర్థమయ్యేలా వివరించి సహాయం అందిస్తామన్నారు . అనంతరం ఎస్ ఐ మానస చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ అనే వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎస్ .ఓ.మరియు ఉపాధ్యాయ బృందానికి సన్మానం చేశారు..ఈ కార్యక్రమం లో ఎస్. ఓ.సునందలత, ఉపాధ్యాయ బృందం మరియు కమ్యూనిటీ సోషల్ వర్కర్ మౌనిక, వీణ లు పాల్గొన్నారు..

ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం

తంగళ్లపల్లి ప్రజావాణి సెప్టెంబర్ 05 శ్రీ సరస్వతీ శుభోదయం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. రాధాకృష్ణన్ గొప్ప ఉపాధ్యాయుడు, పండితుడు, తత్వవేత్తగా దేశానికి విశిష్ట సేవలందించారని అన్నారు.ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని నింపడంతో పాటు, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తూ సమాజానికి అవసరమైన ఇంజనీర్లు, వైద్యులు, న్యాయవాదులు తదితరులను తీర్చిదిద్దుతున్నారని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు నిరంతరం మార్గదర్శకులుగా నిలుస్తారని అన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారు ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బెజ్జంకి లో ఘనంగా విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ఘన సన్మానంచిన
- బెజ్జంకి మండల విద్యాధికారి మహతి లక్ష్మి

బెజ్జంకి, సెప్టెంబర్ 5 (ప్రజావాణి) సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెజ్జంకి మండల విద్యాధికారి మహతి లక్ష్మి మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని, వారు జాతి నిర్మాతలు, ప్రగతి రథచక్రాలని అన్నారు.బెజ్జంకి మండలంలోని ఉపాధ్యాయులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆమె అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడంతో పాటు, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను వెలికితీస్తూ విద్యాభివృద్ధికి పాటుపడుతున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి గుణాత్మక విద్యను అందించాలని సూచించారు. బెజ్జంకి మండలాన్ని విద్యారంగంలో సిద్దిపేట జిల్లాలో ప్రథమ స్థానంలో నిలపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతలను అభినందిస్తూ వారి సేవలను కొనియాడారు.

ఎస్ఐఆర్ అనామలిస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ చేయాలి -- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత

- ఈనెల 5, 6,12,13, తేదీల్లో స్పెషల్ కంపేయిన్ నిర్వహణ.

మన ప్రజావాణి సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ :5 ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు (అనామలిస్), నో మ్యాపింగ్ ఓటర్లకు ఆలస్యం చేయకుండా నోటీసులు జారీ చేయాలని, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) స్పెషల్ కంపేయిన్ లలో బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లాలో ఎస్ఐఆర్ అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ,ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) స్పెషల్ కంపేయిన్ వంటి తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు, ఎస్ఐఆర్, అనామలిస్ ,నో మ్యాపింగ్ ఓటర్లకు బూత్ లెవల్ అధికారులు వేగంగా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. నోటీసులు జారీ చేయడంలో ఆలస్యం చేయవద్దని, నోటీసు అందుకున్న ఓటరు విచారణకు తప్పనిసరిగా హాజరై సంబంధిత వివరాలు సమర్పించాలని తెలిపారు. ఓటరు కుటుంబ సభ్యుల్లో ఎవరైనా అవసరమైన పత్రాలతో విచారణకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. బీఎల్ఓలు ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాలను ఓటర్లకు పూర్తిగా తెలియజేయాలని సూచించారు. ఓటర్లు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాని వివరాలను సమర్పించాలని తెలిపారు. నోటీసులు జారీ చేసేటప్పుడు అందులో స్థలం, తేదీ, సమయం స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి పౌరుడు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు మొదటి దశ ఈ నెల 5 ,6వ తేదీ ఆదివారం , రెండవదశ 12వ తేదీ శనివారం, 13వ తేదీ ఆదివారం స్పెషల్ కంపేయిన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన సవరణలు ఉంటే నిర్ణీత ఫారాల ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ,బి ఎల్ ఓ లు సహకార్తిస్తారని అన్నారు . జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) స్పెషల్ కంపేయిన్ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 5,6, 12, 13 తేదీ లలో స్పెషల్ కంపేయిన్ కొనసాగనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఓటర్లు తమకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) స్పెషల్ కంపేయిన్లు జరిగే రోజుల్లో సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్దేశిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)

కూడా హాజరవుతారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సూచించారు.దరఖాస్తుదారులు, ఓటర్లు తమకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలకు హాజరై ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. ముఖ్యంగా తమ పేరు జాబితాలో ఉందో లేదో, నమోదైన వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లు, చిరునామా, ఇతర వివరాల్లో తప్పులు, మార్పులు లేదా లోపాలు ఉంటే వాటిని గుర్తించి సవరణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సంబంధిత ఈఆర్ఓ లు , ఏఈఆర్ఓలు కార్యాలయాల్లో కూడా క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సమర్పించవచ్చని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి పౌరుడు స్పెషల్ కంపేయిన్ కార్యక్రమం సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని, అవసరమైన సవరణలు ఉంటే నిర్ణీత ఫారాల ద్వారా సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు అందించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.ఈ సమావేశంలో సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, ఈఆర్ఓలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు

ఖమ్మం జిల్లాలో ప్రజావాణి ప్రకంపనలు...!

- కదులుతున్న ఓ డోలమైట్ క్వారీ సమీపంలోని భూముల డొంక...
- జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయనున్న రైతులు...?
- ఉలిక్కిపడుతున్న అక్రమార్కులు...?
- అక్రమాల గుర్తింపుకు రీ సర్వేకి రంగం సిద్ధం...?
- సంచలనం కలిగించిన కథనాలు... రీ సర్వే తో తేలనున్న లెక్కలు...!
- అక్రమార్కుల చెర నుండి 10 కోట్ల విలువైన భూములు స్వాధీనం దిశగా అడుగులు...?
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు స్థానికులు...

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి శివుడు ఆజ్ఞ లేనిదే.. చీమైనా కుట్టదు అంటారు.. కానీ గత ప్రభుత్వ హయాంలో కొందరు అక్రమార్కులు చెలరేగి మట్టి వ్యాపారంతో పాటు భూములను ఆక్రమించినట్లు ఉన్న భూములు కంటే అధికంగా భూములు స్వాధీనంలో ఉంచుకొని పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలిసింది. కాగా 1984 నుండి ఉన్న డోలమైట్ క్వారీ ప్రాంతంలో ని రఘునాథపాలెం మండలం వైయస్సార్ కాలనీ సమీపంలోని అసైన్మెంట్ భూమిపై కొందరు బడా బాబుల కన్ను పడటంతో తొలుత ఆక్రమించి ఆ తర్వాత మట్టి వ్యాపారం నిర్వహించి జోరుగా లక్షలాది రూపాయలు దండుకున్నట్లు ఆరోపణలు విమర్శల నేపథ్యంలో కొందరు మన ప్రజావాణి తెలుగు దినపత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరోకు సమాచారం అందించిన నేపథ్యంలో ఇటీవల ప్రచురితమైన వార్తా కథనాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన వ్యక్తం అయిందని సమాచారం. వార్తా కథనాలకు స్పందించిన స్థానిక రైతులు కొందరు ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసింది. దీంతో రెవెన్యూ దివిజనల్ జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఓ సర్వేయర్ పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణం జరుగుతున్న ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల అభిప్రాయాలు సేకరించినట్లు తెలిసింది. కాగా వార్త కథనాలకు స్పందించిన స్థానికులు రైతులు ఐక్యంగా పలు విధాలుగా అక్రమార్కుల చెరలో ఉన్నటువంటి అసైన్మెంట్ భూమి గుట్టును తేల్చేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు వచ్చే సోమవారం ప్రజావాణి గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్





దివాకర టీ ఎస్ కి ఫిర్యాదు చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. కాగా గత 12 సంవత్సరాలుగా విలువైన అసైన్మెంట్ భూములు అక్రమార్కుల చెరలో చిక్కి విలవిల్లాడుతున్న సంబంధిత రెవెన్యూ అధికారులు పెద్దగా పట్టించుకోలేదని సమాచారం. కాగా 10 ఏళ్ల నుండి జరుగుతున్న భూ ఆక్రమణలు జిల్లా దివిజనల్ మండల స్థాయిలో తెలిసినప్పటికీ ఓ నేతకు జిల్లాస్థాయిలో నాటి ప్రభుత్వంలో ఆడిందే ఆటగా పాడిందే పాటగా కొనసాగిందని అలా పరపతి పలుకుబడి తో జిల్లా స్థాయి లో కీలక పదవిని సైతం పొందినట్లు బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరపతి పలుకుబడి అర్థబలం అంగ బలం రాజకీయ బలంతో సుమారు ఐదు ఎకరాలు విస్తీర్ణం కలిగిన అసైన్మెంట్ భూమిని తన గుప్పెట్లో బందీగా చేసినట్లు తెలిసింది. దీంతో ఆ ప్రాంతంలోని మరికొందరు అక్రమార్కులు రంగ ప్రవేశం చేసి యధావిధిగా అక్రమాలు ఆక్రమణలు మట్టి వ్యాపారం లాంటి లావాదేవీలు జోరుగా నిర్వహించినట్లు ప్రచారం జరుగుతోంది. వైయస్సార్ కాలనీ సమీపంలోని వ్యవసాయ భూముల ప్రాంతం నుండి రఘునాధపాలెం మండలం వి వెంకటాయపాలెం వరకు ఉన్న ప్రభుత్వ డొంక ను నక్షా కి భిన్నంగా వ్యవహరించి నామరూపాలు లేకుండా చేసే ప్రయత్నం జరిగిందని తెలిసింది. కాగా ఇంతకాలం నిశ్శబ్దంగా ఉన్న అక్రమాల గుట్టు ఇటీవల క్వారీ సమీపంలో పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు వేగవంతంగా జరుగుతున్న సందర్భంగా ఉన్న డొంకను వక్రీకరించి దారి తప్పించే ప్రయత్నం జరిగినట్లు దీంతో స్థానిక రైతులు అభ్యంతరం తెలిపినట్లు నక్షా ప్రకారం వ్యవహరిస్తే సహకరిస్తామంటూ బాధిత రైతులు సంబంధిత అధికారులకు తెలిపి రోడ్డు ఏర్పాటుకు వ్యతిరేకం కాదంటూ నిబంధనల ప్రకారం వ్యవహరించాలని కోరారని విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసింది. ఈ మేరకు ఇటీవల రెవెన్యూ అధికారులను సంప్రదించిన స్థానిక రైతులకు నక్ష పొలాల మధ్య నుండి వెళ్తుంది అంటూ పొంతన లేని సమాధానాలు ఎదురుకావడంతో రైతులు స్థానికులు నిరసన తెలిపినట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో రీ సర్వే ముమ్మాటికి జరగాలని రైతులు కోరుతున్నారు.దీంతో రైతులు స్థానికులు ఆ రెవెన్యూ పరిధిలోని కొందరు త్వరలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు అందించి రీ సర్వే చేసి నక్ష వ్యవహరించాలని అసైన్మెంట్ భూములు ఆ ప్రాంతంలోని వ్యవసాయ భూములను రి సర్వే చేసి సరిహద్దులు నిర్వహించి న్యాయం చేయాలని పలువురు రైతులు స్థానికులు రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఆరెంద జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: హెచ్ఎం నరసింహారావు
- ఉపాధ్యాయుల బోధనను సద్వినియోగం చేసుకోవాలి: సీఆర్‌పీ మల్లయ్య

మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 5 ప్రజావాణి : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంథని మండలం ఆరెంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు అందించే విద్య, విలువలు, క్రమశిక్షణ విద్యార్థుల జీవితంపై ఎంతో ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల్లో విద్యతో పాటు మంచి నడవడిక, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదివి పాఠశాలకు మంచి

ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. విద్యార్థులు కూడా తమ లక్ష్యాలను చిన్న వయసులోనే నిర్దేశించుకుని, వాటిని సాధించే దిశగా నిరంతరం శ్రమించాలని సూచించారు. ప్రతిభ ఒక్క రోజులో రాదని, ప్రతిరోజూ క్రమశిక్షణతో చదవడం, ఉపాధ్యాయుల సూచనలు పాటించడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు జ్ఞానంతో పాటు వినయాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. సి ఆర్ పి మల్లయ్య మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. తరగతి గదిలో చెప్పే విషయాలను ఇంటి వద్ద పునశ్చరణ చేసుకుంటూ సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో ముఖ్యమని, వారి సూచనలను పాటిస్తూ కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేసిన శ్రీలత విద్యార్థుల విద్యాభ్యాసంపై చూపిన ప్రత్యేక శ్రద్ధను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఆమెకు లభించే 27 రోజుల సెలవుల్లో 16 రోజులు కూడా పాఠశాలకు హాజరై విద్యార్థులకు బోధన అందించినందుకు గుర్తింపుగా ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు ఆమెను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల గౌరవాన్ని చాటుకుంటూ వారిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు ప్రేమతో తీసుకొచ్చిన చిరు కానుకలను అందజేసి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధి, భవిష్యత్తు లక్ష్యాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సువార్త, మమత, పద్మజ, ఎం.డి. గియాసుద్దీన్, శ్రీవాణి, శ్రీలత, సహేందర్, అమన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జెడ్ పి హెచ్ ఎస్ బెక్కెం పాఠశాలలో

● ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

చిన్నంబావి ప్రజావాణి సెప్టెంబర్ 5 చిన్నంబావి మండలం, బెక్కెం గ్రామంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా, ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జెడ్ పి హెచ్ ఎస్ బెక్కెం హైస్కూల్ నందుఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ దేవని రమేష్ మాదిగ.ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి డీఎన్ సహదేవ్ మాదిగ హాజరయ్యారు.ఈ సందర్భంగా దేవని రమేష్ మాదిగ మాట్లాడుతూ – "గురువు లేని విద్య గుడ్డి విద్య. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువు పాత్ర

ఎంతో కీలకమైనది" అని గురువు ప్రాముఖ్యతను వివరించారు. ఎమ్మెస్ పి బెక్కెం గ్రామ అధ్యక్షులు బండారి ఓమేష్ చంద్ర మాదిగ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ చిన్నంబావి మండల అధికార ప్రతినిధి డీఎన్ సహదేవ్ మాదిగ మాట్లాడుతూ అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, విద్యారంగంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు.అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులందరినీ శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత ఉపాధ్యాయులు కూడా తమ అనుభవాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలోఏడవ వార్డు మెంబర్ డీఎన్ రాణి కృష్ణయ్య ,ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు ద్యావని మహేష్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ గ్రామ అధ్యక్షుడు సంద్యాపాగ పవన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి జిక్కి విష్ణు మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ ఉపాధ్యక్షుడు నీరడి చింటూ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో షెడ్డు మాటున నిర్మాణం!

● ఎవరికి చెప్పకుండా పనులు.. అడ్డుకున్న గ్రామస్తులు అక్రమ నిర్మాణాలు
● నిలిపివేయాలని గ్రామ కార్యదర్శికి వినతి

చెన్నారావుపేట సెప్టెంబర్ 05 ప్రజావాణిచెన్నారావుపేట గ్రామ ప్రజలందరి సహకారంతో నిర్మించుకున్న శివాలయంలో నిర్మాణ వివాదం తెరపైకి వచ్చింది.ఆలయ ప్రాంగణంలోని రేకుల షెడ్డులో కొంతకాలంగా ఉంటున్న కొందరు వయోవృద్ధులు.. వయోవృద్ధుల సంక్షేమం పేరుతో ఎవరికి సమాచారం ఇవ్వకుండా కొత్త నిర్మాణ పనులు చేపడుతున్నారంటూ గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్మాణ పనులు

జరుగుతున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకొని పనులను అడ్డుకున్నారు. గ్రామ ప్రజల సహకారంతో నిర్మించుకున్న శివాలయ స్థలంలో అనుమతులు లేకుండా ఇలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని స్పష్టం చేశారు. ఆలయ స్థలాన్ని యధాతధంగా పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులంతా కలిసి గ్రామ కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణాలపై విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వెంటనే నిలిపివేయాలని కోరారు. ఆలయ స్థల విషయంలో భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హంస విజయరామరాజు, మాజీ ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు రాసమల్ల రజిత సతీష్, గట్ల రాంబాబు, చిట్టే రవికుమార్, దొంతి బాబు, తోట రాము, జూలి రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలకు 1973-74 ఎస్ఎస్సి బ్యాచ్ ఘన సత్కారం

● కిడ్స్ సొసైటీ ఆధ్వర్యంలో కోటగిరిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం.

కోటగిరి/ప్రజావాణి:-నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.కోటగిరి ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ (కిడ్స్) ఆధ్వర్యంలో 1973-74 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో వి.నాగేశ్వరరావు నేతృత్వంలో పాఠశాల ఉపాధ్యాయులందరినీ శాలువాలు,పూల మాలలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు.ఇదే వేదికపై మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ బర్ల మధుకర్, మండల ఎంఈఓ శ్రీనివాసరావులను కూడా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.విద్యారంగ అభివృద్ధికి,విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని అన్నారు.

తాము చదువుకున్న పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 1973-74 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సత్కరించడం అభినందనీయమని కొనియాడారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో యువతకు,భావితరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిడ్స్ అధ్యక్షులు పోల విఠల్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్,కిడ్స్ సభ్యులు

గంగాధర్‌గౌడ్,రాజేశ్వర రావు,కాసుల సాయిలు,బర్ల సత్యనారాయణ,టెలిఫోన్ గంగారం,గర్దాస్ గంగాధర్,తోట శ్రీకాంత్,కాశీనాథ్,అప్ప,నారాయణ,1973- 74 బ్యాచ్ పూర్వ విద్యార్థి లు వి.నాగేశ్వరరావు,లక్ష్మి నరసింహులు,కె.హనుమంత రావు,ఎం.కాశీనాథ్,ఎం.బసవలింగప్ప,వెంకటనారాయణ, పి.మనోరమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాడు రోడ్డు వేశా.. నేడు విస్తరణకు నిధులు తెచ్చా!

● బైపాస్ అభివృద్ధికి రూ.18 కోట్లు మంజూరు చేయించా: జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబర్ 5 (ప్రజావాణి): సంగారెడ్డి అభివృద్ధి కోసం తాను ఎప్పటి నుంచో కృషి చేస్తున్నానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. 30 ఏళ్ల క్రితం సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో రూ.80 లక్షలతో బైపాస్ బీటీ రోడ్డు నిర్మించానని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.18 కోట్ల నిధులు తీసుకొచ్చి అదే రహదారిని విస్తరిస్తున్నామని తెలిపారు.1995లో ప్రజలు తనను నేరుగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నుకున్నారని గుర్తుచేశారు. అప్పట్లో మున్సిపాలిటీ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేదని, ఆరు, ఏడు నెలలకు ఒకసారి జీతాలు వచ్చే పరిస్థితి ఉండేదన్నారు. కేంద్ర పథకాల ద్వారా వచ్చిన నిధులతోనే అభివృద్ధి పనులు చేపట్టేవారని తెలిపారు.ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి బసవేశ్వర విగ్రహం వరకు ఉన్న బైపాస్ ప్రాంతం అప్పట్లో ఖాళీగా ఉండేదని, 80 అడుగుల రహదారి వర్షాకాలంలో ప్రమాదకరంగా మారేదన్నారు. వాహనదారులు, స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులతో మాట్లాడి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.అప్పట్లో వచ్చిన రూ.కోటి గ్రాంటులో రూ.20 లక్షలను కౌన్సిలర్ల అభివృద్ధి పనులకు కేటాయించి, మిగిలిన రూ.80

లక్షలను బైపాస్ రోడ్డు కోసం వినియోగించేలా అందరినీ ఒప్పించానన్నారు. ఆ రహదారి నిర్మాణంతోనే బైపాస్ పరిసరాల్లో కొత్త కాలనీలు అభివృద్ధి చెందాయని, దాదాపు 30 ఏళ్లుగా ప్రజలకు ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.ప్రస్తుతం బైపాస్ రోడ్డు విస్తరణకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిధులు మంజూరు చేయాలని కోరగా వెంటనే అంగీకరించారని జగ్గారెడ్డి తెలిపారు. రూ.18 కోట్లతో విస్తరణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. చెట్లకు ఇబ్బంది కలగకుండా, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా, వ్యాపారులకు నష్టం కలగకుండా పనులు చేపట్టాల్సి ఉండటంతో కొంత ఆలస్యం కావచ్చన్నారు.పనులు ఆలస్యం అవుతున్నాయంటూ కొందరు గుంతల వద్ద ఫొటోలు తీసి నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రహదారి నిర్మాణం ఎంత కష్టమైన పనో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. రోడ్డు నాణ్యతపై వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్‌తో కూడా మాట్లాడినట్లు తెలిపారు.సదాశివపేట పట్టణంలోని కందకం రోడ్డును కూడా తానే నిర్మించానని జగ్గారెడ్డి తెలిపారు. తాను సదాశివపేటకు చెందిన వ్యక్తి కాకపోయినా ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సిద్ధాపూర్‌లో సుమారు 5 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించానన్నారు. వారికి ప్లాట్ల పొజిషన్ కూడా ఇప్పించినట్లు పేర్కొన్నారు.అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ 5 వేల మందిని అక్కడి నుంచి వెళ్లగొట్టిందని ఆరోపించారు. సిద్ధాపూర్‌లోని సుమారు 100 ఎకరాలను అప్పటి ప్రభుత్వం వివిధ శాఖలకు కేటాయించిందని అన్నారు.“నేను సంగారెడ్డి ఊరోన్ని.. సంగారెడ్డిని ఎలా అభివృద్ధి చేసుకోవాలో నాకు తెలుసు. ఎమ్మెల్యేగా గెలవకపోయినా సంగారెడ్డి అభివృద్ధి కోసం నిధులు తీసుకొచ్చాను” అని జగ్గారెడ్డి అన్నారు.సంగారెడ్డి అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ నెగెటివ్ ఆలోచనలు పక్కన పెట్టాలని సూచించారు. రాష్ట్ర ఖజానాపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ రూ.18 కోట్ల నిధులు తీసుకొచ్చి బైపాస్ రోడ్డు అభివృద్ధి చేస్తున్నామని, ఇది ఎన్నికల కోసం చేస్తున్న పని కాదని స్పష్టం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ప్రజావాణి శాయంపేట శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో 35 మందికి రూ.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో పలు కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. రేషన్ కార్డుల జారీ, రూ.2 లక్షల రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి చర్యలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ప్రజలకు మేలు జరుగుతుంటే ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ పాలనలో ప్రజా సంక్షేమం కంటే కమీషన్లకే ప్రాధాన్యం ఇచ్చారని గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. ప్రస్తుతం నిరసనల పేరుతో ఆ పార్టీ నాయకులు మరోసారి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వాస్తవాలను ప్రజలకు వివరించాలని, అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ చింతల ఉమా, ఎంపీఓ రంజిత్, ఏవో ప్రియదర్శిని, పరకాల మార్కెట్ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చల్లా చక్రపాణి, బాసని చంద్రప్రకాష్, పోలేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఏరుకొండ శంకర్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కమలాపూర్ ఎం జె పి గురుకులంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజావాణి సెప్టెంబర్ 5 కమలాపూర్ మండల్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం కమలాపూర్ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాయ్ పూలే బాలుర పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు ముందుగా పాఠశాల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ గొప్పతనాన్ని వివరిస్తూ సేవలను వివరించారు విద్యార్థులు విద్యాభ్యాస దశలో క్రమశిక్షణ అలవార్చుకుని సమాజంలో అంతే క్రమశిక్షణగా పౌరులుగా ఎదగాలని కోరారు ప్రతి విద్యార్థికి తల్లిదండ్రి తర్వాత గురువే ముఖ్య ప్రాధాన్యత కనుక గురువును కూడా తల్లిదండ్రులతో సమానంగా గౌరవించాలని తెలిపారు విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపడానికి ఉపాధ్యాయులకు కొవ్వొత్తుల వెలుగునిస్తూ తాము కరుగుతున్నారని అన్నారు ప్రస్తుతం సమాజంలో ఉపాధ్యాయుల పట్ల జరుగుతున్న పరిస్థితులను రూపుమాపి ఉపాధ్యాయులకు సమాజంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు

బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ మధ్య హనుమకొండలో ఉద్రిక్తత

ప్రజావాణి సెప్టెంబర్ 5 హనుమకొండ లోని భీమారం లో బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ మధ్య ఉద్రిక్తత చోటు చేసుకుంది కాంగ్రెస్ 1000 రోజుల ఆ పాలను నిర్వహిస్తూ బీ ఆర్ఎస్ నేతలు నిరసన చేపడుతుండగా ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ను కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు దీంతో బీ ఆర్ఎస్ మరియు కాంగ్రెస్ శ్రేణుల మధ్య తోపులాట జరగగా ఉద్రిక్తత నెలకొంది ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారుడ

ఉత్తమ ఉపాధ్యాయుడిగా అరుణ్

● ప్రశంసించిన పలువురు అధికారులు

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి ఖమ్మం జిల్లా చింతకాని ఉత్తమ ఉపాధ్యాయుడిగా నాగులవంచ శ్రీ ఆదర్శ హై స్కూల్ ప్రిన్సిపల్ చావా అరుణ్ కుమార్ ఎంపికయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, డీఈవో సదానందం చేతుల మీదుగా మెమెంటో, ప్రతిభా పురస్కారం అందుకున్నారు. 28 సంవత్సరాలుగా విద్యారంగంలో చేస్తున్న సేవను పురస్కరించుకొని ఈ పురస్కారం అందజేశారు. కాగా అరుణ్ కు చింతకాని మండలంలో సౌమ్యుడుగా పేరు ఉందని తెలిసింది.ఈ సందర్భంగా అరుణ్ ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, ఎంఈఓ సలాది రామారావు, వైరా డివిజన్ అధ్యక్షుడు బోడేపూడి కిరణ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ పిఎంపి సమస్యల పై సెప్టెంబర్ 6న హైదరాబాద్ లో జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలి.

● నల్లగొండ జిల్లా మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ అధ్యక్షులు దొరపల్లి మాల్సూర్.

ప్రజావాణి న్యూస్ మిర్యాలగూడ. నల్లగొండ జిల్లా పరిధిలోని మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దొరపల్లి మల్సూర్ జిల్లాలో మరియు రాష్ట్రంలో జరిగే ఆర్ఎంపి పిఎంపి సమస్యలపై పెద్ద ఎత్తున సమావేశాన్ని ఏర్పాటు చేస్తూ అట్టి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని ఆర్ఎంపి పి.ఎం.పి లపై మోపిన కేసులను ఎత్తివేయాలని పెద్ద హాస్పిటల్లో కు వెళ్లలేని సామాన్యులకు ఆర్ఎంపీలు పీఎంపీలే దిక్కని అలాంటి వారిపై అనాలోచిత కేసులు పెట్టి ఇబ్బందులు పాలు చేస్తున్న వ్యక్తులపై ప్రతి ఒక్క ఆర్.ఎం.పి పిఎంపి స్పందించి మన న్యాయ పోరాటాన్ని కొనసాగించాలని జిల్లాలో గల ఆర్ఎంపి పిఎంపీలను రాష్ట్ర సంఘ నాయకుల ఆదేశాల మేరకు సెప్టెంబర్ 6న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన్ భవన్ లో జరగబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి జానీ మియా మిర్యాలగూడ టౌన్ అధ్యక్షులు నల్లగొండ జిల్లా కోశాధికారి పగిడిమర్రి గోవర్ధన్ చారి తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు మంథని పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్

మన ప్రజావాణి. మంథని ప్రతినిధి

రాబోయే వినాయక చవితి సందర్భంగా ఎలాంటి అనర్థాలు జరగకుండా మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు / హిస్టరీ షీటర్లకు ఈరోజు మంథని పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది.పండుగ సందర్భంగా నేరాలు, విరోధాలు, బలవంతపు చందా వసూళ్లు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గుంపులు ఏర్పరచడం వంటి పనులు చేయవద్దని కఠినంగా హెచ్చరించడం జరిగింది. స్టేషన్ పరిధి విడిచి వెళ్లే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అనుమానాస్పద సమాచారం వెంటనే తెలపాలని సూచించారు. ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పండుగ బందోబస్తు నిమిత్తం బీట్ చెకింగ్, నైట్ రౌండ్స్, ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేయడం జరుగుతోంది.ప్రజలు పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే మంథని పోలీసులను సంప్రదించాలని కోరడం జరిగింది.

మానవత్వం చాటుకున్న తహసీల్దార్ - కారు వద్దకే వెళ్లి రిజిస్ట్రేషన్

రాయికల్; సెప్టెంబర్ 05 (ప్రజావాణి) :ప్రభుత్వ కార్యాలయాలంటేనే ప్రజలు తిరగాల్సిందే అనే అపోహను పటాపంచ లు చేస్తూ రాయికల్ తహసీల్దార్ నాగార్జున తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న రైతు వద్దకే స్వయంగా వెళ్లి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. వివరాల్లోకి వెళితే రాయికల్ మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామానికి చెందిన రాజా మహమ్మద్ అనే రైతు తనకు చెందిన వ్యవసాయ భూమిని విక్రయించారు. భూమి రిజిస్ట్రేషన్ కోసం ముందుగానే ఆన్ లైన్ లో స్లాట్ బుక్ చేసుకున్నారు. అయితే శనివారం రిజిస్ట్రేషన్ రోజున తీవ్ర అనారోగ్యంతో ఆయన నడవలేని పరిస్థితిలో ఉన్నారు. అయినప్పటికీ రిజిస్ట్రేషన్ ఆగకూడదనే ఉద్దేశంతో కుటుంబసభ్యులు ఎంతో కష్టపడి ఆయనను కారులో తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చారు. కార్యాలయం మెట్లు ఎక్కలేక ఆవరణలోనే కారులో ఉండిపోయారు.ఈ విషయాన్ని గమనించిన తహసీల్దార్ నాగార్జున వెంటనే స్పందించారు. ప్రోటోకాల్ ను పక్కన పెట్టి తన ఛాంబర్ నుండి బయటకు వచ్చి నేరుగా కారు వద్దకే వెళ్లారు. అక్కడే నిబంధనల ప్రకారం బయోమెట్రిక్,ఫోటో తదితర రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.ఒక ప్రభుత్వ అధికారి ఇంతటి సహృదయతతో వ్యవహరించడం పట్ల రైతు కుటుంబ సభ్యులు కృతజ్ఞతతో కన్నీరు పెట్టుకున్నారు. తహసీల్దార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.నిజంగా ప్రజల కోసమే పాలన అనే నినాదానికి ఈ ఘటన నిలువెత్తు నిదర్శనమని స్థానికులు కొనియాడుతున్నారు.ఈ కార్యక్రమంలో భూ భారతి ఆపరేటర్ గొర్ల అరవింద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెయ్యి రోజులు.. ప్రజా సంక్షేమానికి వేయి అడుగులు!

- అభివృద్ధి--సంక్షేమమే ఎజెండాగా ముందుకు..
- సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సాహం.!
- మహబూబాబాద్‌లో ఘనంగా బైక్ ర్యాలీ..
- డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు.

కేసముద్రం సెప్టెంబర్ 5.ప్రజావాణి.వెయ్యి రోజుల ప్రజా పాలన.. సంక్షేమానికి కొత్త బాట, అభివృద్ధికి కొత్త ఊపిరి అంటూ కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సాహాన్ని చాటాయి.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహబూబాబాద్‌లో డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ జెండాలు రెపరెపలాడుతుండగా. భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తల నినాదాలతో పట్టణం సందడిగా మారింది.

సంక్షేమమే కేంద్రంగా.. అభివృద్ధే లక్ష్యంగా.!

ఈ సందర్భంగా ఉమా మురళి నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తోందన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యార్థుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు.. మహిళ.. పేదలే పాలనకు కేంద్రబిందువు.!

రైతుల సంక్షేమం, మహిళలకు ఆర్థిక--సామాజిక భరోసా, పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం, యువతకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి.

రాష్ట్ర ప్రగతికి అవసరమైన రహదారులు, విద్య, వైద్యం, సాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఉమా మురళి నాయక్ తెలిపారు. సంక్షేమంతో పాటు శాశ్వత అభివృద్ధికి బాటలు వేస్తూ తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

హామీల అమలే.. ప్రజల విశ్వాసానికి బలం.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆమె అన్నారు. రాబోయే రోజుల్లో మరింత సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్, గూడూరు మండల పార్టీ అధ్యక్షుడు బాలాజీ నాయక్, మహబూబాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస్, నెల్లికుదురు మండల పార్టీ అధ్యక్షుడు ఎదల్ల యాదవరెడ్డి, ఇనుగుర్తి మండల పార్టీ అధ్యక్షుడు బైరు అశోక్‌గౌడ్‌తో పాటు

వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేవేందర్ నగర్ కాలనీలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

మేడిపల్లి సెప్టెంబర్ 05 (మన ప్రజావాణి)

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలో శ్రీకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ వైష్ణవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. యూత్ నాయకులు పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం పాల ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు.తదునంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.భక్తి, ఆధ్యాత్మికతతో కూడిన ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మరాటి మత్స్యగిరి,దయ్యల అలివేలు,కుక్కల చంద్రయ్య, రాజమ్మ, శ్రీనివాస్, శ్రీ వైష్ణవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కుక్కల రాజు,కుక్కల స్వామి,సాయి,రాజు, చంద్,బాలు,యశ్వంత్, లక్కీ,చరణ్,ఓంకార్, మహిళలు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం వేడుకలు

- పాల్గొన్న మాజీ మేయర్, మాజీ కార్పొరేటర్
- ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి

మేడిపల్లి సెప్టెంబర్ 05(మన ప్రజావాణి) తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే గొప్ప బాధ్యత గురువులదే అని మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అన్నారు.శనివారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులందరినీ పూలబొకేలు అందించి,శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణను అందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీ యమని అన్నారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న విద్యా వాలంటీర్లకు వారి వేతనాలను ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్

సమక్షంలో వాలంటీర్లకు మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి వేతనాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్,ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, నాయకులు సత్యనారా యణ,మధు,కృష్ణయ్య, నర్సింహులు,శివరాజు,కళ్యాణ్,కృష్ణస్వామి, పాండు, ఉపాధ్యాయులు, విద్యా వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చందంపేటలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి అభినందించిన సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 05, మన ప్రజావాణి:చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను, మరియు అంగన్వాడి టీచర్లను గ్రామ సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీతను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల చేతిలోనే దేశ భవిష్యత్తును మార్చే శక్తి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరసింహులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, రామానుజపురం ప్రభాకర్, గైక్వాడ్ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతారాంపూర్ దేవస్థానం లో పున.... నిర్మాణంలో భాగంగా బాలాలయం. ప్రారంభించినందుకు విశేష స్పందన లభించిందని గ్రామ సర్పంచ్ తోపుకొండ పావని చెన్నయ్య వెల్లడి.....

- విగ్రహాల తరలింపు చేయు కార్యక్రమానికి గ్రామంలోని ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించినందుకు గ్రామ ప్రజలను ప్రజలను అభినందించిన సర్పంచ్ తోపుకొండ పావని చెన్నయ్య....
- ఆలయ ఈవో శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ఆలయాల విగ్రహాల తరలింపు చేయు కార్యక్రమానికి డప్పుల సన్మాయిల. మధ్య సీతారాంపూర్ లో కిక్కిరిసిన సీతారాంపూర్ గ్రామ ప్రజలు...

రంగారెడ్డి జిల్లా బ్యూరో. సెప్టెంబర్ 5. ప్రజావాణి. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి గుడి పున.,.. నిర్మాణ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం బాలాలయం.కార్యక్రమానికి గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించిందని గ్రామ సర్పంచ్ తోపుకొండ పావని చెన్నయ్య స్పష్టం చేశారు.. ఆయన రంగారెడ్డి జిల్లా ప్రజావాణి బ్యూరోతో శనివారం. మాట్లాడుతూ సీతారాంపూర్ గ్రామంలో ఉన్న శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం. పున.. నిర్మాణ దశలో ఉన్నందున అట్టి ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టాలని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సీఈఓ శ్రీనివాస శర్మ ఆదేశాల మేరకు సీతా రామచంద్ర స్వామి విగ్రహాలను పున.. నిర్మాణం అయ్యేంతవరకు నూతనంగా నిర్మించిన గుడిలో విగ్రహాలను ప్రతిష్టాత్మ మించి గ్రామ ప్రజల ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిరోజు నూతనంగా ఏర్పాటు చేసిన చిన్న ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయాలని ఇటీవల శనివారం సీతారాంపూర్ గ్రామంలో దేవస్థానం పురం నిర్మాణంలో భాగంగా నూతనంగా నిర్మించిన కొద్దిపాటి గుడిలో స్వామివారికి ప్రతిరోజు జరిగే కార్యక్రమాలు గుడి పునర్నిర్మాణం అయ్యేంతవరకు ఇక్కడే పూజలు జరుగుతాయని సర్పంచ్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా నిర్మించిన గుడిలో విగ్రహాలను ప్రతిష్టించి గ్రామంలోని ప్రజలందరూ ప్రత్యేక పూజలు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోపుకొండ పావని చెన్నయ్య. మనీంచెట్టి. గ్రామము ఉపసర్పంచ్. మరియు పాలకవర్గం. గ్రామ పెద్దలు. ప్రజలు తదితరులు ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున పాల్గొన్నారు.

బోర్ మోటార్ కేబుల్ వైర్ల దొంగల ముఠా అరెస్ట్

- నలుగురు నిందితుల అదుపులోకి..
- రాగి తీగలు, కట్టర్లు, ఇనుప రాడ్ స్వాధీనం

భిక్కనూర్, సెప్టెంబర్5 ప్రజావాణి: వ్యవసాయ పొలాల్లో బోర్ మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లను రాత్రి వేళల్లో దొంగిలించి, వాటిని పెట్రోల్‌తో కాల్చి రాగి తీగలను వేరు చేసి స్క్రాప్ షాపుల్లో విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను భిక్కనూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి దొంగతనాలకు ఉపయోగించిన కట్టర్లు, ఇనుప రాడ్, మొబైల్ ఫోన్, దొంగిలించిన కేబుల్ వైర్ల నుంచి వేరు చేసిన రాగి తీగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. నరేందర్ రెడ్డి (A1), మోహన్ (A2), శ్రీకాంత్ (A3), రామ్ చరణ్ (A4) వారం రోజుల క్రితం పరస్పరం పరిచయమై, వ్యవసాయ పొలాల్లోని బోర్ మోటార్ కేబుల్ వైర్లను దొంగిలించి, వాటిని కాల్చి రాగి తీగలను వేరు చేసి విక్రయించాలని పథకం రూపొందించుకున్నారు. ఈ క్రమంలో ఉగ్రవాయి గ్రామం, బస్వాపూర్ శివారు, అంతంపల్లి శివారులోని వ్యవసాయ పొలాల్లో బోర్ మోటార్ కేబుల్ వైర్లను దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది.అంతంపల్లి ఘటనలో A3

శ్రీకాంత్ ఇనుప రాడ్‌తో పొలంలోని గది తాళం పగులగొట్టగా,A4 రామ్ చరణ్ కట్టర్‌తో స్టార్టర్ కేబుల్, బోర్ మోటార్ వైర్లను కట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. A1 నరేందర్ రెడ్డి, A4 రామ్ చరణ్ కలిసి సమీపంలోని ఇతర బోర్ మోటార్ల కేబుల్ వైర్లను కూడా కట్ చేసినట్లు వెల్లడైంది. A2 మోహన్ దొంగిలించిన కేబుల్ వైర్లను పెట్రోల్‌తో కాల్చి రాగి తీగలను వేరు చేసినట్లు పోలీసులు తెలిపారు.సెప్టెంబర్ 5న దొంగిలించిన రాగి తీగలను స్క్రాప్ షాపులో విక్రయించి వచ్చిన డబ్బును నలుగురూ పంచుకున్నారు. అనంతరం భిక్కనూర్ ప్రాంతంలో మరిన్ని బోర్ మోటార్ కేబుల్ వైర్లను దొంగిలించేందుకు వెళ్తుండగా భిక్కనూర్ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.భిక్కనూర్ సిఐ, నరేష్, ఎస్సై,అనిల్ ఆధ్వర్యంలో జజ్జూ కామారెడ్డి కానిస్టేబుళ్లు స్వామి, మైసయ్య, చేతన్, శ్రీకాంత్, భిక్కనూర్ పోలీస్ సిబ్బంది సంగమేశ్వర్, సేవ్య, కిషన్, శ్రీకాంత్ అప్రమత్తంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్నారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.రైతులు అప్రమత్తంగా ఉండాలి వ్యవసాయ పొలాల్లోని బోర్ మోటార్లు, కేబుల్ వైర్లకు రైతులు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని భిక్కనూర్ పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.దొంగతనాల కేసును ఛేదించడంలో చురుకుగా వ్యవహరించిన భిక్కనూర్ సీఐ,నరేష్, ఎస్సై, అనిల్, సీసీస్ కామారెడ్డి మరియు భిక్కనూర్ పోలీసు సిబ్బందిని కామారెడ్డి జిల్లా ఎస్పీ అభినందించారు.

గురువులే.. భవిష్యత్ శిల్పులు!

- నాయకపోడు కాలనీ, అమృతండా పాఠశాలల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

చెన్నారావుపేట సెప్టెంబర్ 05 ప్రజావాణి అక్షరాలు నేర్పడమే కాదు.. ఆత్మ విశ్వాసాన్ని నింపి, లక్ష్యసాధన వైపు నడిపించే గురువులకు విద్యార్థులు ఘనంగా కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని చెన్నారావుపేట మండలంలోని నాయకపోడు కాలనీ, అమృతండా ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు.నాయకపోడు కాలనీలో.. ప్రధానోపాధ్యాయుడు బొమ్మెర సతీష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు విద్యార్థి జీవితంలో సూపర్‌హీరో పాత్ర పోషిస్తారని, రాయిని వజ్రంగా మార్చినట్లు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి ఉన్నత శిఖరాలకు చేర్చేది గురువులేనని

పేర్కొన్నారు.జీవితంలో విజయాలు సాధించేందుకు పట్టుదల ఎంత అవసరమో.. సరైన మార్గంలో నడిపించే గురువు కూడా అంతే అవసరమని తెలిపారు. అమృతండాలో ఆత్మీయంగా.. ప్రధానోపాధ్యాయుడు బానోతు వెంకన్న అధ్యక్షతన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు మంచి

నడవడికను అలవర్చుకుని, నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఏకాగ్రతతో ముందుకు సాగాలని ఉపాధ్యాయులు సూచించారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులు తమ ఉపాధ్యాయులు బానోతు వెంకన్న, భూక్య రాజు, చల్లా విష్ణువర్ధన్, అంగన్వాడీ టీచర్ రాణిలను ఘనంగా సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు.ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితానికి మార్గదర్శి ఉపాధ్యాయుడు...

- విద్యార్థి ప్రతిభను దిశా నిర్దేశం చేసి, ఉన్నత శిఖరాలకు నడిపించే గురువు ఉపాధ్యాయుడు
- ఉపాధ్యాయుడు చెప్పే ఒక మంచి మాట విద్యార్థి జీవితాన్నే మారుస్తుంది..
- విద్యార్థులకు గురువే జ్ఞానానికి వెలుగు, గురువే భవిష్యత్తుకు బాట
- ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం/మన ప్రజావాణి (05 సెప్టెంబర్ 26): ఒక మంచి ఉపాధ్యాయుడు పాఠాలను మాత్రమే బోధించడని, ఒక మంచి ఉపాధ్యాయుడు జీవితాన్ని బోధిస్తాడని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే ఉపాధ్యాయులు మన భవిష్యత్తుకు రూపం ఇస్తారని, గిరిజన విద్యార్థినీ విద్యార్థులను మట్టిలో మాణిక్యాలను వెలికి తీసే గురుతర బాధ్యత మీపై ఉందని, మీరిచ్చే సలహాలు, సూచనలు, మీ యొక్క ప్రత్యేక శ్రద్ధ గిరిజన విద్యాలయాల బలోపేతానికి ఉపకరిస్తుందని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శనివారం రోజు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గిరిజన భవన్లో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలో పిఓ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యకు సంబంధించిన అంశాలను కవిత రూపంలో తెలియజేశారు.విద్యార్థుల ఊహలకు ఊపిరిలుదుతూ ఉన్నత స్థానాలను చేరేలా వారిని ఉత్సాహపరిచే ఉపాధ్యాయులందరికీ విద్యార్థులకు గుణ గుణాలు గుర్తిస్తూ, గుణాత్మకమైన విద్య వైపు గురిపెడుతూ, గమ్యాన్ని చేరేలా గతి శక్తినిచ్చే గురువులందరికీ విద్యార్థుల సాధక బాధలు తెలుసుకుంటూనే, సమాజం పట్ల బాధ్యతగా బ్రతికేలా తీర్చిదిద్దే బోధకులు అందరికీ అధ్యాయాలను, అభ్యంతరాలను అర్థవంతంగా పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులు అయ్యేలా ఉపకరించే అధ్యాపకులు అందరికీ ఆచరణాత్మక అంశాలను అచ్చులు పడేలా అందిస్తూ, అండగాఉండే ఆచార్యులు అందరికీ సగటు మనిషి జీవిత సారాన్ని తమ విషయ పరిజ్ఞానంతో సానబెట్టి సారవంతంగా, సముచితంగా చేసే టీచర్లు అందరికీ విద్యార్థుల మేధా సంపత్తిని పదును పెడుతూ, అంతర్లీన ప్రతిభను మేలుకొలుపుతూ తిరిగి లేని శక్తుల ప్రతి ఒక్కరిని తయారు చేసే టీచర్లు లందరికీ తమపై తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని తప్పునట్లు వారి తనయులను తిరిగి లేని శక్తిగా టీచర్లు అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన అనంతరం, ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు మరింత ప్రత్యేకమైన వని, మారుమూల ప్రాంతాల్లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ విద్యార్థుల కోసం తమ సమయాన్ని శ్రమను వెచ్చిస్తూ, వారు చేస్తున్న సేవ నిజంగా అభినందనీయమని, ఒక గిరిజన విద్యార్థి చదువుకొని, ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడు ఆ విజయానికి వెనుక తల్లిదండ్రుల ఆశీర్వాదంతో పాటు ఒక ఉపాధ్యాయుడు కృషి మార్గదర్శకం తప్పకుండా ఉంటుందని అన్నారు. ఒక ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని తీర్చిదిద్దితే ఒక కుటుంబం మారుతుందని, 100 మంది విద్యార్థులను తీర్చిదిద్దితే ఒక సమాజం మారుతుందని, వేలాది విద్యార్థులను తీర్చిదిద్దితే ఒక దేశ భవిష్యత్తు మారుతుందని అందుకే ఉపాధ్యాయ వృత్తి ఒక ఉద్యోగం మాత్రమే కాదని అది ఒక బాధ్యత, ఒక సేవ, ఒక పవిత్రమైన యజ్ఞమని అన్నారు.
గిరిజన విద్య బలోపేతం కావడానికి మీ అందరి సహకారంతోటే ఏ ప్రోగ్రాం చేసిన అది మీ ద్వారానే పోవాలి. అది తప్పనిసరిగా పిల్లలకు అందే విధంగా ఉద్దీపకం-1, 02, ప్రవేశపెట్టడం జరిగిందని, దాని ద్వారా మంచి రిజల్ట్ వచ్చాయని, ప్రాథమిక విద్యలో పునాది గట్టిగా పడితేనే అది హై స్కూల్ లెవెల్లో గాని, పై చదువులో కూడా తీసుకెళ్లేది ప్రైమరీ ఎడ్యుకేషన్ కాబట్టి, అది మనం బాగు చేసుకుంటే మనకు మంచి రిజల్ట్ వస్తాయని ఉద్దేశంతో క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పిస్తే, మన పిల్లలకు కూడా మంచిగా ఉంటుందని అన్నారు. హై స్కూల్ లెవెల్ లో చదివే విద్యార్థులకు విద్య అనేది బలోపేతం అవుతుందని, అది దృష్టిలో పెట్టుకొని ఇటువంటి కార్యక్రమాలు చేయడం జరిగిందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో నమ్మకముతో బడులకు పంపిస్తారని, అక్కడున్న టీచర్స్, సిబ్బంది వారిని తమ సొంత పిల్లల వలె కంటికి రెప్పలా కాపాడుతూ చూసుకోవాలని అన్నారు.సమాజంలో మనం అందరితో అనగా ఇంజనీర్స్, డాక్టర్స్ అవసరం పడ్డప్పుడే మనము వారితో కనెక్ట్ అవుతారని, పుట్టిన ప్రతి ఒక్క బాబు గాని, పాప గాని మెజార్టీ భాగము వాళ్ళ యవ్వనం వాళ్ళ పరిస్థితి ఏదైనా ఉందంటే అది విద్యాశాఖ మాత్రమే అని, పిల్లలు ఏమీ తెలియని పసిపిల్లలను తల్లిదండ్రులు ఎక్కడి నుంచో తీసుకువచ్చి, మన పాఠశాలల్లో చేర్పిస్తారని వారికి విద్యాబుద్ధులు నేర్పించి, ఎవరెస్టు శిఖరం ఎక్కించే స్థాయికి వాళ్ళకు జ్ఞానాన్ని అందించి వాళ్లు ఉన్నతమైన స్థానాలకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులందరికీ మరి ఒకసారి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో విద్యాభివృద్ధి కొరకు మనం చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలు ఇచ్చాయని, ఆ ఫలితాలతోటే విద్యా వ్యవస్థను ప్రైమరీ నుండి పటిష్టం చేయడానికి ఉద్దీపకం 3, వారధి పుస్తకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, విద్యార్థులు ప్రతిరోజూ వారి చదివే సబ్జెక్టులతో పాటు వారానికి మూడు రోజులు ఇంగ్లీష, గణితం సబ్జెక్టులలో కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమయ్యే ప్రతి అంశాలను వారికి అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని అన్నారు. అలాగే పదవ తరగతిలో ఫలితాలు చాలా సంతృప్తి ఇచ్చాయని, చదువుతోపాటు క్రీడలలో కూడా మంచి ప్రావీణ్యం సంపాదించి, ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించి ఐటీడీఏకు మంచి పేరు తీసుకువచ్చారని, అలాగే వేరే పాఠశాలలను పోల్చుకొని పరిశీలిస్తే మన పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభ్యాసం చాలా బాగుందని అన్నారు. ప్రతి పాఠశాలలో కుల మతాలు, రాగద్వేషాలు, ధనికా పేద అని తారతమ్యం లేకుండా ఆశ్రమ, గురుకుల పాఠశాలలో చదివే పిల్లలు ఉన్నతమైన విద్య, కెరీర్ పై పిల్లలను మనం అందరం కలిసి ఉత్తేజపరిచి బాగా చదువుకొని ప్రయోజకులు అయ్యేలాగా చేయాలని అన్నారు. గతంలో విద్యార్థులకు వివిధ క్విజ్ పోటీలలో పాల్గొనేలా చేసి వారిలో దాగివున్న నైపుణ్యాలను ప్రదర్శించిన పాఠశాలలకు మొదటి, రెండు బహుమతులు నగదు రూపంలో అందించి పాఠశాల అభివృద్ధికి చేయూత అందించామని, తెలుగు భాషా దినోత్సవం నాడు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని, దాంతోపాటు సెల్ఫీ కాంపిటీషన్ డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తామని అన్నారు.పాఠశాలల్లో ఏ సమస్య ఉన్న మా పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరిస్తున్నామని, త్వరలో టీచర్ల సర్దుబాటు కూడా చేస్తామని అన్నారు. కాబట్టి ఉపాధ్యాయులు ఇష్టంతో కష్టపడుతూ తన విద్యార్థులలోని ప్రతిభను గుర్తించి అతనిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి, విద్యుత్ తో పాటు విలువలు క్రమశిక్షణ మానవత్వం దేశభక్తి వంటి మంచి లక్షణాలను పెంపొందించాలని ఆయన అన్నారు. ఆశ్రమ పాఠశాలలు, పదవ తరగతి నూటికి నూరు శాతం పరీక్షా ఫలితాలు సాధించిన ఆయా పాఠశాలల హెడ్మాస్టర్ లను, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉత్తమ టీచర్లుగా ఎంపికైన వారికి పురస్కారాలు అందజేశారు. అదేవిధంగా టీచర్స్ డే సందర్భంగా ఉద్దీపకం-3, వారధి రూపకల్పనలో సహాయ సహకారాలు అర్సీలకు, క్రీడలలో ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించిన పిడి, పీఈటీలకు ప్రత్యేకంగా శాలవాలతో సత్కరించి పురస్కారాలు అందించారు. అనంతరం ప్రాజెక్ట్ అధికారి, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని, ఆర్సీఓ గురుకులం ఏసీఎంవోలు, ఏటిడిఓలకు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని చందన, ఆర్సీఓ గురుకులం అరుణకుమారి, ఏసీఎంవో రమేష్, రాములు, ఏటీడీవోలు రాధమ్మ, చంద్రమోహన్, భారతీదేవి, పిఐటిసి ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, జిసిడివో అలివేలు మంగతాయారు, డిడి ట్రైబల్ వెల్ఫేర్ సిబ్బంది, పీఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ కు ఘన సన్మానం

- ఉపాధ్యాయ దినోత్సవం వేళ రామారావుపల్లెలో ఆత్మీయ వీడ్కోలు

రాయికల్: సెప్టెంబర్ 05 (ప్రజావాణి):ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 30 ఏళ్ల పాటు చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన అంగన్వాడీ టీచర్ కు గ్రామమంతా చేరి ఘనంగా వీడ్కోలు పలికింది.రాయికల్ మండలం రామారావుపల్లె గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ పి. శ్రీమతి సుమారు మూడు దశాబ్దాల పాటు నిర్విరామంగా సేవలందించి ఇటీవల పదవీ విరమణ చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం (సెప్టెంబర్ 05) సందర్భంగా ఆమె సేవలను స్మరించుకుంటూ గ్రామ పంచాయతీ,పాఠశాల ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ రాజేందర్, ప్రధానోపాధ్యాయులు నగేష్ రెడ్డి, అంగన్వాడీ టీచర్ శ్రీమతి ని శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఎంతో మంది చిన్నారులకు అక్షరాభ్యాసం నుండి ఆరోగ్యం వరకు ఆమె అందించిన సేవలు మరువలేనివని, ఆమె అంకితభావం నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవదాసు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా విద్యార్థులలో చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు విద్యార్థులకు కంపాస్ బాక్సులను పంపిణీ చేశారు.

పెండ్లి అయిన ప్రతి ఆడబిడ్డకు రూ.3వేలు, వ్యక్తి మరణిస్తే రూ.4వేలు..రెడ్డికుంట తండా సర్పంచ్ యమునా రాకేష్

- మాజీ మంత్రి దయాకర్ రావు సమక్షంలో ఆడబిడ్డకు నగదు పంపిణీ...

పెద్దవంగర, సెప్టెంబర్ 05 ప్రజావాణిస్థానిక ఎన్నికల ప్రచారంలో రెడ్డికుంట తండా సర్పంచ్ అభ్యర్థి బానోతు యమునా రాకేష్ మ్యానిఫెస్టో విడుదల చేసి ఇచ్చిన మాట ప్రకారం హామీలను గెలుపొందిన వెంటనే అమలుపరుస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్స్ లో రెడ్డికుంట తండా జీపీ చెందిన ఆడబిడ్డ అంగోతు విమల – వినయ్ వివాహ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఆహ్వానించి దయాకర్ రావు చేతుల మీదుగా రూ.3వేల నగదును వివాహ వేడుకల్లో అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ.. రెడ్డి కుంట తండా సర్పంచ్ తండావాసులకు ఇచ్చిన మేనిఫెస్టో హామీ ప్రకారం .. హామీలను నెరవేర్చడం అభినందనీయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో గెలిస్తే 10 గ్యారెంటీలు అమలు చేస్తానని హామీ ఇచ్చి..ఇప్పటికే తండాలో మృతి చెందిన దాదాపు 6 కుటుంబాలకు రూ.4వేలు అందించడం జరిగిందని, జిపిలో అభివృద్ధికి కావలసిన నిధులను అందించి ఆదర్శవంతమైన జిపిగా తీర్చిదిద్దుతున్న యమునా రాకేష్ను అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను ఇప్పటికి నెరవేర్చలేదని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్ రామచంద్రయ్య శర్మ, మాజీ జిసిసి చైర్మన్ గాంధీ నాయక్, బీఆర్ఎస్ నేతలు సంజయ్ సుదీర్ ఐలయ్య గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వర్‌పల్లిలో రైతులకు అవగాహన సదస్సు

భిక్కనూర్, సెప్టెంబర్ 05 (ప్రజావాణి):సేంద్రియ వ్యవసాయ విధానాలతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంతో పాటు, రాజయోగ ధ్యానం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు తెలిపారు.
భిక్కనూర్ మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో శనివారం "సేంద్రియ వ్యవసాయం మరియు రాజయోగ ధ్యానంతో దేశ ఆరోగ్యం పదిలం" అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయ విధానాలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులు, ఆరోగ్యకరమైన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ఆరోగ్య భద్రతలో అన్నదాతల పాత్ర ఎంతో కీలకమని, రైతు దేశానికి వెన్నెముక లాంటివాడని పేర్కొన్నారు. అధికంగా హానికరమైన రసాయనాలను వినియోగించడం వల్ల భూమి తన సహజ సారాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా భూమి సారవంతతను కాపాడటంతో పాటు ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని వివరించారు.ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి జయాది దీది, అంతర్జాతీయ ముఖ్య కేంద్రం రాజస్థాన్‌లోని అబూ కేంద్రం నుంచి విచ్చేసిన బీకే సుమంత్ అన్నయ్య రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. సేంద్రియ వ్యవసాయంతో పాటు రాజయోగ ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు.ఈ అవగాహన సదస్సు ద్వారా గ్రామ రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించినందుకు పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి,ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ సేవలను కొనియాడారు.సదస్సులో పాల్గొన్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ.. సేంద్రియ వ్యవసాయ విధానాలను తిరిగి ప్రారంభించి, ఆరోగ్యకరమైన పంటలను పండించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పీర్జాదిగూడలో బీఆర్ఎస్ భారీ బైక్ ర్యాలీ

- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలి - మాజీ మేయర్ జక్క.వెంకట్ రెడ్డి?

మేడిపల్లి సెప్టెంబర్ 05(మన ప్రజావాణి) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ సమస్యలను గాలికొదిలేసిందని మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ఆరోపించారు.మేడ్చల్ నియోజకవర్గం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ పీర్జాడిగూడల్,మేడిపల్లి డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి నాయకత్వంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు,యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల, జాబ్ క్యాలెండర్,యూత్ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ ర్యాలీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు,యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో విద్యారంగం పూర్తిగా కుదేలైందని మండిపడ్డారు.అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే విద్యా సమస్యలను పరిష్కరిస్తామని,మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీలిచ్చిన కాంగ్రెస్, పాలన మొదలై ఇన్ని రోజులవుతున్నా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు కాలేజీల్లో సర్టిఫికెట్లు అందక,తల్లిదండ్రులు ఆర్థిక భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడటం తగదని హెచ్చరించారు తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోతే,రాబోయే రోజుల్లో విద్యార్థి లోకంతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి,కొల్తూరి మహేష్,లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, మధుసూదన్ రెడ్డి,కౌడే పోచయ్య,మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షుడు ప్రభు, సీనియర్ నాయకులు జావీద్ ఖాన్,ఆకుల మధుకర్,శ్యామల శ్రీనివాస్,యూబీఏ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, అంజనేయులు, బాలరాజు,కోనేటి వెంకట్, పింగళి జోగిరెడ్డి, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, బుల్లెట్ శంకర్,జగన్ రెడ్డి, వీరమళ్ళ జగన్నాధం, శశిధర్ రెడ్డి,అశోక్,సతీష్, కిరణ్ నాయక్,పాశం నరేందర్ రెడ్డి,సోమేశ్, అక్షిత్,వెంకట్,నారాయణ రెడ్డి,అమర్ పటేల్, తిరుమలేష్,మధు,జమీర్, కిరణ్ గౌడ్,వారికల శ్రీనివాస్,చిరంజీవి, రమేష్, కైసర్,అనిల్,శ్రీనివాస్, దివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం,బూట్ల పంపిణీ

రాయికల్, సెప్టెంబర్ 05 (ప్రజావాణి):ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందనడానికి నిదర్శనంగా రాయికల్ మండలం ఒడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలలో యూనిఫాం, బూట్ల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉప సర్పంచ్ రాజేష్ తో కలిసి విద్యార్థులకు కొత్త యూనిఫాంలు, బూట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటోందని, విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ఉచితంగా అందిస్తోందని తెలిపారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ప్రభుత్వం ఇచ్చిన కొత్త బట్టలు, బూట్లు వేసుకుని విద్యార్థుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఆమీర్, పాఠశాల చైర్మన్ దేవల నర్సవ్వ, ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు నవ్యశ్రీ, వార్డు సభ్యులు సూర మాధురి, గ్రామ కారోబార్ జలంధర్ తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల రేసులో పోత్నక్ ప్రమోద్ కుమార్...!

- పార్టీ కోసం 40 ఏళ్ల సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ టికెట్...!

సెప్టెంబర్ 05 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధివరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఆశావహుల జాబితాలో భువనగిరికి చెందిన సీనియర్ నాయకుడు పోత్నక్ ప్రమోద్ కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ వచ్చిన ప్రమోద్ కుమార్, ఎన్ఎస్‌యూఐ , యూత్ కాంగ్రెస్ , సీనియర్ కాంగ్రెస్ సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. పార్టీ బలో పేతం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని కార్యకర్తలు పేర్కొంటున్నారు. పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని , పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోత్నక్ ప్రమోద్ కుమార్ కు అవకాశం కల్పిస్తే పార్టీకి మరింత బలం చేకూరుతుందని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయపడు తున్నాయి. అనుభవం , పార్టీ పట్ల నిబద్ధత , విద్యా వంతులతో ఉన్న అను బంధం , ప్రజా సమస్యలపై అవగాహన వంటి అంశాలు ఆయనకు అను కూలంగా మారే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే , కాంగ్రెస్ అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుందన్నది ఆసక్తికరంగా మారగా , పార్టీ కార్యకర్తలు మాత్రం పోత్నక్ ప్రమోద్ కుమార్ పేరును బలంగా ప్రతి పాదిస్తున్నట్లు సమాచారం.

గీతాంజలి హై స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు:

సెప్టెంబర్ 5 జవహర్ నగర్ (ప్రజావాణి ప్రతినిధి వెంకటేష్) గీతాంజలి హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కృష్ణశీ సార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్వర్గీయ భారతదేశ తొలి ఉప రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి పుట్టినరోజు సందర్భంగా మనం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటామని తెలియజేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ గారి ఆశయాలను కొనసాగిస్తూ వారిని ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి మేడం వైస్ ప్రిన్సిపాల్ కర్నే సురేందర్ , నాగరాణి మేడం, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయడమే లక్ష్యం

రాజన్న సిరిసిల్ల, ప్రజావాణి మండలం లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.... విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది, వారిని ఉన్నత స్థానాల్లో నిలబెట్టడమే ఉపాధ్యాయుల ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుతూ సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.

విద్యతో పాటు మంచి విలువలు అవసరం

పేరెంట్స్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులను సొంత బిడ్డల్లా భావించి వారి బాగోగులు చూసుకోవాలని కోరారు. పిల్లలకు విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణను అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట సదానందం ఆధ్వర్యం లో ఎంఆర్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

రామగుండం సెప్టెంబర్ 5 ప్రజావాణి :ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రామగుండం కార్పొరేషన్ పట్టణ కన్వీనర్ కాసిపేట సదానందం ఆధ్వర్యంలో 8వ డివిజన్ లో ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ నూతన కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన సభ్యులుగా ఉప్పులేటి పర్వతాలు, మైస రవి, కొమ్ము రవికుమార్, సాయిలు, శేష్ కుమార్, వెంకటేష్, శేఖర్ లను నియమించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సమాజంలో ఎస్సీ, బీసీ, మైనార్టీల హక్కుల సాధనకు మరియు ఎమ్మార్పీఎస్ బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజావాణిబీర్కూర్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బీర్కూర్ మండలంలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖ తరఫున ఖాజా మొయినుద్దీన్, నరేంద్ర ప్రసాద్, భరత్ కుమార్, సరిత రాణి, శ్రీధర్ భార్గవ్, ఎం. గోపాల్, సనా ఫిర్దోస్ ఎంపికయ్యారు.

అదేవిధంగా PRTU TS బీర్కూర్ తరఫున జయశ్రీ, సోమేశ్వర్, ఎస్. అనిల్ కుమార్, ఎస్. హరి ప్రసాద్, పి. గంగన్న, వి. సాయినాథ్, హలీమా సాదియా, అంబా గౌడ్లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పలువురు ఉపాధ్యాయులు ఉపన్యాసం పలికారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనిధి, ఎంఈఓ వెంకన్న, ఉపసర్పంచ్ పరమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాములు, వివిధ గ్రామాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంజనీ పుత్రుడికి ప్రత్యేక పూజలు

- శ్రీశ్రీ శ్రీ అప్పల ఆంజనేయస్వామి దేవాలయంలో పులిహోర ప్రసాద పంపిణీ
- పాల్గొన్న:జమ్ము రమేష్

శాలిగౌరారం సెప్టెంబర్ 05(మన ప్రజావాణి)

శాలిగౌరారం మండలం లోని పెర్క కొండారం గ్రామంలో శ్రీశ్రీ శ్రీ అప్పల ఆంజనేయస్వామి దేవాలయంలో పులిహోర ప్రసాద పంపిణీ ఇరక కొండారం గ్రామ భారతీయ జనతా పార్టీ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బిజెపి జిల్లా నాయకుడు జమ్ము రమేష్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి,పులిహోర ప్రసాద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మేడిపల్లి పాండురంగయ్య బిజెపి మండల నాయకులు యమ గాని వీరేందర్,తాడోజు ఈశ్వర చారి,భీమన పోయిన సైదులు,ఏదుళ్ళ భాస్కర్ రెడ్డి,దేవరకొండ శ్రీనివాసులు,సోమవారం సైదులు,దేవరకొండ అల్లయ్య,మాచర్ల శంభులు,మాచర్ల కృష్ణ, మేడిపల్లి సత్తయ్య, దొరపెల్లి రవి,దేవరకొండ రవి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయులు

- హరిపురం యూపీఎస్ మహేందర్ రెడ్డి
- పోత్కపల్లి జీపీఎస్ సతీష్ కుమార్ సేవలకు ప్రశంసలు

పెద్దపల్లి సెప్టెంబర్ 5 ప్రజావాణి :హరిపురం యూపీఎస్‌లో ఎస్ఏ గణితం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎం. మహేందర్ రెడ్డి, పోత్కపల్లి జీపీఎస్‌లో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న వై. సతీష్ కుమార్ అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులుగా నిలుస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తినే దైవంగా భావిస్తూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తూ పాఠశాల అభివృద్ధిలో తమదైన ముద్ర వేస్తున్నారు.సమయపాలనకు ప్రాధాన్యత ఇస్తూ, విధులను బాధ్యతగా నిర్వహించడంతో పాటు తోటి ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ మంచి సమన్వయంతో పాఠశాల విద్యా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలతో పాటు వివిధ రకాల నైపుణ్యాలను పెంపొందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ మంచి ఫలితాలను సాధించే దిశగా కృషి చేస్తున్నారు.పాఠశాలలో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాలకు (పీటీఎం) అధిక సంఖ్యలో తల్లిదండ్రులు హాజరయ్యేలా ప్రోత్సహించడం, వారి భాగస్వామ్యాన్ని పెంచడం, విద్యార్థుల చదువు, ప్రవర్తన, హాజరు తదితర అంశాలపై తల్లిదండ్రులతో నిరంతరం సమన్వయం చేయడం వీరి ప్రత్యేకతగా చెప్పవచ్చు. అదే విధంగా పాఠశాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని కల్పిస్తూ, పాఠశాల పట్ల సమాజంలో బాధ్యతాభావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు నిరంతరం పర్యవేక్షిస్తూ, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిరోజూ పద్ధతిబద్ధంగా ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించడం, పాఠశాల గ్రంథాలయాన్ని సమర్థవంతంగా వినియోగించేలా విద్యార్థులను ప్రోత్సహించడం, పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. విద్యార్థులకు తరగతి గది విద్యతో పాటు విజ్ఞాన యాత్రలు, క్షేత్ర సందర్శనలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రత్యక్ష అనుభవం ద్వారా జ్ఞానాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశీలనా శక్తి, సామాజిక అవగాహన, ఆత్మవిశ్వాసం వంటి లక్షణాలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రగతి, ఉపాధ్యాయుల సమన్వయం వంటి అంశాల్లో నిరంతరం ముందుండి పనిచేస్తున్న మహేందర్ రెడ్డి, సతీష్ కుమార్‌లను ఆదర్శ ఉపాధ్యాయులుగా పలువురు అభినందిస్తున్నారు. “వృత్తి ఒక ఉద్యోగం కాదు.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత” అనే భావనతో పనిచేస్తున్న వీరిద్దరి సేవలు పాఠశాలలకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన

- అపోలో, యశోదలను తలదన్నేలా ఏరియా ఆసుపత్రి!
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సెప్టెంబర్ 05 ప్రజావాణి న్యూస్): ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ స్మశానంలాంటి ప్రభుత్వాస్పత్రి, దరిద్రపు పాలకుల కారణంగానే ఇబ్రహీంపట్నం లో ఎనిమిది మంది బాలింతలు ఒకేరోజు ప్రాణాలు కోల్పోవల్సి వచ్చిందని మండిపడ్డారు ఆఫోరాన్ని నిరసిస్తూ తాను ఇబ్రహీం పట్నం నడిరోడ్డుపై కూర్చుని ఇక్కడి ప్రజలకు మాటిచ్చానని ఆమాట ప్రకారం శిథిలమైన భవనాన్ని కూల్చివేసి కార్పొరేట్ హంగులతో ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా అధికారులు వైద్యులతో మాట్లాడిన ఆయన పనుల పురోగతి సౌకర్యాల గురించి దిశానిర్దేశం చేశారు ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ డిప్యూటేషన్‌పై వైద్యులంతా తిరిగి వచ్చాక పరిస్థితుల మార్పు గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో రోజుకు యాభై మంది వరకు వచ్చేవారని ప్రస్తుతం 500 మంది వరకు ప్రజలు ఆస్పత్రికి వస్తున్నట్లు వైద్యులు వివరించారు. తాత్కాలిక భవనంలో పరిస్థి తులను తెలుసుకున్న ఆయన వీలైనంత త్వరగా ఆస్పత్రి పూర్తయ్యేలా దృష్టి సారిస్తామని చెప్పారు. నిత్యం వందలాది మంది ఇబ్రహీంపట్నం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తూ రోజుకు రూ20 లక్ష ల వరకు ఖర్చు చేస్తున్నట్లు అంచనా వేసిన ఎమ్మెల్యే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పరీక్షల నుంచి చికిత్స మందుల వరకు అందించేలా ప్రభుత్వాస్పత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాస్త ఆలస్యమైనా అద్భుతమైన రీతిలో యశోద అపోలో తరహాలో సౌకర్యాలు కల్పించాలనేదే తన లక్ష్యమన్నారు అప్పటి వరకు ఇబ్బందులు తలెత్తకుండా సచివాలయంలో సమీక్ష జరిపి డిప్యూటేషన్‌వెళ్లిన వారందరినీ వెనక్కి రప్పించినట్లు ఆయన తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి పేదప్రజ లందరికీ నాణ్యమైన వైద్యసేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని మరో యాభై మంది డాక్టర్లను తీసుకురావటానికి సిద్ధమన్న ఆయన సుస్తీ చేసినవారందరూ నేరుగా సర్కార్ దవాఖానాకు వెళ్లే పరిస్థితి రావాలన్నారు. ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి ఆక్టోపస్ వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులు వీలైనంత త్వరగా పూర్తిచేయాలని హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారె డ్డి ఆదేశించారు ఈ మేరకు అధికారులతో మాట్లాడిన ఆయన పనుల జాప్యానికి గల కారణాల ను ఆరాతీశారు ఇబ్రహీంపట్నంలో తలెత్తుతున్న ఇబ్బందుల దృష్ట్యా పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గుర్నాథ్ రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఉప్పరగూడ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఏదుళ్ళ పాండు రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాచర్ల వెంకటే శ్వర్లు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు భారీ ర్యాలీ

- అభివృద్ధి--సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం:
- ప్రభుత్వ విప్ విజయరమణ రావు

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి సెప్టెంబర్ 05రైతులు, మహిళలు, పేదల సంక్షేమానికి పెద్దపీట.. కేటీఆర్ అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. చీకురాయి రోడ్డు నుంచి జెండా చౌరస్తా వరకు రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు.

రైతులకు రూ.80.68 కోట్ల బోనస్

రైతుల నుంచి గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సన్నధాన్యానికి రూ.1,540 కోట్ల బోనస్ చెల్లిస్తే, పెద్దపల్లి నియోజకవర్గంలో రూ.80.68 కోట్లను రైతులకు బోనస్‌గా చెల్లించామని తెలిపారు.

వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీని అమలు చేసి, ఒక్కో రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. రుణమాఫీ అనంతరం రైతులకు తిరిగి బ్యాంకుల నుంచి రుణాలు అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక్క రైతుకైనా లక్ష రూపాయల రుణమాఫీని ఏకకాలంలో అమలు చేశారా అని ప్రశ్నించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

రాష్ట్రంలో పేదలకు గుడిసెల రహిత తెలంగాణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని విజయరమణ రావు అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని భరోసా ఇచ్చారు.

పెద్దపల్లి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, మొదటి విడతలో ఇప్పటికే 3 వేల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని పేర్కొన్నారు. మరో పది రోజుల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

పెద్దపల్లి అభివృద్ధికి ప్రత్యేక నిధులు

పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.88 కోట్లు విడుదల చేయించామని, పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. భూసేకరణ కోసం మరో రూ.80 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు విస్తరించేందుకు రూ.53 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ఆస్పత్రి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లా ఆస్పత్రి వైద్య సేవల్లో అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ నియోజకవర్గంలో ఆర్ఓబీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, అయితే పెద్దపల్లిలో ఆర్ఓబీ పనులు వేగంగా కొనసాగి పూర్తి దశకు చేరుకున్నాయని అన్నారు. మరో రెండు మూడు నెలల్లో ఆర్ఓబీని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంపై బీఆర్ఎస్ అక్కసు వెళ్లగక్కుతోందని విమర్శించారు. గతంలో మహిళలకు రూ.3,100 కోట్ల వడ్డీ బకాయిలు పెట్టిన బీఆర్ఎస్ ఇప్పుడు అసత్య ప్రచారాలు చేస్తోందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మహిళలకు సంబంధించిన పథకాలను కొనసాగించడంతో పాటు, విడతల వారీగా వడ్డీ బకాయిలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు స్పష్టం చేశారు.అలాగే ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

కేటీఆర్ అసత్య ప్రచారాలు మానుకోవాలి

ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారాలు, నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని విజయరమణ రావు హితవు పలికారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఆనందంగా ఉన్నారని, ఆ విషయం ప్రతిపక్షాలకు మింగుడుపడటం లేదని విమర్శించారు. అవినీతి రహిత పాలనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, పట్టణ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

కుక్కల బెడద.. స్థానికుల్లో ఆందోళన

- రహదారులపై గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు
- వాహనదారులను వెంబడించడంతో ప్రమాదాల ముప్పు
- చిన్నారులు, వృద్ధుల్లో తీవ్ర భయాందోళన
- అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్

సెప్టెంబర్ 05, ప్రజావాణి సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులను వెంబడిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి వెంటనే కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సత్తా చాటిన ఎస్ఆర్ఐటీ

● 78 మంది ఎస్ఆర్ఐటీ విద్యార్థులకు టీసీఎస్‌లో ఉద్యోగాల జాతర

అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 05 ప్రజా వాణి అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని శ్రీ రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటీ) కళాశాల విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో సత్తా చాటారు. ప్రముఖ గ్లోబల్ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నిర్వహించిన నియామక ప్రక్రియలో కళాశాలకు చెందిన 78 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు.టీసీఎస్ నియామక ప్రక్రియలో ప్రైమ్ విభాగం కింద 18 మంది విద్యార్థులు రూ.9.08 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యారు. వీరిలో సీఎస్‌సీ నుంచి 7 మంది, సీఎస్‌ఎం నుంచి 5 మంది, ఈసీఈ నుంచి 4 మంది, ఈఈఈ నుంచి ఇద్దరు ఉన్నారు.అదేవిధంగా డిజిటల్ విభాగం కింద 32 మంది విద్యార్థులు రూ.7.09 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యారు. వీరిలో సీఎస్‌సీ నుంచి 13 మంది, సీఎస్‌ఎం నుంచి 12 మంది, ఈసీఈ నుంచి 7 మంది ఉన్నారు.నింజా విభాగం కింద మరో 28 మంది విద్యార్థులు రూ.3.4 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యారు. వీరిలో సీఎస్‌సీ నుంచి 9 మంది, సీఎస్‌ఎం నుంచి నలుగురు, ఈసీఈ నుంచి ఆరుగురు, ఈఈఈ నుంచి ఏడుగురు, ఎంఈసీ నుంచి ఇద్దరు ఉన్నారు.ఒకే సంస్థలో కళాశాలకు చెందిన 78 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్, ఇంటర్వ్యూ శిక్షణ అందిస్తున్నామని సాంబశివారెడ్డి తెలిపారు. విద్యార్థుల ప్రతిభ, అధ్యాపకుల కృషి, ప్లేస్‌మెంట్ విభాగం అందించిన ప్రత్యేక శిక్షణతోనే ఈ విజయాన్ని సాధించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ కంపెనీల్లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. జి. బాలకృష్ణ, కళాశాల వైస్ ప్రెసిడెంట్ డా. ఎం. రంజిత్ రెడ్డి, అధ్యాపకులు, ప్లేస్‌మెంట్ విభాగం సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు సమాజ భవిష్యత్తుకు బలమైన పునాది

● ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పుట్టపాక దశరథ యాదవ్

చిలుకూరు సెప్టెంబర్ 05(ప్రజావాణి):ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు మరియు లెక్చరర్లందరికీ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పుట్టపాక దశరథ యాదవ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త మరియు విద్యావేత్త అయిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించే వారే కాకుండా, విద్యార్థుల్లో మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికత మరియు బాధ్యతాయుతమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించే మార్గదర్శకులని తెలిపారు.ప్రత్యేకించి ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న లెక్చరర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వారి సేవలను ప్రభుత్వం మరియు సమాజం గుర్తించి, ప్రైవేట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.“తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, ఉపాధ్యాయులు మన జీవితానికి సరైన దిశను చూపిస్తారు. అజ్ఞానం అనే చీకటిని తొలగించి జ్ఞానం అనే వెలుగును ప్రసాదించే గొప్ప వ్యక్తులు గురువులు” అని పుట్టపాక దశరథ యాదవ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు మరియు లెక్చరర్లందరికీ మరోసారి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

నిస్వార్థ ప్రజా సేవకుడు దివంగత నేత హనుమంతు అప్పయ్య దొర

■ కాశీబుగ్గ రైల్వే వంతెనకు శంకు స్థాపన చేసి మహా నేత అప్పయ్య దొర
■ ఆఫ్ సోర్ రిజర్వాయర్ కోసము శ్రమపడిన జననేత అప్పయ్య దొర
■ అప్పయ్య దొర ఆశయాలను కొనసాగిద్దాం
■ మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు..
■ సీనియర్ అడ్వకేట్ వడిసి బాలకృష్ణ
■ సీనియర్ వైసీపీ నేత హనుమంతు వెంకటరావు మాస్టర్ దొర మాట్లాడారు.

పలాస ప్రజావాణి ప్రతినిధి నిస్వార్థ ప్రజా సేవకుడు దివంగత నేత హనుమంతు అప్పయ్య దొర అని మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు అన్నారు.కాశీబుగ్గ లో హనుమంతు అప్పయ్య దొర విగ్రహము వద్ద అప్పయ్య దొర వర్ధంతి సభ జరిగింది.ఈ సందర్భంగా మేజర్ మంత్రి డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ ప్రాంత అభివృద్ధికి, పలాస--తెక్కలి నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేసిన దివంగత మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్యదొర 13వ వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు,ప్రజలు ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పలాసలోని అప్పయ్యదొర విగ్రహానికి నివాళులర్పించి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన హనుమంతు అప్పయ్యదొర అనంతరం రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజా జీవితంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.బెండి పంచాయతీ సర్పంచ్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన అనంతరం ఎమ్మెల్యేగా,శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు.ఉద్దానం ప్రాంత అభివృద్ధి,సాగునీటి సమస్యల పరిష్కారం,ప్రజల సంక్షేమం కోసం అప్పయ్యదొర చేసిన కృషి చిరస్మరణీయమని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు.ముఖ్యంగా ఉద్దానం ప్రాంతానికి కీలకమైన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ కోసం అప్పయ్యదొర చేసిన కృషిని పలువురు నాయకులు ఈ సందర్భంగా గుర్తుచేశారు.
ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ,ప్రాంత అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని పనిచేసిన అప్పయ్యదొర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సేవకు అంకితం కావడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.పలాసలోని అప్పయ్యదొర విగ్రహం వద్ద ప్రతి సంవత్సరం జయంతి,వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆయన సేవలను స్మరించుకుంటున్నారు. 13వ వర్ధంతి సందర్భంగా కూడా ఆయనను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అన్ని తానై సభా కార్యక్రమాన్నీ నిర్వహించిన అప్పయ్య దొర తమ్ముని కుమారుడుహనుమంతు రామ్మోహన్ దొర (బుజ్జి మాస్టర్), దొర అభిమాని పైల జవహర్, జిల్లా వైసీపీ ప్రతినిధి బమ్మిడి దుర్యదన రావు,కోత పూర్ణ చంద్రరావు, మాజీ ఎంపీపీ ప్రతినిది ఉంగ సాయి, బ్రాహ్మంతర్ల కు చెందిన పైలా చిట్టి,పలాస మండల మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వర రావు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

పోచవరం కాలనీలో మొక్కలు నాటిన తాసిల్దార్ ధర్మేంద్ర ఎడవల్లి భాస్కరరావు

ప్రజావాణి ప్రతినిధి కూనవరం మండలం సెప్టెంబర్ 5 పోలవరం జిల్లా చింతూరు డివిజన్ కూనవరం మండలం పోచవరం కాలనీలో టీచర్స్ డే సందర్భంగా కూనవరం తాసిల్దార్ ధర్మేంద్ర తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు పాల్గొని గ్రామంలో 150 మొక్కలు నాటడం జరిగింది ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో మొక్కలు నాటడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని చెట్లు వల్ల కాలుష్యం రాకుండా మంచి గాలిని ఇస్తాయి దానివల్ల మన ఆరోగ్యాలు బాగుంటాయి అందుకు ప్రతి గ్రామంలో కూడా మొక్కలు నాటలని ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్ చేయాలని డ్రైనేజీలు శుభ్రంగా ఉంచుకోవాలని అని అన్నారు మొక్కలు ఏర్పాటు చేసిన పోచవరంకాలనీ యూత్ ని అభినందించారు ఈ కార్యక్రమంలో కో క్లస్టర్ ఫేక్ రసూల్ ,షేక్ మదర్ సాహెబ్ కాపుల మాణిక్యం కార్యదర్శి పోడియం, అప్పారావు , వెంకటేశ్వర్లు గుర్రం ప్రసాద్, శీలం వెంకటేశ్వర్లు, రామకృష్ణ, శివాజీ మాజీ సర్పంచ్ వాసం శ్రీనివాసరావు బోడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

సహకార సంఘాల్లో అవినీతికి పాలకులే కారణం

● దోషులను వెంటనే శిక్షించాలి.
● కర్నాకుల ఆంజనేయులు

పలాస ప్రజావాణి ప్రతినిధి కాకినాడ జిల్లాలో సహకార పరపతి సంఘాల జరుగుతున్న అవినీతి అక్రమాలకు కూటమి పాలకులే నైతిక బాధ్యత వహించాలని శనివారం నాడు కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామపంచాయతీ రంగవల్లి నగర్ లో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ రాజపూడి, గండేపల్లి, కిర్లంపూడి తదితర సంఘాల్లో నేటి వరకు సుమారు 150 కోట్ల అవినీతి జరిగిన బాధ్యులను శిక్షించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక జిల్లాలో, రాష్ట్రంలో ప్రతి వ్యవస్థలో దోపిడీ చేస్తూ వేల కోట్ల కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. అలాగే జిల్లాలో ఎక్కడ చూసినా పోలవరం కాలువ, కొండలు, గుట్టలను వదలకుండా మైనింగ్ మాఫియా అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తూ కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని, ఈ విషయంపై అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కనీసం స్పందించకపోవడం చూస్తుంటే జిల్లా యంత్రాంగం కూడా మామూళ్ల మత్తులో మునిగిపోయిందని తేటతెల్లమవుతుందని ఆయన తెలిపారు. కావున రాజపూడి, గండేపల్లి సహకార సంఘాల్లో జరిగిన అవినీతి పై తక్షణమే న్యాయ విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించే విధంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.
ఈ కార్యక్రమంలో రంగవల్లి నగర్ నాయకులు డాన్ శీను , కొండేపూడి మంగయమ్మ, కరుణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ రూపురేఖలు మారుస్తా

● ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సి ఎం దృష్టికి తీసుకెళ్లా
● మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి

అనంత పురం బ్యూరో సెప్టెంబర్05 ప్రజా వాణి అనంతపురం నగర సమీపంలో ఉన్న మార్కెట్ యార్డ్ రూపురేఖలు మారుస్తానని ,మార్కెట్ యార్డు కు ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం అని చైర్ పర్సన్ బల్లా పల్లవి స్పష్టం చేశారు. శనివారం అనంతపురం నగర సమీపంలో ఉన్న మార్కెట్ యార్డ్ ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ గా ఎన్నికైన తర్వాత ఎనిమిది నెలల కాలంలో మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ఎంతో కృషి చేసామన్నారు.గత ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ పేర్లు రైతులకు తెలియదన్నారు. మార్కెట్లో రైతుల కోసం షెడ్డును ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. అనంతరం సంత, భోజన ఏర్పాట్లు గురించి రైతులతో చర్చించడం జరిగిందని ఆమె తెలిపారు.

తవణంపల్లి లో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

తవణంపల్లి సెప్టెంబర్ 5 ప్రజావాణి : తవణంపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని మండల విద్యాశాఖ అధికారి 1 హేమలత, మరియు ఎంఈఓ 2 మోహన్ రెడ్డి, ఉపాధ్యాయుల బృందం చే ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ హేమలత, మోహన్ రెడ్డి, ఎమ్మార్వో మాధవ రాజు ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి, పాల్గొనడం జరిగింది. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం గుర్తు చేసుకుంటూ ఎంఈఓ హేమలత మాట్లాడుతూ భారత రెండో రాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న టీచర్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని, ఆయన భారత రాష్ట్రానికి మొదటి ఉప రాష్ట్రపతిగా రెండో రాష్ట్రపతి కూడా పనిచేశారని తెలియజేశారు. అనంతరం ప్రతిష్టాత్మకమైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో బోధించిన తొలి భారతీయ వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని కొనియాడారు. ఉపాధ్యాయుడిగా రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును అందించేందుకు బాటలు వేశారని అందుకే ఆయన విద్యార్థుల నుంచి ఎనలేని అభిమానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. సమాజానికి చేసిన సేవలను దృష్టిలో పెట్టుకొని పుట్టినరోజున టీచర్స్ డే ని నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారిందని, 1962వ సంవత్సరం నుంచి దేశ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైనదని అంతేకాదు ఎన్నో గొప్ప రచనలతో, మాటలతో, ఆయన దేశంలో ప్రజలను ప్రభావితం చేశారని మార్చలేని ఘతాన్ని గురించి ఆలోచించకుండా చేతిలో ఉన్న భవిష్యత్తుకై శ్రమించమని ఆయన పిలుపునిచ్చారని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ యొక్క గొప్పతనాన్ని వివరించారు. మరియు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి మెమొంటో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకుడు ఉపాధ్యాయుడు

పలాస ప్రజావాణి ప్రతినిధి సమాజ నిర్దేశకుడు ఉపాధ్యాయుడని హెచ్ఎం చిన్నమనాయుడు అన్నారు కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారము మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి నివాళులర్పించి ఆయన మాట్లాడారు.ఉపాధ్యాయుడు దశ దిశ నిర్దేశించే మహోన్నతుడని, సమాజంలో సమూల మార్పుకు కారకుడు ఉపాధ్యాయుడన్నారు. మంచి సమాజం నిర్మించాలన్నా అది కేవలము ఉపాధ్యాయుడు వలెనే అవుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు ఉపాధ్యాయులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హై స్కూల్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పెనుమూరులో ఘనంగా గురుపూజోత్సవం

● ఉత్తమ ఉపాధ్యాయుడు కె. నాగరాజు నాయుడుకు ఘన సన్మానం

పెనుమూరు(ప్రజావాణి ప్రతినిధి)సెప్టెంబర్ 5 పెనుమూరు మండలంలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన కె. నాగరాజు నాయుడును ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమానికి పెనుమూరు మండల టీడీపీ అధ్యక్షుడు పి. రుద్రయ్య నాయుడు, పెనుమూరు మాజీ సర్పంచ్ పెద్దినేని కృష్ణమూర్తి నాయుడు, పరమేశ్వర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడు కె. నాగరాజు నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా రుద్రయ్య నాయుడు, కృష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు కేవలం విద్యను అందించడమే కాకుండా, వారిలో క్రమశిక్షణ, విలువలు, మంచి నడవడికను పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. గురువుల సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.కె. నాగరాజు నాయుడు విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సన్మానించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం గురువుల పట్ల గౌరవాన్ని చాటిచెప్పేలా ఆద్యంతం ఉత్సాహంగా సాగింది.

మహమ్మద్ షమీని ధీటుగా ఎదుర్కొంటాం

● సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ వెల్లడి

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ కోసం అన్ని విధాల సిద్ధమయ్యామని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ తెలిపాడు. మహమ్మద్ షమీని సమర్థవంతంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం చెన్నై వేదికగా ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలో ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శనివారం మీడియా సమావేశంలో పాల్గొన్న తిలక్ వర్మ.. సౌత్ జోన్ తరఫున కేఎల్ రాహుల్ ఆడటం లేదని స్పష్టం చేశాడు. దేవదత్ పడిక్కల్‌తో పాటు సిరాజ్ బరిలోకి దిగుతున్నారని చెప్పాడు. 'సీనియర్ పేసర్ మహమ్మద్ షమీని అడ్డుకునేందుకు సిద్ధంగానే ఉన్నాం. ఈ మ్యాచ్ రసవత్తరంగానే ఉండబోతుంది. గత మ్యాచ్‌లో షమీ ఎలా బౌలింగ్ చేశాడో మేం గమనించాం. బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. అతని బౌలింగ్‌ను ఎదుర్కొని సత్తా చాటుతాం. కేఎల్ రాహుల్ ఈ మ్యాచ్ ఆడటం లేదు.'అని తిలక్ వర్మ తెలిపాడు. 54 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ తలపడుతున్నాయి. ఈ ఇరు జట్లు దులీప్ ట్రోఫీ ఫైనల్లో తలపడటం ఇది రెండోసారి మాత్రం. చివరి సారిగా 1970-71 సీజన్‌లో ముంబైలోని బ్రాబోర్న్ స్టేడియంలో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో సౌత్ జోన్ 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓవరాల్‌గా సౌత్ జోన్ దులీప్ ట్రోఫీ ఫైనల్ చేరడం ఇది 24వ సారి. ఇప్పటి వరకు సౌత్ జోన్ 13 టైటిళ్లు గెలిచింది. మరోవైపు 13 ఏళ్ల తర్వాత ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్.. చివరి సారిగా 2012-13 సీజన్‌లో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఇప్పటి వరకు 8 సార్లు ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్ రెండు టైటిళ్లు మాత్రమే గెలిచింది. ఈ ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకానున్నాడు. అతని పదవీకాలంపై ఇటీవల పెద్ద చర్చే జరిగింది. అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ.. వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉంది. ఈ విషయంపై చెన్నైలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా-అగార్కర్ మధ్య సమావేశం జరగనుంది. ఇటీవల బీసీసీఐ నిర్వహించిన రివ్యూ మీటింగ్‌కు అగార్కర్ హాజరు కాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల అతను ఈ మీటింగ్‌కు దూరంగా ఉన్నాడు. ఆసియా గేమ్స్ కోసం నెట్ బౌలర్లను ఎంపిక చేయనున్నారు. మయాంక్ యాదవ్, కార్తిక్ త్యాగితో పాటు మోహ్‌సిన్ ఖాన్‌కు అవకాశం రానుంది.

సీఎస్కే కెప్టెన్ మార్పు తప్పదా?

జట్టు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత సారథి రుతురాజ్ గైక్వాడ్‌ను తప్పించి, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌కు పగ్గాలు అప్పగించాలని ఫ్రాంచైజీకి సూచించారు. గత మూడు సీజన్లుగా చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా ప్లేఆఫ్స్ అర్హత సాధించడంలో విఫలమైంది. మరోవైపు 2026 సీజన్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ వ్యక్తిగత ప్రదర్శన కూడా తీవ్ర విమర్శలకు దారితీసింది. పవర్‌ప్లేలో అత్యంత తక్కువ స్ట్రైక్ రేట్ నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచిన రుతురాజ్, 28 సగటుతో కేవలం 337 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ క్రమంలో శాంసన్ జట్టులోకి రావడంతో నాయకత్వ బాధ్యతలు ఆయనకే అప్పగించాలనే డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి. సీఎస్కే ఎప్పుడూ స్థిరత్వానికి ప్రాధాన్యమిస్తుందని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోదని గుర్తుచేసిన రమేశ్.. తాజా పరిస్థితుల దృష్ట్యా మార్పు అనివార్యమని పేర్కొన్నారు. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మాట్లాడిన ఆయన.. "కెప్టెన్సీ మార్పు అవసరమా లేదా అనే అంశంపై సీఎస్కే పలు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు కనిపిస్తోంది. సంజూ శాంసన్ ఒక అద్భుతమైన టీమ్ ప్లేయర్ కాబట్టి అతడి పేరును తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. ఒకవేళ కెప్టెన్సీని మార్చాలనుకుంటే శాంసన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. ఐపీఎల్‌లో 66 మ్యాచ్‌లకు సారథ్యం వహించిన సంజూ 33 విజయాలు సాధించి, 50 శాతం విజయాల రేటును కలిగి ఉన్నాడు. అతని కెప్టెన్సీలోనే రాజస్థాన్ రాయల్స్ ఫైనల్‌కు చేరడంతో పాటు మరోసారి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. అయితే కేవలం సంజూను కెప్టెన్ చేసినంత మాత్రాన ట్రోఫీ గెలవలేరు, జట్టులో మరికొన్ని అంశాలను కూడా మార్చాల్సి ఉంది" అని విశ్లేషించారు. మరోవైపు మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ కూడా గతంలో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "రుతురాజ్ నుంచి కెప్టెన్సీ బాధ్యతలను తప్పిస్తే అతడు బ్యాటర్‌గా మరింత స్వేచ్ఛగా, మెరుగ్గా రాణించగలడు. అతనిపై నుంచి నాయకత్వ భారాన్ని తొలగించడం ఎలాంటి కఠిన నిర్ణయం కాదు. అది ఆటగాడితో పాటు ఫ్రాంచైజీకి కూడా మేలు చేస్తుంది" అని బద్రీనాథ్ పేర్కొన్నారు.

ఏడుగురు ఆటగాళ్ళపై పాకిస్థాన్ వేటు

ఇంగ్లండ్ జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్ జట్టు చిత్తుగా ఓడిపోయింది. దీంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు జట్టు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా, జట్టులో పెను మార్పులకు శ్రీకారం చుడుతూ, ఏకంగా ఏడుగురు ఆటగాళ్ళపై వేటు వేసింది. ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాక్ జట్టు 194 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. దీంతో సిరీస్ మధ్యలోనే సమూల మార్పులు చేపడుతూ ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించింది. అలాగే, రెడ్-బాల్ కోచింగ్ సిబ్బందిపై కూడా వేటు వేసింది. వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్, ఓపెనర్ ఇమామ్-ఉల్-హక్, పరిమిత ఓవర్ల క్రికెట్ మాజీ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘాతో పాటు అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, ముహమ్మద్ అవైస్ జాఫర్, ఖుర్రం షాజాద్లను జట్టు నుంచి విడుదల చేస్తున్నట్లు పీసీబీ ప్రకటించింది. వీరి స్థానంలో ఏడుగురు కొత్త ఆటగాళ్లను ఎంపిక చేసింది. వీరిలో సైమ్ అయూబ్, అబ్దుల్లా ఫజల్లకు టెస్ట్

అనుభవం ఉండగా, అరాఫత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బేగ్, మహమ్మద్ ఇమ్రాన్, రజావుల్లాలకు తొలిసారిగా టెస్ట్ జట్టులో చోటు లభించింది. ఆటగాళ్లపైనే కాకుండా కోచింగ్ సిబ్బందిలోనూ మార్పులు చేసింది. టెస్ట్ క్రికెట్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించింది. వారి స్థానంలో ఈ పర్యటన ముగిసే వరకు వైట్-బాల్ కోచ్ మైక్ హెసన్, యాష్‌లే నోఫ్కేలకు అదనపు బాధ్యతలు అప్పగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో పాకిస్థాన్ ఇప్పటికే 0-2తో వెనుకబడగా.. ఆటగాళ్ల పేలవ ఫామ్, గాయాల వివాదాలే ఈ మార్పులకు ప్రధాన కారణమని తెలుస్తోంది. కాగా, ఇరు జట్ల మధ్య మూడో టెస్ట్ మ్యాచ్ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభంకానుంది.

జోనల్ సవాల్

టైటిల్ వేటలో తిలక్ వర్మ, ఇషాన్ కిషన్

నేటి నుంచి దులీప్ ట్రోఫీ ఫైనల్

చెన్నై : దేశవాళీ క్రికెట్‌సర్క్యూట్‌లో జోనల్ సవాల్‌కు రంగం సిద్ధమైంది. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్‌లు తాడోపేడో తేల్చుకునేందుకు సై అంటున్నాయి. తిలక్ వర్మ సారథ్యంలో సౌత్ జోన్ టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుండగా.. భారత ఆటగాళ్లు దేవదత్ పడిక్కల్, మహ్మద్ సిరాజ్ చేరికతో ఆ జట్టు అవకాశాలు మరింత పెరిగాయి. ఇషాన్ కిషన్ కెప్టెన్సీలో ఈస్ట్ జోన్ 2013 తర్వాత తొలిసారి దులీప్ ట్రోఫీపై కన్నేసింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ, వెటరన్ పేసర్ మహ్మద్ షమి ఈస్ట్ జోన్ అవకాశాలను రెట్టింపు చేస్తున్నారు. మహ్మద్ షమి, శ్రేయాస్ గోపాల్‌కు ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో ఇది వందో మ్యాచ్ కావటం విశేషం.**వైభవ్‌పైనే ఫోకస్** వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో, భారత వైట్‌బాల్ క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టించడానికి ముందు అతడి కెరీర్‌ను మలుపు తిప్పిన ఇన్నింగ్స్ ఆస్ట్రేలియా అండర్-19పై చెపాక్‌లో బాదినదే. 58 బంతుల్లోనే సెంచరీతో యూత్ టెస్టులో వైభవ్ రికార్డు నెలకొల్పాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ నుంచి బరిలోకి దిగుతున్న వైభవ్ మళ్లీ ఆ తరహా విధ్వంసక ఇన్నింగ్స్‌పై గురిపెట్టాడు. శనివారం ప్రాక్టీస్ సెషన్లోనూ సూర్యవంశీ తనదైన శైలిలోనే రెచ్చిపోతూ సాధన చేయటం గమనార్హం. ఇటీవల శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో వరుస సెంచరీలు సాధించిన దేవదత్ పడిక్కల్ సౌత్ జోన్ నుంచి బరిలోకి దిగుతున్నాడు. భీకర ఫామ్‌లో ఉన్న పడిక్కల్‌ను ఈస్ట్ బౌలర్లు ఏ మేరకు నిలువరిస్తారో చూడాలి. కెఎల్ రాహుల్ సౌత్ జోన్ తుది జట్టులో ఆడటం లేదని కెప్టెన్ తిలక్ వర్మ తెలిపాడు. మహ్మద్ సిరాజ్ మరో హైదరాబాదీ పేసర్ సీవీ మిలింద్ సౌత్ జోన్ తరఫున పేస్ బాధ్యతలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దులీప్ ట్రోఫీ ఫైనల్ ఉదయం 9.30 గంటలకు ఆరంభం కానుంది.

ప్రిన్స్ యాదవ్ పై బీసీసీఐ ఫోకస్!

ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా రీఎంట్రీపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి అతడికి ఇప్పటివరకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ రాలేదు. రాబోయే అఫ్గానిస్థాన్ టీ20 సిరీస్, 2026 ఏషియన్ గేమ్స్ కోసం ఎంపిక చేసిన స్క్వాడ్స్‌లో బుమ్రా పేరు ఉన్నా, అతడి పాల్గొనడం ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని సమాచారం. ఇంగ్లాండ్‌తో జూలై 16న జరిగిన రెండో వన్డేలో బుమ్రా మోకాలికి మరోసారి ఇబ్బంది ఎదురైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంతకాలంగా వేధిస్తున్న మోకాలి సమస్య మరింత పెరిగినట్లు సమాచారం. ఆ మ్యాచ్ తర్వాత అతడు బౌలింగ్ చేయలేదు. ప్రస్తుతం రికవరీ ప్రక్రియ కొనసాగుతోంది. తను టీమిండియా లోకి ఎప్పుడు వస్తాననేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. బుమ్రా రీఎంట్రీ తేదీపై స్పష్టత లేకపోవడంతో సెలెక్టర్లు బ్యాకప్ ప్లాన్‌పై దృష్టి పెట్టినట్లు తాజా నివేదిక పేర్కొంది. ఈ క్రమంలో పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను ప్రాబబుల్ బ్యాకప్‌గా గుర్తించినట్లు సమాచారం. బుమ్రాతో పాటు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా కూడా ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. వీరికి వారం రోజుల పాటు మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులు నిర్వహించే అవకాశం ఉంది. ఈ పరీక్షల్లో ఫిట్‌నెస్ నిరూపించుకున్న తర్వాత సెప్టెంబర్ 10న ఢిల్లీ చేరే టీమ్‌తో కలిసే అవకాశం ఉంటుందని బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి.బుమ్రా విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరుపై మాజీ ఇండియా బ్యాటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. గత ఏడాది జనవరిలో బుమ్రాకు ఎదురైన వెన్ను గాయం తర్వాత అతడి వర్క్‌లోడ్‌ను జాగ్రత్తగా మేనేజ్ చేస్తున్నా; వరుసగా ఫిట్‌నెస్ సమస్యలు రావడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నాడు. బుమ్రా విషయంలో నిర్ణయాలు తీసుకునేది కెప్టెన్, కోచ్, సెలెక్టర్లేనని, అయినప్పటికీ తను టీమిండియాలో రెగ్యులర్ గా ఆడటం లేదని బద్రీనాథ్ అన్నాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేవలం ఆటగాడి శారీరక పరిస్థితి, అతడు ఏ మ్యాచ్‌లకు ఆడే స్థితిలో ఉన్నాడో సమాచారాన్ని మాత్రమే అందిస్తుందని తెలిపాడు. బుమ్రా ఒక్కడే కాదు. నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్ కూడా ప్రస్తుతం గాయాల కారణంగా ఆటకు దూరంగా ఉన్నారు. దీంతో కీలక సిరీస్‌లకు ముందు ఇండియా టీమ్ ఫిట్‌నెస్ పరిస్థితిపై ఆసక్తి నెలకొంది. మరోవైపు ప్రపంచకప్ మరో ఏడాది మాత్రమే సమయం ఉండటంతో బుమ్రా ఫిట్ నెస్ సాధించకపోవడం, తరచూ గాయపడుతుండటంపై భారత అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్రికెట్ పిచ్‌పై భారత్ జపాన్ ఫ్రెండ్ షిప్..

భారత్, జపాన్ దేశాల మధ్య 75 సంవత్సరాల ద్వైపాక్షిక దౌత్య సంబంధాల వేడుకలను పురస్కరించుకుని ఇరు దేశాల పురుషుల జట్లు ప్రత్యేక అంతర్జాతీయ టీ20 మ్యాచ్ లో పాల్గొననున్నాయి. ఈ మ్యాచ్ కోసం 'సుజుకి కప్' ను నిర్వహించనున్నట్లు జపాన్ క్రికెట్ అసోసియేషన్ (జేసీఏ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సంయుక్తంగా అధికారిక ప్రకటన చేశాయి. జపాన్‌లోని తోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా సెప్టెంబర్ 22న ఈ చారిత్రాత్మక పోరును నిర్వహించనున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్ 75' పేరుతో ఈ క్రీడా సంబంధాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం ఇండియా చేస్తున్న ప్రయత్నాలకు కూడా ఈ భాగస్వామ్యం ఊతమివ్వనుంది. ఆ సమయంలో జపాన్ వేదికగా జరిగే ఏషియన్ గేమ్స్ లో పాల్గొనే భారత పురుషుల జట్టులోని స్టార్ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ వంటి ఆటగాళ్లు ఈ చారిత్రక మ్యాచ్ లో బరిలోకి ఆడనున్నారు. ఈ విశేష సందర్భంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ, "ఈ అరుదైన మ్యాచ్ లో భాగస్వామి కావడం బీసీసీఐకి ఎంతో సంతోషాన్నిస్తోంది. భారత జట్టు సరికొత్త గడ్డపై అడుగుపెట్టడానికి, జపాన్ తో పాటు తూర్పు ఆసియా ప్రాంతంలో క్రికెట్ ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ఇదొక గొప్ప అవకాశం. ఇరు దేశాల మధ్య ఉన్న చిరకాల మైత్రికి ఈ మ్యాచ్ మరింత వన్నె తెస్తుంది. సంప్రదాయ క్రికెట్ దేశాలకు ఆవల కూడా ఆటను విస్తరించడం ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ బోర్డుగా బీసీసీఐ బాధ్యత" అని తెలిపారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ జట్టును జపాన్ హోమ్ గ్రౌండ్‌కు ఆహ్వానించడం తమ అసోసియేషన్‌కు దక్కిన గౌరవమని జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నవోకి అలెక్స్ మియాజీ పేర్కొన్నాడు. "భారత క్రికెట్ అభిమానుల ఉత్సాహాన్ని స్వాగతించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. జపాన్ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో స్టేడియానికి వచ్చి ఆటను ఆస్వాదించి మా జట్టును ప్రోత్సహించాలి" అని అతడు వ్యాఖ్యానించాడు. ఈ ప్రత్యేక పోరు ద్వారా ఈస్ట్ ఆసియా మార్కెట్ లో క్రికెట్ క్రేజ్ ను పెంచడానికి బీసీసీఐ, జేసీఏ పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయని తెలుస్తోంది. రాబోయే కాలంలో జపాన్ లో క్రికెట్ మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు బీసీసీఐ సాంకేతిక సహకారాన్ని కూడా అందించనుంది.

నాని సినీ ప్రయాణానికి 18 ఏళ్లు..

ఫ్యాన్స్‌కు నేచురల్ స్టార్ స్వీట్ మెసేజ్

హీరో నాని సినీ ప్రయాణం 18 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అభిమానులు, ప్రేక్షకులకు అతడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు. వారి ప్రేమను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదని చెప్పారు. ఇకపై కూడా అలా చేయబోనని స్పష్టం చేశాడు.

"18 ఏళ్లు.. అధికారికంగా సినిమాల్లో పెద్దవాడినయ్యా" అంటూ నాని 'ఎక్స్'లో పోస్టు చేశాడు. "మీ ప్రేమను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదు.. ఇకపై కూడా తీసుకోబోను" అని రాసుకొచ్చాడు.

నాని హీరోగా పరిచయమైన తొలి చిత్రం 'అష్టా చమ్మా'. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 2008 సెప్టెంబర్ 5న విడుదలైంది. అప్పటి నుంచి నటుడిగా మొదలైన నాని ప్రస్థానం హీరోగా, నిర్మాతగా ఎదిగే స్థాయికి చేరింది.

ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'లో నటిస్తున్నాడు. ఎస్ఎల్‌వీ సినిమాస్ నిర్మిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలుత మార్చి 26న విడుదల చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత ఆగస్టు 21కి మార్చారు. చివరగా సెప్టెంబర్ 24కు వాయిదా వేశారు.

ఇటీవల విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. రక్తంతో తడిసిన లుక్‌లో నాని కనిపించడం అభిమానుల్లో ఆసక్తి పెంచింది. రెండు జడలతో కనిపిస్తూ.. చేతిలో బ్లేడ్‌లతో చేసిన గొలుసుతో నాని కనిపించే సన్నివేశాలు టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అణచివేతకు గురైన ప్రజలు తిరుగుబాటు చేయడం చుట్టూ కథ సాగుతుందనే సంకేతాలు టీజర్ ఇచ్చింది. ఇందులో మోహన్‌బాబు ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. "ఈ దేశం ఎవరిది? మనది" అనే డైలాగ్‌లు టీజర్‌లో వినిపించాయి.

'ది ప్యారడైజ్' హిందీ, తెలుగు, తమిళం, ఇంగ్లిష్, స్పానిష్, బెంగాలీ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది.

ఆకట్టుకుంటున్న 'ఎపిక్' ట్రైలర్

బ్లాక్‌బస్టర్ హిట్ 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న కొత్త చిత్రం 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. యూత్‌ఫుల్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. '90ఎ' వెబ్ సిరీస్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన ఆదిత్య హాసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి.ట్రైలర్‌ను బట్టి చూస్తే, ఈ సినిమా లండన్ కాలేజీ నేపథ్యంలో సాగే ఓ అందమైన ప్రేమకథ అని స్పష్టమవుతోంది. ప్రేమ, స్నేహం, భావోద్వేగాలు, జీవితంలోని మలుపులతో కథనం సాగనుంది. "ఒక ప్రేమకథ.. ఎన్నో భావోద్వేగాలు.. పూర్తికాని ఓ అధ్యాయం" అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దినట్టు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఆనంద్, వైష్ణవి మధ్య కెమిస్ట్రీ మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. వారిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలకు శ్రోతల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా విడుదలైన ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

జోరు పెంచిన ఖుషీ కపూర్..

జెన్ జీ కి బెస్ట్ చాయిస్!

దివంగత నటీమణి, అందాలతార శ్రీదేవి చిన్న కూతురుగా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ఖుషీ కపూర్. ఈమె తన సోదరీ జాన్వీ కపూర్ రేంజ్ లో పాపులారిటీ సంపాదించుకోలేదు. కానీ ఈ మధ్యకాలంలో జెన్ జీ యువతను టార్గెట్ చేసుకొని చేస్తున్న పనులు , ఇస్తున్న ఫోజులు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అంతేకాదు ఈమెకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెడుతున్నాయి అనడంలో సందేహం లేదు. ప్రస్తుతం శ్రీదేవి గతంలో నటించిన మామ్ చిత్ర సీక్వెల్ మామ్ 2 లో తన దివంగత తల్లి శ్రీదేవి పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే .ముఖ్యంగా కరిష్మా తన్నాతో కలిసి ఖుషీ కపూర్ ఈ సినిమాలో నటిస్తోంది. ఒకవైపు ఆ సినిమా షూటింగ్లో బిజీగా ఉంటూనే..మరొకవైపు అద్భుతమైన ఫ్యాషన్ స్టోరీ తో ఆడియన్స్ ను ఆకట్టుకుంది. గ్రాజియా ఇండియా కవర్ పేజీపై భిన్నమైన ఆకృతులతో ఫోజులిచ్చి అభిమానులను మెస్మరైజ్ చేసింది . పైగా తన ట్రెండీ ఔట్ఫిట్ తో ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంది. ఫోటోషూట్ లో భాగంగా నాలుగు విభిన్నమైన లుక్స్ తో ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈమె అందులో ఒకటి ఆలివ్ కలర్ సీక్విన్డ్ కార్డిగాన్ టాప్ ధరించి, దీనికి కాంబినేషన్లో వాల్యూమినస్ డెనిమ్ లాంగ్ స్కర్ట్ ధరించి అవుట్ ఫిట్ తో ఆకట్టుకుంది. మరో లుక్ లో ఓవర్ సైజ్డ్ డెనిమ్ జాకెట్ ధరించి.. దీనికి కింద బ్లూ షర్ట్ పై వైట్ కలర్ చెక్స్ కలిగిన షర్ట ధరించింది. పైన బటన్స్ ఓపెన్ చేసి రెండు చేతులతో షర్ట పట్టుకున్న ఈమె.. దీనికి కాంబినేషన్లో డెనిమ్ ప్యాంట్ ధరించింది. తన మేకోవర్ ను ఫుల్ ఫీల్ చేసుకోవడానికి కలర్ఫుల్ డిజైన్ కలిగిన నెక్లెస్ ధరించింది.

పాపరాజీపై సల్మాన్ ఆగ్రహం

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ మరోసారి పాపరాజీపై తన అసహనాన్ని ప్రదర్శించాడు. ప్రముఖ రియాలిటీ షో 'బిగ్ బాస్ 20' సెట్స్‌లో ఓ ఫొటోగ్రాఫర్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఇది నీ పని కాదు' అంటూ ఫొటోగ్రాఫర్‌కు చురకలంటించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సెప్టెంబర్ 6న ప్రారంభం కానున్న బిగ్ బాస్ 20 షో ప్రీమియర్ ఎపిసోడ్ షూటింగ్ శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా కౌబాయ్ తరహా దుస్తుల్లో స్టేజ్‌పైకి వచ్చిన సల్మాన్‌ను ఫొటోలు తీసేందుకు పాపరాజీలు పోటీ పడ్డారు. ఈ క్రమంలో కొందరు ఫొటోగ్రాఫర్లు ఆయన్ను 'బాబా' అని పిలుస్తూ ఫొటోలకు పోజులివ్వమని కోరారు.

దీంతో సల్మాన్ ఒక్కసారిగా అసహనానికి గురయ్యారు. "బాబా? యహ్ తేరా కామ్ నహీ హై. ముఝే కెమెరా కే ఆగే ఆనే కీ కోయీ జరూరత్ నహీ హై" (బాబా? ఇది నీ పని కాదు. నేను కెమెరా ముందుకు రావాల్సిన అవసరం లేదు) అంటూ తీవ్రంగా స్పందించాడు. వారు పదేపదే "ఫొటోస్.. ఫొటోస్.." అని అడగడంతో మరింత విసుక్కున్నాడు.

సల్మాన్‌కు, పాపరాజీలకు మధ్య పలుమార్లు ఇలాంటి ఘటనలు జరిగాయి. అయితే, ఈ వాగ్వివాదం తర్వాత సల్మాన్ కొందరు ఫొటోగ్రాఫర్లతో కలిసి ఫొటోలకు పోజులిచ్చినట్లు కూడా తెలుస్తోంది. మరోవైపు, ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో బిగ్ బాస్ 20 సెట్ నుంచి కొన్ని ఫొటోలను పంచుకున్నాడు.

తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్

ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు'...

'ఆ నలుగురు', 'అందరి బంధువయా' వంటి హృద్యమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న విలక్షణ దర్శకుడు చంద్ర సిద్ధార్థ్, మరో విభిన్నమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో, ఫిల్మోత్సవ్ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం.. "ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు". భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్‌గా నిలుస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 18న విడుదల కానుంది.ఈ చిత్రం ఒక హై-కాన్సెప్ట్ సైకలాజికల్ మిస్టరీ మ్యూజికల్ మూవీగా రూపుదిద్దుకుంది. దివంగత ప్రముఖ రచయిత, దర్శకుడు మదన్ అందించిన కథతో ఈ సినిమాను చంద్ర సిద్ధార్థ్ తెరకెక్కించారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఆ నలుగురు' క్లాసిక్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. సౌండ్ థెరపీ, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, అపరాధ భావన వంటి అంశాలను కథలో కీలక మలుపులుగా చూపిస్తూ, సంగీతం-మానవ మెదడు మధ్య ఉన్న సంబంధాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు చంద్ర సిద్ధార్థ్ మాట్లాడుతూ, "ఈ కథ నా స్నేహితుడైన మదన్‌తో కలిసి చేయాలనుకున్న ప్రాజెక్ట్. ఇది ఆయన చివరిగా ప్లాన్ చేసిన సినిమా. ప్రతిరోజూ రాత్రి 10:30 గంటలకు ఒక రేడియో స్టేషన్ నుంచి ఒకే పాట ప్రసారమవుతుంది. ఆ పాటను నెమలిపాలెం నుంచి కొందరు వ్యక్తులు కోరుతుంటారు. అదే ఈ సినిమా టైటిల్ వెనుక ఉన్న రహస్యం. ధ్వని, న్యూరోసైన్స్, ప్రేమ వంటి అంశాలతో ముడిపడిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. ఇది ఒక ప్రయోగాత్మక ప్రయత్నం" అని వివరించారు.

ఈ చిత్రంలో హర్ష హీరోగా పరిచయం అవుతుండగా, అమైరా గోస్వామి, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ, అశోక్‌వర్ధన్, రేఖా నిరోషా కీలక పాత్రలు పోషించారు. జే రెక్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలో నాలుగు పాటలు ఉన్నాయి. మానవ సంబంధాలను సున్నితంగా ఆవిష్కరించే చంద్ర సిద్ధార్థ్, ఈసారి ఒక ఆధునిక థ్రిల్లర్‌తో ఎలాంటి మ్యాజిక్ చేస్తారోనని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com